
స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు
వీధుల్లో రథోత్సవం

రథోత్సవం.. రమణీయం..

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఎనిమిదో రోజు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత వరాహ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం కన్నులపండువగా జరిగింది. భక్తుల నమోనమః నారసింహ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. వేదపండితులు కల్యాణ ఘట్టాలను వివరించారు. సాయంత్రం స్వామివారు ఉభయ దేవేరులతో రథోత్సవంలో గ్రామ వీధుల్లో విహరించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- సింగరాయకొండ (ఆంధ్రజ్యోతి)



2,185 బేళ్ల తిరస్కరణ

- నోబిడ్‌లు అధికం
- గరిష్ఠంగా పొదిలిలో 42.29 శాతం

ఒంగోలు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాదిలోని పొగాకు వేలం కేంద్రాల్లో బేళ్లు భారీగానే వెనక్కు వెళ్తున్నాయి. అందులో బోర్డు అధికారులు సూచించిన ధరలకు బయ్యర్లు కొనుగోలు చేయక నోబిడ్ (తిరస్కరణ)లు ఆయ్యేవి అత్యధికంగా ఉంటున్నాయి. దక్షిణాదిలోని 11వేలం కేంద్రాల్లో శుక్రవారం మొత్తం 7,988 బేళ్లను వేలంకు రైతులు తీసుకువచ్చారు. అందులో 5,083 మాత్రమే బయ్యర్లు కొనుగోలు చేశారు. 2,185 వెనక్కు పంపారు. వెనక్కి పంపిన వాటిలో నోబిడ్‌లు అయినవి 1,625 ఉన్నాయి. మొత్తం వేలంకు తెచ్చిన బేళ్లలో 27.3 శాతం బేళ్లు నోబిడ్‌లు కాగా ఎస్ఎల్ఎస్ రీజియన్‌లోని అత్యధికంగా పొదిలి వేలం కేంద్రంలో ఏకంగా 42.29 శాతం నోబిడ్‌లు అయ్యాయి. కలిగిరిలో 32.85శాతం, కనిగిరిలో 32.30శాత బేళ్లు నోబిడ్‌లు అయ్యాయి. ఎస్‌బీఎస్ రీజియన్‌లో చూస్తే ఒంగోలు-1 కేంద్రంలో గరిష్ఠంగా 18.72శాతం బేళ్లు నోబిడ్‌లు అయ్యాయి.

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

- 30లోపు ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశం
- ఉద్యోగి స్వగ్రామ, మండలంలో పోస్టింగ్ ఇవ్వొద్దు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ సచివాలయాలను జనాభా ఆధారంగా రేషనలైజేషన్ చేయగా తగిన విధంగా ఉద్యోగులను నియమించాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. కేటగిరీ-ఏలో కనీసం ఆరుగురు ఉద్యోగులు, కేటగిరీ-బీలో ఏడుగురు, కేటగిరీ-సీలో 8 మంది ఉద్యోగులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో కలెక్టర్లను ఆదేశించారు. ఉత్తర్వుల ప్రకారం 2025 మే 31 నాటికి ఒకే సచివాలయంలో ఐదేళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులందరినీ బదిలీ చేయాలి. సచివాలయ ఉద్యోగి స్వగ్రామ మండలంలో కాకుండా ఇతర మండలాల్లో నియమించాలి. సచివాలయాల ఉద్యోగులను బదిలీలు చేసే అధికారాలను కలెక్టర్లు/నియామక అధికారులకు కల్పించారు. ఈనెల

మిగతా 6లో...

15 నుంచి వైద్యశాఖలో బదిలీలు

ఒంగోలు కలెక్టరేట్,జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్యఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహించేందుకు ఆ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే బదిలీల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలనతో పాటు ఆయా దరఖాస్తులపై వచ్చిన అభ్యంతరాలను కూడా పరిష్కరించారు. అనంతరం ఉద్యోగుల సీనియారిటీ జాబితాలను కూడా ప్రకటించారు. మొత్తం పది క్యాడర్ల ఉద్యోగుల బదిలీలు జరుతున్నాయి. అయితే ఎక్కువ మంది ఉద్యోగుల బదిలీలు ఏఎన్ఎంలవి ఉన్నాయి. దీంతో ఆ శాఖ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఈ బదిలీల కౌన్సెలింగ్‌ను వెబ్ ద్వారా నిర్వహించాలా? లేక మాన్యువల్‌గా నిర్వహించాలా? అన్నదానిపై స్పష్టత రాలేదు. వైద్యశాఖ ఉన్నతాధికారుల నుంచి స్పష్టత వచ్చిన తర్వాత నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మిగిలిన క్యాడర్ ఉద్యోగులు తక్కువగా ఉండటంతో వాటి బదిలీలను ముందుగానే నిర్వహించేందుకు ఆశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈనెల 19వతేదీ లోపు ఈ బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో తదనుగుణంగా చర్యలు తీసుకున్నారు.


కుమారులతో మౌనిక

నీకు, నీకు, నీకు.... ముగ్గురికీ పడ్డాయ్

కొండపిలోని ఎస్సీ కాలనీకి చెందిన యనమద్ది వీరప్రతాప్, మౌనికలకు ముగ్గురు పిల్లలు. పెద్దబ్బాయి కొండపిలోని హైస్కూల్‌లో ఈ ఏడాది 7వ తరగతికి, అమ్మాయి మూడో తరగతికి, చిన్న అబ్బాయి రెండో తరగతికి కొండపి ఎస్సీ కాలనీలోని ఎంపీపీ స్కూల్‌లో ఈ ఏడాది ప్రమోట్ అయ్యారు. ఈ ముగ్గురు పిల్లలకు ఒక్కొక్కరికి రూ.13 వేల చొప్పున రూ.39 వేల రూపాయలు వారి తల్లి మౌనిక ఖాతాలో శుక్రవారం పడ్డాయి.


డబ్బు లెక్క పెడుతున్న ఈ మహిళ ఒంగోలులోని రాజాపానగల్ రోడ్డులో నివాసముండే అయినాబత్తిన వెంకట రమణ. ఈమె కుమారుడు మహేష్ చదువు కోసం తల్లికి వందనం కింద రూ.13వేలు తన ఖాతాలో జమ కావడంతో డ్రా చేసి లెక్కిస్తూ ఆనందం వ్యక్తం చేస్తోంది.

నాడు ఒక్కరికి.. నేడు ముగ్గురికీ..

మార్కాపురానికి చెందిన ఆరేపల్లి రాజ్యలక్ష్మి దంపతులకు ముగ్గురు పిల్లలు. గత ప్రభుత్వంలో ఒక్కరికే అమ్మఒడి అందింది. ఈ ప్రభుత్వంలో ముగ్గురు పిల్లలకు కలిపి 'తల్లికి వందనం' ద్వారా రూ.39వేలు తల్లి ఖాతాలో జమయ్యాయి. వారి పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన యూనిఫాం, బూట్లు, బెల్టు, బ్యాగు కూడా ఇచ్చారు. సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం అందుతోంది. పిల్లలు చాలా ఇష్టంగా పండుగ వాతావరణంలో స్కూలుకు వెళుతున్నారని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.


భర్త, పిల్లలతో ఆరేపల్లి రాజ్యలక్ష్మి

ఎంతో ఆనందంగా ఉంది

పుల్లలచెరువులోని ఎస్సీ కాలనీకి చెందిన లింగంగుంట్ల యేసులు, యేసేబుకు కుమారుడు పరిశుద్ధ బాబు, కుమార్తె మనోహ ఉన్నారు. కుమారుడు ఆరో తరగతిలోకి, కుమార్తె నాలుగులోకి అప్‌గ్రేడ్ అయ్యారు. తల్లికి వందనం కింద రూ.26వేలు తన ఖాతాలో జమవడంతో ఆనందంగా ఉందని యేసులు హర్షం వ్యక్తం చేశారు.


భర్త, పిల్లలతో యేసులు

ఒక్కరికి కాదు.. అందరికీ..

తల్లుల కళ్లలో ఆనందం. ఇంట్లో ఒక్కరు కాదు.. ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ తల్లికి వందన పథకం కింద డబ్బులు పడుతున్నాయి. మెసేజ్ చూసుకుని తల్లులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గురువారం రాత్రి నుంచి లబ్ధిదారుల ఖాతాలలో పథకం లబ్ధి జమవుతోంది. బడుల ప్రారంభం రోజునే డబ్బులు చేతికి రావడంతో విద్యార్థుల చదువుకు అవసరమైన సామగ్రి కొనుగోలుకు తల్లిదండ్రులు సిద్ధమయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ సిక్స్ పథకాలు అమలవుతుండటంతో అందరిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

- తల్లికి వందనంతో కుటుంబాల్లో ఆనందం
- బ్యాంకు అకౌంట్లలో జమ అవుతున్న నగదు
- జిల్లావ్యాప్తంగా పథకంపై హర్షాతిరేకాలు
- బడుల ప్రారంభం రోజునే చేతికి వచ్చిన నగదు
- పాఠశాలల్లో విద్యార్థులకు కిట్ల పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పునఃప్రారంభం రోజునే తల్లికివందనం పథకం ద్వారా తల్లుల ఖాతాలో నగదు జమ చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టారు. జిల్లాలో 2,65,559 మంది విద్యార్థులకు ఈ లబ్ధి చేకూరుతోంది. ఈ నగదు మొత్తాన్ని 1,68,063 మంది తల్లుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. జిల్లాలో 1వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న విద్యార్థులందరికీ ఈ పథకం ద్వారా భారీగా లబ్ధి చేకూరుతున్నది. ఒక్కొక్క విద్యార్థికి తల్లికివందనం కింద రూ.15వేలు ఇస్తుండగా అందులో రూ.2 వేలను కలెక్టర్ బ్యాంకు ఖాతాకు జమ చేస్తున్నారు. కలెక్టర్ బ్యాంకు ఖాతాకు జమ చేసిన నగదును ఆ పాఠశాలల అభివృద్ధికి వినియోగించే విధంగా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

ఇద్దరు పిల్లలు ఉంటే తల్లికి వందనం ద్వారా ఒక్కొక్క కుటుంబానికి రూ.26వేలు జమ అవుతుండగా ముగ్గురు పిల్లలు ఉంటే రూ.39వేలు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయి.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

పాఠశాలల ప్రారంభం రోజు నుంచి విద్యార్థులు చదువుకునేందుకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, షూలు, తదితర అన్ని రకాల కిట్లను పంపిణీకి చేస్తున్నారు. అయితే ప్రస్తుతం ఉపాధ్యాయుల బదిలీలు జరుగుతుండటంతో ఉపాధ్యాయులు పాఠశాలల్లో ఇంకా చేరలేదు. ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ శనివారంతో ముగుస్తుంది. సోమవారం పాఠశాలల్లో కొత్త ఉపాధ్యాయులు చేరిన అనంతరం పాఠశాలల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజాప్రతినిధుల సమక్షంలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రం నుంచి మండల విద్యావనరుల కేంద్రాలకు చేరగా అక్కడి నుంచి పాఠశాలలకు సరఫరా చేసి విద్యార్థులకు అందించేందుకు

మిగతా 6లో...


పాత జడ్పీ సమావేశపు హాలులో కౌన్సెలింగ్‌కు వచ్చిన ఉపాధ్యాయులు

కొనసాగుతూనే..

మూడోరోజు ప్రశాంతంగా ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్


ఒంగోలు కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలు మూడో రోజైన శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. స్థానిక పాత జిల్లాపరిషత్ సమవేశపు హాలులో ఈ బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఆద్వర్యంలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలు పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. ఆయా కేటగిరీల వారీగా ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భారీగా ఉపాధ్యాయులు తరలివచ్చారు. వరుస సంఖ్య 1301 నుంచి ప్రారంభమై 2,300 వరకు జరిగింది. ఈ బదిలీల ప్రక్రియను శనివారానికి ముగించే విధంగా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకున్నారు. విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ అబ్రహం కౌన్సెలింగ్ హాలు వద్దనే ఉండి పరిశీలించారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీల కోసం ఉపాధ్యాయ సంఘాలు జిల్లా పరిషత్ సమావేశపు హాలు వద్ద భారీ ఏర్పాట్లు చేశారు. ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అవసరమైన చర్యలు తీసుకున్నారు. మరోవైపు విద్యాశాఖ ద్వారా కూడా ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఏర్పాట్లు చేశారు.

15నుంచి చెంచు ప్రాంతాల్లో
ప్రయోజన సంతృప్తి శిబిరాలు
కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం 7

వైద్యసేవల కోసం వెళ్తే కరోనా నిర్ధారణ

- బయటపడుతున్న కోవిడ్ కేసులు
- జిల్లాలో 12 నమోదు
- గుంటూరు జీజీహెచ్‌లో మరో 12
- ఐదు మండలాల్లోనే ఇవన్నీ..
- అప్రమత్తమైన వైద్యశాఖాధికారులు
- అత్యవసరమైతే ర్యాపిడ్‌కిట్స్‌తో పరీక్షలు చేసేందుకు సన్నాహాలు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : వివిధ రకాల వ్యాధులతో వైద్యశాలలకు వెళ్లిన రోగులకు కరోనా బయటపడుతోంది. ఆ విధంగా జిల్లాలో 24 కేసులు నమోదయ్యాయి. ఒంగోలులోని రిమ్స్‌లో 12 కేసులు బయటపడగా, గుంటూరు జీజీహెచ్‌లో వైద్య సేవలకు వెళ్లిన మన జిల్లాకు చెందిన మరో 12 మంది కరోనా బారినపడినట్లు బయటపడింది. అందుకు సంబంధించిన కరోనా డేటాను కూడా గుంటూరు నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి పంపారు. మార్కాపురం, చీమకుర్తి, ఒంగోలు, తర్లుబాడు, కొత్తపట్నం మండలాల్లో ఈ కరోనా కేసులు వచ్చాయి. ఇందులో ఒక వ్యక్తి షిర్డీకి వెళ్లి రాగా, మరికొందరు వివిధ ప్రాంతాలకు వెళ్లి వచ్చినవారు ఉన్నట్లు తెలుస్తోంది. జూన్ 4వతేదీ నుంచి శుక్రవారం వరకు ఉన్న డేటా ప్రకారం జిల్లాలో 24 కేసులు నమోదయ్యాయి. వారందరూ కోలుకున్నారు. వారందరూ వివిధ ఆరోగ్య సమస్యలతో వైద్యశాలలకు వెళ్లి అత్యవసరంగా సర్జరీలు చేయాల్సి రావడంతో ఆ సమయంలో ఆర్‌టీపీసీ టెస్టులు చేశారు. ఈ టెస్టులో వారికి కరోనా పాజిటివ్ ఉన్నట్లు బయటపడటంతో ఆయా వైద్యశాలల్లోనే ఎక్కువ మంది చికిత్స పొందగా మరికొంత మంది హోమ్ ఐసోలేషన్‌లో ఉన్నారు. ఒంగోలులో ఈ పక్షం రోజుల్లో 300 మందికి కరోనా టెస్టులు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఏదైనా అనుమానం ఉంటే కరోనా టెస్టు చేసేందుకు ఒంగోలులోని రిమ్స్‌లోని ల్యాబ్‌కు పంపే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. అత్యవసర సమయంలో వినియోగించుకొనేందుకు జిల్లాకు సుమారు ఐదువేల ర్యాపిడ్ కిట్స్ కూడా అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం వస్తున్న కరోనా కేసులకు ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని వైద్యాధికారులు చెప్తున్నారు. జ్వరం, జలుబు వంటివి ఉన్నా టెస్టుల్లో పాజిటివ్ చూపిస్తుందని, అందువల్ల ప్రజలు ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాదికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు తెలిపారు.



అర్ధరాత్రి పులి పంజా

పాలుట్ల గూడెంలో పశువుల దొడ్డిపై దాడి
ఒక ఎద్దు, ఆవు మృతి 6



రక్త నిల్వలు

జిల్లాలో రక్తనిధి కేంద్రాలు వెలవెల
రెడ్‌క్రాస్, రిమ్స్ బ్లడ్ బ్యాంక్‌లు అధ్వాన
దాతలు ముందుకురావడం లేదంటున్న డాక్టర్లు
నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం 7

అర్ధరాత్రి పులి పంజా

పాలుట్ల గూడెంలో పశువుల దొడ్డిపై దాడి
ఒక ఎద్దు, ఆవు మృతి
కన్నీటిపర్యంతమైన రైతు సేవ్యానాయక్
ఆందోళన చెందుతున్న గిరిజన కుటుంబాలు



పులిదాడిలో గాయపడి మృతి చెందిన ఆవు

ఎర్రగొండపాలెం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం మండలం పాలుట్ల గిరిజనగూడెంలో గురువారం రాత్రి ఆవులదొడ్డిపై పులి దాడి చేసింది. కరంతోటి సేవ్యానాయక్‌కు చెందిన ఒక ఎద్దు, ఆవును చంపేసింది. ఈ ఘటన గురువారం రాత్రి జరిగింది. గ్రామ సచివాలయం పక్కనే ఆవులదొడ్డి ఉండటంతో వాటి యజమాని ఆవులను, అరక ఎద్దులను దొడ్డిలో తోలి ఇంటికి వెళ్లాడు. రాత్రి సమయంలో దొడ్డిలోకి పులి ప్రవేశించడంతో ఆవులు అటుఇటూ బెదురుతూ పరుగెత్తుతుండటాన్ని చూసిన స్థానికులు పెద్దగా కేకలు వేయడంతో గూడెం గిరిజనులు అక్కడకు చేరుకున్నారు. వారంతా కేకలు వేయడంతో పులి అక్కడ నుంచి వెళ్లిపోయింది. అప్పటికే పులి దాడిలో గాయపడిన అరక ఎద్దు, ఆవు మృతిచెందాయి. వాటిని చూసి యజమాని సేవ్యానాయక్ కన్నీరుమున్నీరయ్యారు. అరక ఎద్దు విలువ రూ.70 వేలు, ఆవు విలువ రూ.40 వేలు ఉంటుందని, మొత్తం రూ.1.10 లక్షలు నష్టం వాటిల్లిందని విలపిస్తూ తెలిపారు. ఈ ఘటనతో పాలుట్ల గిరిజనులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలుట్లలో ఆవుల దొడ్లు 20కిపైగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో పులుల దాడి నుంచి తమను, పశుసంపదను కాపాడాలని ఫారెస్టు అధికారులకు గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మధ్యాహ్న భోజనం మరింత రుచిగా...

అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలలకు సన్నబియ్యం
విద్యాలయాలకే నేరుగా సరఫరా
క్యూఆర్ కోడ్‌ను హెచ్‌ఎం స్కాన్ చేస్తేనే ఆ స్కూలు వాటా దిగుమతి

సంతనూతలపాడు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడంతో పాటు వారికి బలవర్థక ఆహారం అందించేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. మధ్యాహ్న భోజన పథకం అమలులో గత ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న లోటుపాట్లు సరిచేసేందుకు సర్కారు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యమైన సన్నబియ్యాన్ని సరఫరా చేయాలని నిర్ణయించారు. గతంలో సరఫరా చేసిన బియ్యంలో నాణ్యత సరిగా లేకపోవడంతో అన్నం ముద్దగా ఉండేది. దీంతో చాలామంది పిల్లలు ఇంటి నుంచి భోజనం తెచ్చుకునేవారు. ఈ ఏడాది వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం నుంచి అన్ని రకాల ప్రభుత్వ బడుల్లో సన్న బియ్యంతో వండిన అన్నాన్ని విద్యార్థులకు వడ్డిస్తున్నారు.

మండలంలో 46 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజనానికి సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. గతంలో పౌరసరఫరాల శాఖ ద్వారా డీలర్‌కు అక్కడ నుంచి పాఠశాలలకు బియ్యం తరలించేవారు. ప్రస్తుతం నేరుగా పాఠశాలలకు, హాస్టళ్లకు ఇస్తున్నారు. 25 కేజీల బ్యాగ్‌గా తయారు చేసి క్యూర్‌కోడ్ ట్యాగ్‌తో సరఫరా చేస్తున్నారు. ఈ కోడ్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్కాన్ చేస్తే ఓటీపీ ఆధారంగా ఆ పాఠశాల కోటాను సిబ్బంది దింపి వెళతారు.



మధ్యాహ్నభోజనం చేస్తున్న విద్యార్థులు

వంటసిబ్బందికి శిక్షణ పూర్తి

మధ్యాహ్న భోజనం వండి పెట్టే నిర్వాహకులకు, వంట చేసే వారికి మండలాల వారీగా గత వారం కిందటే శిక్షణ ఇచ్చారు. విజయవాడలో శిక్షణ పొందిన వారు మండల స్థాయిలో వంటచేసేవారికి శిక్షణ ఇచ్చారు. వంటచేసే విషయంలో శుభ్రమైన పద్ధతుల్లో ఏ విధంగా వంట చేయాలో, పోషక విలువలు పాడవకుండా ఏ విధంగా చేయాలో వంట చేసే చోటు పరిశుభ్రత తదితర అంశాలపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చారు.

రైతులను ఆదుకునేందుకే పొగాకు కొనుగోలు

మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ

పర్చూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నల్ల బర్లీ రైతులను ఆదుకునేందుకే ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు శ్రీకారం చుట్టిందని మార్క్‌ఫెడ్ బాపట్ల జిల్లా డీఎం కరుణశ్రీ అన్నారు. కొనుగోలుకు సంబంధించిన విధివిధానాలు, పాటించాల్సిన నియమాలు తదితర అంశాలపై శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో వ్యవసాయాధికారులు, పీఏసీఎస్ సిబ్బంది, రైతుసేవా కేంద్రాల సిబ్బంది, రైతులు, ఐటీసీ ప్రతినిధి కల్యాణ రామిరెడ్డి సారథ్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొగాకు గ్రేడులు తదితర అంశాలపై చర్చించారు. ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనల ప్రకారం రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేస్తామన్నారు. ఐటీసీ ప్రతినిధి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా బర్లీ పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం ముందుకు రావడం హర్షించతగ్గ విషయం అన్నారు. ఏడీఏ ఎస్.మోహనరావు, ఏవో రామమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



పొగాకు నాణ్యతపై అవగాహన కల్పిస్తున్న మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, ఐటీసీ ప్రతినిధి కళ్యాణరామిరెడ్డి, ఏడీఏ మోహనరావు

మంత్రి అచ్చెన్నాయుడితో ఎమ్మెల్యే ఏలూరి భేటీ

మంత్రి దృష్టికి బర్లీ పొగాకు కొనుగోలుపై సమస్యలు

పర్చూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ పొగాకు కొనుగోలుకు సంబంధించిన పలు విషయాలపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్థానిక రైతులతో కలసి వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడితో శుక్రవారం భేటీ అయ్యారు. పొగాకు రైతులకు సంబంధించిన పలు సమస్యలను మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకుపోయారు. రైతుల వద్ద ఉన్న బర్లీ పొగాకు మొత్తాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలని ఈ సందర్భంగా ఏలూరి కోరారు. కార్యక్రమంలో పర్చూరు నియోజకవర్గంలోని ఆయా మండలాల నాయకులు నాయుడు హనుమంతురావు, పొద వీరయ్య చౌదరి, కొల్లా శ్రీనివాసరావు(ఫ్యాక్టరీ), పోట్రు శోభన్, అడ్డగడ వెంకటేశ్వర్లు, కారుమంచి కృష్ణ, పోపూరి శ్రీనివాసరావు, హుస్సేన్, దాసి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి అచ్చెన్నాయుడుతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

సాగర్ కాలువలో జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభం

రూ.1.56 కోట్లు నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, జూన్13 (ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కోనంకి సబ్‌డివిజన్ పరిధిలో పర్చూరు నియోజకవర్గ పరిధిలో 48 పనులు నిమిత్తం రూ.1.56 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో సాగర్ కాలువలో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడతారు. పర్చూరు నియోజకవర్గ పరిధిలో సాగర్ కాలువలలో జంగిల్ క్లియరెన్స్ తోపాటు మెయిన్‌టెయిన్స్ పనులు నిమిత్తం నిధులు మంజూరుకు ఎమ్మెల్యే ఏలూరి జలవనరుల శాఖకు ప్రత్యేకంగా ప్రతిపాదనలను పంపించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిధులను మంజూరు చేసింది. గత ప్రభుత్వంలో సాగర్ కాలువలలో చిన్న చిన్న పనులు నిమిత్తం ఒక్క పైసా కూడా నిధులను మంజూరు చేయలేదు. దీంతో సాగర్ కాలువలలో పిచ్చిచెట్లు, తుమ్మచెట్లు విపరీతంగా పెరిగాయి. తద్వారా సాగర్ జలాలు వచ్చినపుడు దిగువకు నీరు సక్రమంగా ప్రవహించకపోవడంతో దిగువ పొలాలను కలిగిన రైతులు నీరు అందక చాలా ఇబ్బందులకు గురయ్యేవారు. చాలా చోట్ల కాలువలు చిట్టడవిగా మారాయి. దీంతో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పర్చూరు నియోజకవర్గంలో రైతులకు ప్రాణప్రదమైన సాగర్ కాలువలో జంగిల్ క్లియరెన్స్ పనులు, కొన్నిచోట్ల పూడికతీత పనులు చేపట్టాలని ఎమ్మెల్యే ఏలూరి భావించారు. అందుకోసం నిధులు మంజూరుకు ఏలూరి చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఎట్టకేలకు నిధులను మంజూరుచేయడంతో నియోజకవర్గ పరిధిలో మొదటగా శుక్రవారం యద్దనపూడి బ్రాంచ్ కెనాల్‌లో రామకూరు 37వ మైలు వద్ద నుంచి దిగువకు 1.8 కిమీ వరకు సాగర్ కాలువలో రెండు వైపులా 1.84 కోట్ల నిధులతో జంగిల్ క్లియరెన్స్ పనులను ప్రారంభించారు. ఈ పనులను సాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి ప్రారంభించారు. ఇంకా మిగిలిన నిధులతో నియోజకవర్గ పరిధిలో సాగర్ కాలువలలోని పనులను త్వరలోనే ప్రారంభిస్తారని ఎన్ఎస్‌పీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాటి నాగేశ్వరరావు, కొర్రపాటి కాజారావు, నీటి సంఘం అధ్యక్షులు తేలప్రోలు సుబ్బారావు, తాటి నాగార్జున, ముద్దన హనుమంతరావు, కరణం మారుతి పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న చక్రపాణి, డీఈ స్వామి

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

చినగంజాం, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలో వేంచేసిన మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారి బి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామివార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం వేదపండితుల వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా దంపతులతో కల్యాణ క్రతువు నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని భక్తులు కనులారా తిలకించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మహిళా భక్తులు భజనా కార్యక్రమాన్ని నిర్వహించారు. కడవకుదురు గ్రామంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. సూమారు మూడు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటి సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో హెచ్‌కేఎం ట్రస్ట్‌కు సాయం

అద్దంకిటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటిన్లకు ఆహారం అందజేస్తున్న ట్రస్ట్‌కు రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆర్థిక సాయాన్ని అందజేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాంటిన్లకు ఆహార పదార్థాలు సర ఫరా చేస్తున్న మంగళ గిరిలోని హరే కృష్ణ మూమెంట్(హెచ్‌కెఎం) చారిటబుల్ ట్రస్ట్‌కు వంటశాలకు అత్యాధునిక వంట మిషన్ల ఏర్పాటుకు రోటరీ 3150 డిస్టిక్ తరఫున రూ.2 కోట్ల నిధి సేకరించాలని జిల్లాలోని అన్ని క్లబ్‌లకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో అద్దంకిలోని రోటరీ క్లబ్ తరఫున రూ.55 వేలను జిల్లా క్లబ్‌కు అందజేశారు. దీనికి సంబంధించి రోటరీ మిత్రులను శుక్రవారం రోటరీ కార్యాలయంలో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళి సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, నరసింహరావు, లేవి ప్రసాద్, రామకోటేశ్వరరావు, హరిప్రసాద్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



దాతలను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ట్రాన్స్‌జెండర్‌కు తీవ్రగాయాలు



ప్రమాదస్థలంలో దెబ్బతిన్న స్కూటీ

ఒంగోలు(రూరల్), జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు రోడ్డులో లారీ ఢీకొనడంతో ట్రాన్స్‌జెండర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. శుక్రవారం బియ్యంలారీ స్థానిక ఎఫ్‌సీఐ గూడెంలోకి వెళ్లే సమయంలో ట్రాన్స్‌జెండర్ స్కూటీపై వెళుతూ వేగంగా వెనుక వైపు ఢీకొట్టింది. దీంతో ఆమెకు తీవ్రగాయాలు కాగా స్థానికులు వైద్యశాలకు తరలించారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

(5వ పేజీ తరువాయి)

30లోపు బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలి. కంటిచూపులేని ఉద్యోగులు, మానసిక వైకల్యంతో ఉన్న పిల్లల తల్లిదండ్రులు, గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు పైగా పనిచేసిన ఉద్యోగులు, 40 శాతం పైగా వైకల్యం ఉన్న ఉద్యోగులు, దీర్ఘకాలిక వ్యాధులున్న ఉద్యోగులు, భర్తలేనటువంటి మహిళా ఉద్యోగులకు ప్రాధాన్యత ఇవ్వాలి. దంపతులిద్దరూ ఉద్యోగులైతే సమీప ప్రాంతాల్లోనే నియమించాలి. ఈ బదిలీలు స్వచ్ఛంద బదిలీలుగా పరిగణించి ప్రయాణభత్యం, ఇతర ప్రయోజనాలు కల్పించాలి. ముందుగా ఐటీడీఏ ప్రాంతాల్లో ఖాళీలను పూర్తిచేసిన తర్వాతనే మిగిలిన సచివాలయాల్లో భర్తీ చేయాలి. సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తయిన తర్వాత సచివాలయాల రేషనలైజేషన్‌లో మిగిలిపోయిన ఉద్యోగుల వివరాలను హెచ్‌ఆర్‌ఎంఎస్ పోర్టర్‌లో జూలై 10లోపు నమోదు చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

ఒక్కరికి కాదు.. అందరికీ..

(5వ పేజీ తరువాయి)

విద్యాశాధికారులు చర్యలు తీసుకున్నారు.

బ్యాంకు ఖాతాతో ఆధార్ అనుసంధానం తప్పనిసరి

ఒంగోలు నగరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తల్లికి వందనం నిధులు విడుదల చేస్తోందని, ఇవి బ్యాంకు ఖాతాకు జమ కావాలంటే ఆధార్ నంబరుతో ఖాతాను అనుసంధానం చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్ కోరారు. 9, 10 తరగతులు చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు తల్లికి వందనం నిధులు తల్లుల ఖాతాలకు జమ అవుతాయని, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు వారి ఖాతాలకు నిధులు జమ చేస్తారని తెలిపారు. ఆధార్ నంబర్‌ను బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేసి, ఆ ఖాతా వివరాలను సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల్లో వెల్ఫేర్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ ద్వారా ఎన్‌పీసీఐ పోర్టల్‌లో అనుసంధానం చేసుకోవాలని కోరారు. ఈ నెల 16వ తేదీలోగా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు.

రూ.26 వేలు పడ్డాయి



తల్లికి వందనం పథకంలో భాగంగా మా ఇద్దరు పిల్లలకు కలిపి రూ.26 వేలు బ్యాంక్ ఖాతాలో జమయ్యాయి. డ్రా చేసుకున్నాను. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు విద్యార్థుల విద్యాభివృద్ధి నిమిత్తం తల్లిదండ్రులకు తోడ్పాటు అందించేలా ఈ పథకం అమలు చేసి నగదు జమ చేసిన టీడీపీ కూటమి ప్రభుత్వం పనితీరు అభినందనీయం.

- పోతిపోగు రమణమ్మ, యర్రబాలెం ఎస్సీకాలనీ, దొనకొండ మండలం

ఎంతో ఆనందంగా ఉంది



తాండవ వెంకటరవణమ్మ కుటుంబ సభ్యులు

మా ముగ్గురు పిల్లలకు కలిపి రూ.39వేలు బ్యాంక్ అకౌంట్‌లో జమయ్యాయి. నాకు చా లా ఆనందంగా ఉంది. మా పిల్లల దొనకొండలోని ప్రైవేటు స్కూల్‌లో చదువుతున్నారు. వారి చదువుకు ఇబ్బందీ లేకుండా ఆర్థిక సహకారం అందించిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

- తాండవ వెంకటరమణమ్మ, గుట్టమీదపల్లి, దొనకొండ మండలం

బంగారు గొలుసు చోరీ కేసులో నిందితుడి అరెస్టు : సొత్తు స్వాధీనం

అవీఇవీ



స్వాధీనం చేసుకున్న బంగారు గొలుసు, చోరీ చేసిన నిందితుడితో ఎస్ఐ వినోద్‌బాబు

పంగులూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): దేవుడి ప్రసాదంలో మత్తు మందు కలిపి నమ్మకంగా తినిపించి స్పృహ కోల్పోయిన మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసు చోరీ చేసిన అంతర్ జిల్లా దొంగను రేణంగివరం పోలీసులు అదుపులోకి తీసుకుని సొత్తు రికవరీ చేశారు. ఎస్ఐ వినోద్‌బాబు అందించిన సమాచారం మేరకు... గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం బొగ్గిల్లువడ్డేశ్వరం గ్రామానికి చెందిన పబ్బరాజు వెంకటయుగంధర్ గత నెలలో బూదవాడ గ్రామంలో వజ్రాల కృష్ణారెడ్డి వద్దకు వచ్చి పరిచయం చేసుకుని ఇల్లు అద్దెకు కావాలని అడిగాడు. వెంకటయుగంధర్ మాటలు నమ్మిన కృష్ణారెడ్డి తన ఇంటి సమీపంలో ఖాళీగా ఉన్న వజ్రాల హనుమారెడ్డి ఇంటిని అద్దెకు ఇప్పించాడు. గత నెల 18వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో యుగంధర్ ముందుగా మత్తు మందు కలిపిన పదార్థాన్ని అన్నవరం ప్రసాదం పేరుతో కృష్ణారెడ్డి దంపతులకు అందజేశాడు. అదితిన్న దంపతులిద్దరూ స్పృహ కోల్పోయి నిద్రకు ఉపక్రమించారు. అనంతరం కృష్ణారెడ్డి భార్య మెడలో గొలుసును అపహరించాడు. గొలుసు చోరీ జరిగిన విషయాన్ని ఈ నెల 12న రేణంగివరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పలు చోరీల కేసులలో పట్టుబడిన చరిత్ర ఉన్న యుగంధర్ ఫొటోను చూపించగా ఇంటిలో అద్దెకు దిగిన వ్యక్తిని అతనేని కృష్ణారెడ్డి గుర్తించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో వెంకటయుగంధర్ ఉన్న ప్రాంతానికి చేరుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. చోరీ చేసిన గొలుసును స్వాధీనం చేసుకున్నట్లు వినోద్‌బాబు తెలిపారు. నిందితుడిని శుక్రవారం అద్దంకి మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

సముద్రతీరంలో అధికారులు యోగాంధ్ర

చీరాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రామాపురం సముద్రతీరం అధికారులు నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంతో ఆహ్లాదకరంగా మారింది. సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం శుక్రవారం రామాపురం తీరంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చీరాల పరిధిలోని అన్ని ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులు సిబ్బంది యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్, ఆర్‌డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్లు, గోపీకృష్ణ, పార్వతి, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, డీఈ రఘురామ్, తదితరులు పాల్గొన్నారు.

యోగాతోనే ఆరోగ్యవంతమైన జీవితం



యోగాసనాల ద్వారా అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

పర్చూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) యోగాతోనే ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమౌతుందని పర్చూరు మండల హోమియా వైద్యులు, యోగాంధ్ర మాస్టర్ ట్రైనర్ డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన పర్చూరు బొమ్మల కూడలిలో యోగాంధ్ర కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలు ఆసనాలు వేసి ప్రజను చైతన్య పరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పనిఒత్తిడితో ప్రజలు మానసిక రుగ్మతలకు లోనవుతున్నారన్నారు. తద్వారా వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. దీన్ని అదిగ మించేందుకు ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో యార్లగడ్డ శ్రీనివాసరావు, బి.సాంబశివరావు, వై.పోలిరెడ్డి, షేక్.బాజీబాషా.తదితరులు పాల్గొన్నారు.

బాబు, పవన్‌లను దూషించిన వ్యక్తిపై కేసు



ఫిర్యాదు చేస్తున్నజనసేన నేతలు

ఒంగోలు క్రైం, జూన్13(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మీద అసభ్య పదజాలంతో మాట్లాడిన వ్యక్తిపై ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. అల్లూరికి చెందిన మంచికంటి గరిటారెడ్డి అసభ్యపదజాలంతో మాట్లాడటంతో జనసేన పార్టీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చిట్టెం ప్రసాద్, కార్యదర్శి ముత్యాల కళ్యాణ, కృష్ణ, పెన్నా ప్రాంతీయ కమిటీసభ్యురాలు బొందిల శ్రీదేవి, నగరకార్యదర్శి పల్ల ప్రమీల పాల్గొన్నారు.

సంతమాగులూరు మద్యం షాపు లైసెన్స్ రద్దు

జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు

బాపట్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సంతమాగులూరు మండలంలోని జీఎస్.ఎల్ నెంబరు బిపిఎల్ /98 షాపు లైసెన్స్ రద్దు చేసినట్లు జిల్లాప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు తెలిపారు. లైసెన్స్‌దారులు ప్రభుత్వానికి ఫీజు చెల్లించకపోవటంతో రద్దు చేసినట్లు చెప్పారు. దీనికి సంబంధించి నూతన లైసెన్స్ ఇవ్వటానికి దరఖాస్తులు స్వీకరణకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాల మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. దరఖాస్తు చేయదల్చిన వారు జిల్లాలోని అద్దంకి, బాపట్ల, రేపల్లె, వేమూరు, నగరం, చీరాల, పర్చూరు ఎక్సైజ్ స్టేషన్‌లలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 12వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించబడుతాయన్నారు. 21వ తేది ఉదయం 8గంటలకు కలెక్టరేట్ ఆవరణంలో డ్రా తీస్తామన్నారు.

'పొదిలి'లో మద్యం షాపునకు దరఖాస్తుల ఆహ్వానం


ఒంగోలు క్రైం, జూన్13(ఆంధ్రజ్యోతి): పొదిలి రూరల్ మండలంలో ఒక మద్యం షాపు ఏర్పాటుకు ఔత్సాహికులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఎక్సైజ్ అధికారి షేక్ ఆయేషాబేగం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు తుది గడువు ఈనెల19 సాయంత్రం 5 గంటల వరకు అని, దరఖాస్తుదారులు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. పొదిలి జీఎస్ నంబరు 71 షాపునకు దరఖాస్తులు కోరుతున్నామని తెలిపారు. ఈనెల 21న ఉదయం 8 గంటలకు కలెక్టర్ సమక్షంలో డ్రా తీస్తామని, దరఖాస్తుదారులు అందరూ డ్రాలో పాల్గొనాలని ఆమె కోరారు.

• ఒంగోలులోని రిమ్స్‌లో గురువారం రాత్రి ఓ వృద్ధురాలు అనారోగ్యంతో అత్యవసరంగా చేరారు. ఆమెకు అవసరమైన నెగిటివ్ గ్రూప్ రక్తం అక్కడ లేకపోవడంతో అర్ధరాత్రి ప్రైవేటు రక్త బ్యాంకుల చుట్టూ తిరగాల్సివచ్చింది. ఎలాగోలా రక్తం తీసుకొచ్చేలోపు ఆమె ప్రాణాలు విడిచింది.

• ఒంగోలుకు చెందిన ఓ వ్యక్తికి ఇటీవల ఆరోగ్యం బాగలేదు. త్రోవగుంట సమీపంలో ఉన్న ఓ ప్రముఖ ఆసుపత్రిలో చేరారు. ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. ఓ పాజిటివ్ బ్లడ్ గ్రూప్ 3 యూనిట్లు అవసరం కావడంతో రక్తం కోసం నగరంలోని ప్రైవేటు బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వచ్చింది.

• ఒంగోలుకు చెందిన రుక్మిణమ్మ అనే మహిళకు అత్యవసరంగా ఆపరేషన్ చేయాల్సి రావడంతో స్థానిక దక్షిణ బైపాస్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. ఓ పాజిటివ్ రక్తం రెండు యూనిట్లు కావాల్సి ఉన్నా లభించే పరిస్థితి లేదు.

రక్త నిల్వేలు



శుక్రవారం ఒంగోలులో రక్త నిల్వ వివరాలు		
గ్రూప్	రెడ్ క్రాస్	జీజీహెచ్
ఓ పాజిటివ్	02	04
ఓ నెగిటివ్	01	02
ఏ పాజిటివ్	00	05
ఏ నెగిటివ్	00	01
బి పాజిటివ్	04	03
బి నెగిటివ్	00	00
ఏబీ పాజిటివ్	03	03
ఏబీ నెగిటివ్	00	00

ఒకరి రక్తంతో ముగ్గురికి ప్రాణదానం

డాక్టర్ వెన్నెల, పెథాలజీ విభాగం, జీజీహెచ్



ఒకరు రక్తం దానం ముగ్గురు ప్రాణాలు కాపాడుతుంది. రక్తదానంపై అనేకమందిలో అపోహలు ఉన్నాయి. ఏడాదిలో రెండు, మూడుసార్లు రక్తం ఇవ్వడం వలన మనిషి మరింత ఆరోగ్యంగా ఉంటారు. అవగాహన లోపం వలన రక్తదాతలు ముందుకు రావడం లేదు. ఏ ప్రతిఫలం ఆశించకుండా స్వచ్ఛందంగా రక్తదానం చేసే వారు ఉన్నప్పటికీ క్రమేపి వారి సంఖ్య తగ్గిపోతోంది. ఈ ఏడాది రక్తదానం చేయండి.. మరొకరి ప్రాణం కాపాడండి నినాదంతో ముందుకెళుతున్నాం.

- జిల్లాలో వెలవెలబోతున్న రక్తనిధి కేంద్రాలు
- ప్రభుత్వ సంస్థలైన రెడ్‌క్రాస్, రిమ్స్ బ్లడ్ బ్యాంక్‌లు మరీ అధ్వానం
- రక్తదాతలు ముందుకురావడం లేదంటున్న డాక్టర్లు
- అత్యవసరంలో పరుగులు పెడుతున్న బాధితులు
- అంతోఇంతో ఆదుకుంటున్న ప్రైవేట్ సంస్థలు

నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

ఒంగోలు, కార్పొరేషన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రమాద బాధితులకు ప్రాణదాతలు కరువయ్యారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తాన్ని అందించే రక్తనిధి కేంద్రాల్లో సరిపడా రక్త నిల్వలు కొరత ఏర్పడటంతో ఆ కేంద్రాలు వెలవెలబోతున్నాయి. ఫలితంగా ప్రమాదాల బారినపడిన బాధితులు బోరుమంటున్నారు. ప్రస్తుత సమాజంలో నెలకొన్న కొన్ని అపోహలు, కోవిడ్ కారణాలతపాటు అవగాహన లోపంతో రక్తదానం చేసేందుకు అధికశాతంమంది ముందడుగు వేయడంలేదు.

ఒంగోలు నగరంలో నామమాత్రపు రుసుం, రీప్లేస్‌మెంట్ పద్ధతిన రక్తాన్ని సరఫరా చేసేందుకు నాలుగు బ్లడ్‌బ్యాంక్‌లు ఉండగా, జిల్లాలోని దరిశి, కనిగిరి, గిద్దలూరులో రకాన్ని భద్రపరిచే కేంద్రాలున్నాయి. అయినా వీటిలో సరిపడినంతా రక్తం లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. అత్యవసర పరిస్థితుల్లో ఆసరాగా ఉంటాయని భావించి, ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పరుగెత్తుకొచ్చేవారికి బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఒంగోలు జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన బ్లడ్‌బ్యాంక్ రోగులకు సరిపడా రక్తం అందించే పరిస్థితి లేదు. నెలకు సుమారు 250 నుంచి 350 యూనిట్లు అవసరం ఉండగా, ప్రస్తుతం పదుల సంఖ్యలో కూడా లేవు. కేవలం హాస్పిటల్‌లోని ఇన్‌పేషెంట్‌లకు మాత్రమే నామమాత్రపు రుసుంతో రక్తాన్ని అందించాల్సి ఉండగా, రక్తాన్ని దానం చేసేవారు లేకపోవడంతో రోగుల బంధువుల నుంచి సేకరించిన రక్తంతో కాలం వెళ్లబుచ్చుతున్నారు. అత్యవసర పరిస్థితులు కావలసిన ఇతర గ్రూప్‌లు అందుబాటులో లేకపోవడంతో హాస్పటల్ సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. దీంతో బాధితులు ప్రైవేటు బ్లడ్ బ్యాంక్‌లకు పరుగులు పెడుతున్నారు.

ఒంగోలులో సొసైటీ పేరుతో నామమాత్రపు రుసుంతో పనిచేస్తున్న రెడ్‌క్రాస్ సంస్థలో ఓ డాక్టరు, ముగ్గురు టెక్నీషియన్స్, స్టాఫ్ నర్సు, మెడికల్ ఆఫీసర్, ఒకొక్కరు పనిచేస్తున్నారు. వైద్య సిబ్బంది ఉన్నప్పటికీ అవసరమైన రక్తం అందుబాటులో లేదు. ఉన్న కొద్దిపాటి గ్రూపులు సామాన్య బాధితులకు సరిపడినంత రక్తం లేదు. ఇక బిలీఫ్ బ్లడ్ బ్యాంక్, న్యూ విజన్ బ్లడ్ బ్యాంక్‌లు పూర్తిగా ప్రైవేటు సంస్థ కావడంతో కొద్దో గొప్పో రక్తాన్ని సేకరించి భద్రపరిచి అమ్మకాలు చేపడుతున్నారు. వైద్యులు మాత్రం ప్రజలలో అవగాహన లోపించడమే కారణమని చెబుతూ చేతులు దులిపేసుకుంటున్నారు. ప్రజలలో చైతన్యం కలిగి రక్తాన్ని దానం చేస్తే బాధితులకు భరోసాగా కల్పించాల్సిన అవసరం ఉంది. నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి కథనం.

• అవగాహన లోపం

ప్రతి వ్యక్తి రక్తాన్ని దానం చేయడం వలన ఆరోగ్యంగా జీవించవ్చని వైద్యుల చెబుతున్నారు. ప్రధానంగా కొలెస్ట్రాల్, బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధులను దూరం చేసుకోవచ్చని నిపుణులు తెలుపుతున్నారు. కానీ నేటి సమాజంలో ప్రజలు రక్తాన్ని దానం చేయడం వలన నీరసించి, బలహీన పడతామేమోని, కొత్త వ్యాధులు బయట పడతాయనే అపోహలో రక్తం దానం చేయకపోవడంతో మనిషి మరింత అనారోగ్యానికి లోనవుతారని వైద్యులు అంటున్నారు.



• కష్టాలెదుర్కొంటున్న బాధితులు

ప్రస్తుతం పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల కారణంగా రోజుకు పది యూనిట్ల వరకు రక్తం అవసరమవుతుందని సంబంధిత టెక్నీషియన్‌లు అంటున్నారు. ఒంగోలులోనే నెలకు మూడువందల యూనిట్ (బ్యాగ్)లు అవసరముండగా జిల్లాలో వెయ్యి యూనిట్ల వరకు ఉంటుందని తెలిపారు. వీరిలో ప్రతి నెలా తలసీమీయా, కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులకు ప్రతి నెలా క్రమం తప్పకుండా రక్త మార్పిడి చేయాల్సి ఉంటుంది కాబట్టి ప్రతి నెలా వీరి వద్ద నుంచి రీప్లేస్ తీసుకోలేమంటున్నారు. రీప్లేస్‌లో వచ్చిన కొద్ది యూనిట్‌లలో అన్నీ పరీక్షలు నిర్వహించగా హెపటైటస్ బీసీ, హెచ్ఐవీ పాజిటివ్, మలేరియా, షుగర్ వంటి వ్యాధులు ఉన్నట్లయితే ఉపయోగం ఉండదు.

• ఎవరు రక్తదానం చేయవచ్చు

18 నుంచి 60ఏళ్లలోపు వయస్సు కలిగివారు ఏడాదిలో రెండు, మూడుసార్లు రక్తాన్ని దానం చేయవచ్చు. నాడి 60-100 కొట్టుకొని ఉండాలి, 60 నుంచి 80 శాతం వరకు రక్త కలిగిన వారు రక్తదానం చేయవచ్చు ఈ విధంగా చేయడం ద్వారా బాడీస్క్రీనింగ్‌తోపాటు వాధ్యి నిరోధక శక్తి పెరుగుతుంది. ఈ విధంగా చేయడం ద్వారా గుండెపోటు, బీపీ, షుగర్, కొలెస్ట్రాల్, ఒబెసిటీని రాకుండా చేయవచ్చు.



15నుంచి చెంచు ప్రాంతాల్లో ప్రయోజన సంతృప్తి శిబిరాలు

కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం



వర్చువల్ కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని చెంచు హ్యాబిటేషన్లలో ఈనెల 15నుంచి 20వ తేదీ వరకు కేంద్రప్రభుత్వం నిర్దేశించిన విధంగా ధర్తి అబా అభియాన్ అవగాహన, ప్రయోజన సంతృప్తి శిబిరాలను నిర్వహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఈ శిబిరాల ద్వారా చెంచుల జీవనస్థితిగతులను పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలని ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి శుక్రవారం ఐటీడీఏ పీవో, ఇతరప్రభుత్వ శాఖల అధికారులతో నిర్వహించిన వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా పరిధిలో చెంచు హ్యాబిటేషన్లలో ఈ కార్యక్రమాలను నిర్వహించి పూర్తిస్థాయిలో నివేదికలు తయారుచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రోజుకోక హ్యాబిటేషన్‌లో సంబంధిత శాఖల అధికారులు గ్రామసభలు నిర్వహించి ప్రభుత్వపరంగా వారికి అందుతున్న పథకాల అమలు తీరు, వారి అవసరాలను అధ్యయనం చేయాలని శ్రీశైలం చెంచు ప్రాజెక్టు పీవోను కలెక్టర్ ఆదేశించారు. ఈ వర్చువల్ కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ అధికారి వరలక్ష్మీ, వివిధ శాఖల అధికారులు డాక్టర్ వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్, బాల శంకరరావు, శ్రీనివాసప్రసాద్ ఉన్నారు.

రేపు పాకల బీచ్‌లో యోగాంధ్ర కార్యక్రమం

పాల్గొననున్న మంత్రి స్వామి, కలెక్టర్

సింగరాయకొండ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాకల సముద్రతీరంలో ఆదివారం ఉదయం 7గంటలకు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శుక్రవారం తహసీల్దార్ బి. రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ హాజరవుతారని పేర్కొన్నారు. అనంతరం 1500 మందితో యోగా సామూహిక ప్రదర్శన జరుగుతుందని వివరించారు. మండలంలోని పది గ్రామాల ప్రజలు యోగాలో పాల్గొనాలని తహసీల్దార్ కోరారు.

లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

ముగ్గురికి గాయాలు



ధ్వంసమైన బస్

అద్దంకి, జూన్13(ఆంధ్రజ్యోతి): నామ్ రోడ్డులో మలుపు తిరుగున్న లారీని వెనుక వైపు నుంచి ట్రావెల్స్ బస్ ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... అద్దంకి వైపు నుంచి చినకొత్తపల్లి సమీపంలోని ఫ్యాక్టరీకి వెళ్లేందుకు తవుడు లారీ గురువారం అర్ధరాత్రి నామ్ రోడ్డులో వస్తుండగా లారీ వెనుక వైపున హైదరాబాద్ వెళ్తున్న ట్రావెల్స్ బస్‌ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్ క్యాబిన్‌లోని డ్రైవర్, కో డ్రైవర్, అసిస్టెంట్లకు స్వల్పగాయాలయ్యాయి. వారు అద్దంకిలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్సలు చేయించుకున్నారు. ప్రయాణికులకు వేరే బస్సులో పంపారు. అర్ధరాత్రి సమయంలో ప్రమాదం జరగడంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. లారీ మలుపు తిరిగే సమయంలో అవతల వైపు రోడ్డులో వాహనాలు వస్తుండగా ఆగడంతో వెనుక వైపు వస్తున్న ట్రావెల్స్ బస్ ఢీ కొట్టినట్లు తెలుస్తోంది. బస్ ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ఘటనా స్థలాన్ని సీఐ సుబ్బరాజు పరిశీలించారు. పోలీస్‌లు ట్రాఫిక్ క్లియర్ చేశారు.

ఇసుకాసురులు తవ్వేస్తున్నారు

- విచ్చలవిడిగా రాత్రింబవళ్లు అక్రమ రవాణా
- ఏపార్టీ ఉన్నా.. వీరిదే హవా..
- ప్రేక్షక పాత్రకే పరిమితమైన అధికార యంత్రాంగం



అక్రమ తవ్వకాలు మండలంలోని ఈపురుపాలెం సరిహద్దులో ఇసుక తవ్వడంతో ఏర్పడిన చెరువు

చీరాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఇసుకాసురులు బరితెగిస్తున్నారు. విచ్చలవిడిగా రాత్రింబవళ్ల ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ల సహాయంతో జోరుగా రవాణా సాగిస్తున్నారు. ఈపూరుపాలెం సరిహద్దుల్లో, వందిళ్లపల్లిలో అక్రమార్కుల ఆగడాలకు హద్దుల్లేకుండా పోతోంది. పట్టపగలు ట్రాక్టర్లలో పెద్దశబ్ధంతో పాటలు పెట్టుకొని ఇసుక రవాణా చేస్తున్నారు. అడ్డగించిన అధికారులకు అధికార అండదండలున్నాయంటూ మభ్యపెట్టి రవాణా చేస్తున్నారు. ఈక్రమంలో ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో తవ్విన గుంతలు సుమారు 10 అడుగులకు పైబడే చెరువులను తలపిస్తున్నాయి.

పార్టీ ఏదైనా వీరిదే హవా..

అధికారంలో ఏ పార్టీ ఉన్నా కూడా ఆ పార్టీకు బ్యానర్‌లు వేయడం ప్రక్కతిని దోచుకోవడం చీరాల్లో పరిపాటిగా మారింది. దీంతో అడ్డగోలుగా సాగుతున్న వీరి ఆగడాలను అడ్డుకట్ట వేయకుంటే ఇసుక రహిత ప్రాంతంగా చీరాల మారుతుందనడంలో ఏమాత్రం సందేహం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇంతజరుగుతున్నా అధికారుల చోద్యం చూస్తుండటంపై ప్రజల్లో తీవ్ర అనుమానాలను రేకెత్తిస్తోంది. ఇప్పటికైనా వీరిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉంది.

నమోఃనారసింహ

- వైభవంగా వరాహ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం
- స్వామి నామస్మరణతో మారుమోగిన పాతసింగరాయకొండ
- భారీగా తరలివచ్చిన భక్తసందోహం
- వేడుకగా రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

సింగరాయకొండ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ శ్రీవరాహ లక్ష్మీనరసింహ ఆలయం నమోఃనారసింహ నామస్మరణతో మారుమోగింది. బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత వరాహ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం కనుల పండువగా సాగింది. సాయంత్రం స్వామి రథోత్సవం రమణీయంగా కొనసాగింది. ఉదయం ఆలయంలోని మూలవిరాట్ వరాహ లక్ష్మీ నరసింహస్వామికి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. దేవస్థాన అంతర్ భాగంలో స్వామివార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజామున గజవాహనంపై స్వామివారు గ్రామవీధుల్లో విహరించారు. అనంతరం కల్యాణ మహోత్సవం వైభవంగా కొనసాగింది. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా నమోఃనారసింహ నామస్మరణతో మారుమోగింది. తదనంతరం కల్యాణ తలంబ్రాలను భక్తులకు పంపిణీ చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో పి. కృష్ణవేణి, ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట శేషాలక్ష్మీనరసింహాచార్యులు, అర్చకుడు నరసింహచార్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామంలోని శ్రీకృష్ణయాదవ్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో వేలాదిమంది భక్తులకు అన్నదానం చేశారు.

వేడుకగా రథోత్సవం

లక్ష్మీనరసింహుడి కల్యాణం అనంతరం స్వామిని మోతకావులు గ్రామోత్సవానికి తీసుకెళ్లారు. సాయంత్రం స్వామివారు ఉభయ దేవేరులతో కలిసి ప్రత్యేకంగా అలంకరించిన రథపీఠంపై ఆశీనులై విహరించారు.

దేవస్థానం వద్ద భద్రత ఏర్పాట్లును పరిశీలించిన ఎస్పీ

బ్రహోత్సవాల్లో భాగంగా ఎస్పీ దామోదర్ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి చప్పరాన్ని ఎస్పీ మోశారు. అనంతరం ఆలయ పరిసరాలు, ప్రవేశమార్గాలు, క్యూలైన్లను బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. రథం వద్ద భద్రత ఏర్పాట్లను సమీక్షించారు. సీఐ చావా హజరత్తయ్య, ఒంగోలు ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, సింగరాయకొండ ఎస్సై బి. మహేంద్ర ఉన్నారు.

రమణీయం.. నృసింహుడి రథోత్సవం..

లక్ష్మీనరసింహస్వామ బ్రహ్మోత్సవాలలో ఎనిమిదో రోజైన శుక్రవారం స్వామికి ఉదయం కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం రయణీయంగా సాగింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు.

ఔరా.. ఆలోచన భళిరా..!





ఒంగోలు నగరంలో ఒకవైపు ప్లాస్టిక్ వ్యర్థాలతో ప్రధాన డ్రైనేజీలు నిండిపోతుండగా.. మరోవైపు మందుబాబుల ఖాళీసీసాలతో మురుగు పారుదలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఈ చర్యలతో పారిశుద్ధ్య కార్మికులకు రోజూ కాలువల శుభ్రం మరింత ఇబ్బందిగా మారుతోంది. శుక్రవారం నగర పరిధిలోని నెల్లూరు బస్టాండ్ వద్ద ప్రధాన కాలువ పూడికతీత పనులు చేపడుతున్న కార్పొరేషన్ కార్మికులు మద్యం ఖాళీసీసాలను అందులో నుంచి బయటకు తీసి వినూత్నంగా ఆలోచించారు. వాటిని కాలువ ముందు రోడ్డుకు అడ్డుగా పెట్టి వాహనదారులకు హెచ్చరించారు. అంతేగాక తమ పనులకు ఆటంకం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టి పనులు కొనసాగించారు. కార్మికుల వినూత్న ఆలోచనను పలువురు ఔరా! అనక తప్పలేదు.

- ఒంగోలు, కార్పొరేషన్

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేష్

● విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జగదీష్

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం పెడతానని మాట ఇచ్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాఠశాలల పునఃప్రారంభం నుంచి అమలు చేయడం పట్ల విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ హర్షం వ్యక్తం చేశారు. ఒంగోలులోని మునిసిపల్ హైస్కూలు, బాలాజీనగర్‌లోని మునిసిపల్ హైస్కూళ్లను శుక్రవారం ఆయన సందర్శించారు. ముందుగా విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలల్లో సమస్యలు, వసతులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ విద్యార్థులకు మంచి భోజనంతో పాటు ప్రతి శుక్రవారం స్పెషల్ భోజనం పెట్టడం అభినందనీయన్నారు. బ్యాగులు, పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. గత ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వం మెరుగైన సదుపాయాలను విద్యార్థులకు కల్పిస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, కొమ్ము రాజు, గంధం బెంజిమెన్, ఈస్టర్ కృష్ణ, సూర్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బీఎన్‌కు సమస్యలపై వినతి



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో నియోజకవర్గంలో ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. ఒంగోలులోని ఎమ్మెల్యే బీఎన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియోజక వర్గంలోని నాలుగు మండలాల నుంచి తరలివచ్చిన పలువురు అర్జీలను అందించగా, వెంటనే సంబంధిత శాఖా అధికారులతో మాట్లాడి సమస్యలకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం'పై విద్యార్థులకు పోటీలు



విద్యార్థులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం ప్రమోద

సంతనూతలపాడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖామంత్రి నారా లోకేష్ విద్యార్థులకు ప్రకటించిన తల్లికి వందనం పథకంపై సంతనూతలపాడు జడ్పీహైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించారు. పిల్లల చదువుల విషయంలో తల్లి పాత్ర- సహకారం అనే అంశంపై హెచ్‌ఎం ప్రమోద వక్తృత్వ, వ్యాసరచన పోటీలను ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో బాగా చదివి ప్రయోజకులు కావాలని కోరారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం

నాగులుప్పలపాడు, జూన్13 (ఆంధ్రజ్యోతి): ఖననం చేసిన మహిళ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన సంఘటన కనపర్తిలో జరిగింది. వీఆర్వో భాగ్యారావు తెలిపిన వివరాల మేరకు.. ఇరవై రోజుల క్రితం కనపర్తి గ్రా మంలోని రెడ్డిపాలెంకు చెందిన కుక్కల కోటేశ్వరమ్మ (70) ప్రయాణిస్తున్న ఆటో దాసరివారిపాలెం వద్ద బోల్తాపడింది. దీంతో ఆమె గాయపడగా ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. అనంతరం జీజీహెచ్‌కు తరలించగా కోటేశ్వరమ్మ మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. దీంతో ఆమె మృతదేహాన్ని కనపర్తి తరలించి వ్యవసాయ భూముల్లో ఖననం చేశారు. మృతురాలి కుటుంబసభ్యులు వినతి మేరకు శుక్రవారం జీజీహెచ్ వైద్యులు తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ రజియాసుల్తానా సమక్షంలో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు.

కమనీయం శ్రీవారి కల్యాణోత్సవం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

మద్దిపాడు, జూన్13 (ఆంధ్రజ్యోతి): మద్దిపాడులో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిపాటి వెంకటరమణ దీక్షితులు ఆధ్వర్యంలో ముత్యాల తలంబ్రాలతో శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువు నిర్వహించారు. గ్రామస్థులు అన్నదాన కార్యక్రమాన్ని ఆర్యవైశ్య సంఘ రామాలయంలో నిర్వహించారు. అదేవిధంగా నందిపాడులో శ్రీగంగాపార్వతీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి తిరుణాలలో భాగంగా వంకాయలపాటి వీరన్న పంతులు కుటుంబీకులు అర్చకులు వెంకటేశ్వర్లు పంతులు ఆధ్వర్యంలో కళ్యాణ క్రతువును నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగింది. స్వామివారిని గ్రామంలో ఊరేగించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కొండపి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని కొండపి తహసీల్దార్ శీలం శ్రీనివాసరావు, ఎంఈవో-2 పి.రామారావు శుక్రవారం మధ్యాహ్నం వెన్నూరు గ్రామ జడ్పీ స్కూల్‌లో పరిశీలించారు. సన్న బియ్యాన్ని వారు పరిశీలించారు. మధ్యాహ్నం భోజనం శుచిగా, రుచిగా ఉందని విద్యార్థులు ఈసందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఎం.శ్రీనివాసరావు, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బసవన్నపాలెం స్కూలుకు టీచర్లను నియమించాలి

మద్దిపాడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బసవన్నపాలెం గ్రామం దళితకాలనీలో గల ఎయిడెడ్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. బ్రిటిష్ కాలం నుంచి ఆ కాలనీలో పాఠశాల కొనసాగుతుంది. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు గత మార్చి నెలలో ఉద్యోగ విరమణ చేయడంతో పెద్దకొత్తపల్లి పాఠశాలలో పనిచేస్తున్న ఓ టీచర్‌ను ఇక్కడికి స ర్దుబాటుపై పంపగా విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగలేదు. దాదాపు 20 మందికి పైగా విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. ఈక్రమంలో పాఠశాలలు పునఃప్రారంభం కాగా ఆ పాఠశాలలో పిల్లలు చేరే సంఖ్య పెరిగే అవకాశం ఉంది. నూతన పాఠశాలను కట్టేందుకు తమ సొంతంగా నిధులు ఇస్తామని ఆ కాలనీవాసులు తెలిపారు. కానీ ఇంతవరకు ఆ పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించలేదని సమాచారం. తమ కాలనీలోని పాఠశాలకు టీచర్లను కేటాయించాలని స్థానికులు ఎంఈవో, డీఈవో, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలు సైతం అందజేశారు. ఒకవేళ ఉపాధ్యాయులను కేటాయించకపోతే తమ పిల్లలు చదువుకు దూరం అయ్యే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆ పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

మద్దిపాడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించి రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘం ప్రధానకార్యదర్శి వడ్డే హనుమారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం వెల్లంపల్లి పొగాకు కొనుగోలు కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గిట్టుబాటు ధరలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నోబిడ్లు ఎక్కువై బేళ్లను తరలించడం ఇబ్బందికరంగా మారిందని చెప్పారు. అబ్బూరి శేషగిరావు మాట్లాడుతూ గిట్టుబాటు ధర లేకపోవడంతో బ్యారన్‌కు రూ.4 లక్షల నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రావి ఉమామహేశ్వరరావు తొట్టెంపూడి వెంకటశేషయ్య మాట్లాడుతూ గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారన్నారు. కార్యక్రమంలో నారిపెద్ది వరహాలచౌదరి, బోయపాటి వెంకయ్యచౌదరి, జజ్జర శరత్‌బాబు, నాగండ్ల వెంకటేశ్వర్లు, నవులూరి సురేంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

గదుల్లేవ్.. చదువెలా..?

● దీనావస్థలో కూచిపూడి పాఠశాల
● అవస్థలు పడుతున్న విద్యార్థులు



పిల్లర్లకే పరిమితమైన కూచిపూడి ఉన్నత పాఠశాల భవన నిర్మాణం

మర్రిపూడి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : 'కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాం. సర్వంగ సుందరంగా పాఠశాలల రూపురేఖలు మార్చాం. పేద విద్యార్థులకు మౌలిక వసతులు మెరుగుపర్చాం' అంటూ గత వైసీపీ పాలకులు ఊరూవాడ ఎలుగెత్తి చాటారు. నాడు-నేడు నిధులతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామని చెప్పిన మాటలు నీటి మీద రాతలయ్యాయి. సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో నాడు-నేడు పనులకు గ్రహణం పట్టింది. మండలంలోని కూచిపూడి ఉన్నత పాఠశాల దుస్థితి ఇందుకు నిదర్శనం. రూ.కోటితో చేపట్టిన నాడు-నేడు పనులు మూడేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. 135 మంది విద్యను అభ్యసిస్తున్న ఈ బడిలో కేవలం రెండు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. గతంలో ప్రాథమిక పాఠశాలగా ఉన్న పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా స్థాయి పెంచారు. అయితే నూతన భవనాల నిర్మాణాలు ఏర్పాటు చేయడంలో అలవిమాలిన ఆలస్యం చేశారు. ప్రాథమిక ఉన్నత పాఠశాలలోనే ఉన్నత పాఠశాల 5 తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉన్నత పాఠశాల విద్యార్థులు ఒకేచోట ఉండటంతో చిన్నపిల్లలు చేసే అల్లరి కారణంగా విద్య వంటపట్టడం లేదని ఉన్నత పాఠశాల విద్యార్థులు వాపోతున్నారు. ఉన్న రెండు గదుల్లో ఒక గదిలో పాఠశాల కార్యాలయం నిర్వహిస్తుండగా వరండాలో, ఆరు బయట పరదాల కట్టి తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఎండకు, వానకు తరగతులు నిర్వహించలేక పాఠశాలలకు సెలవులు ప్రకటించాల్సి ఉంది. అయితే స్థానిక సచివాలయం పక్కనే గదుల నిర్మాణానికి కోటి రూపాయల మంజూరు అయ్యాయి. ఆ నిధులతో రెండేళ్ల క్రితం పునాదులు వేశారు. పూర్తిస్థాయిలో నిధులు మంజూరు కాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆపేశారు. గత ఏడాది నవంబరులో 'పరదాల కింద చదువు.. వానొస్తే సెలవు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు అందుబాటులో ఉన్న రూ.లక్షల నిధులతో పిల్లర్లు వేసి చేతులు దులుపుకున్నారు. ఆరు నెలలుగా నిధులు లేని కారణంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు పనులు నిలిచాయి. విద్యారంభం కావడంతో ఈ ఏడాదైన భవన నిర్మాణ పనులు ప్రారంభమౌతాయని తల్లిదండ్రులు ఆశిస్తున్నారు. ఇప్పటికైనా మంత్రి స్వామి చొరవతీసుకొని నూతన భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వరుస చోరీలతో జనం బెంబేలు

పోలీసుల ఉదాశీనత ● జోరుగా మోటార్లు, బైక్‌ల దొంగతనాలు ● చోరీ కోసం వచ్చిన ఆటోను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన ఆక్వా రైతులు





దొంగతనానికి వినియోగించిన ఆటో, తరలించేందుకు సిద్ధం చేసిన మోటార్, ఇతర సామగ్రి

కొత్తపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కొత్తపట్నం మండలంలో గత నెల రోజులుగా వరుస దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రొయ్యల చెరువుల వద్ద ఉన్న విద్యుత్ మోటార్లు, నివాసాల వద్ద తాళాలు వేసి ఉన్న మోటార్‌సైకిళ్ళను రాత్రి వేళల్లో అపహరించుకెళుతున్నారు. ఈ దొంగతనాలపై పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నా వారు స్పందించకపోవటంతో దొంగలు రెచ్చిపోతున్నారు. పట్టపగలే చోరీలకు తెగబడుతున్నారు. శుక్రవారం కొప్పోలు-అల్లూరు గ్రామాల మధ్య చింతల సమీపంలో అల్లూరు ఎంపీటీసీ శాంతారావు సాగు చేస్తున్న రొయ్యల చెరువుల వద్ద విద్యుత్ మోటార్‌ను పట్టపగలే అపహరించేందుకు ముగ్గురు దొంగలు యత్నించారు. దీంతో వారిని రైతులు పట్టుకునేందుకు ప్రయత్నించగా పారిపోయారు. ఈక్రమంలో మోటార్‌ను తరలించేందుకు దొంగలు ఉపయోగించిన ఆటోను రైతులు స్వాధీనం చేసుకుని ఒంగోలు సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. వారం క్రితం అల్లూరు గ్రామంలోనే ఇంటి ముందు నిలిపిఉంచి మోటార్‌సైకిల్‌ను రాత్రికి రాత్రే తీసుకుపోయారు. విచిత్రమేమంటే తమ వద్ద డొక్కు మోటార్‌సైకిల్‌ను అక్కడే వదిలేసి ఇంటి ముందు ఉన్న కొత్త బైక్‌ను చోరీ చేశారు. పది రోజుల క్రితం చింతల సమీపంలోని రొయ్యల చెరువుల వద్ద రాత్రి సమయంలో విద్యుత్ మోటార్లను చోరీ చేసిన వ్యక్తులు తమ వద్ద ఉన్నపాత మోటార్‌సైకిల్‌ను అక్కడే వదిలేసి వెళ్ళిపోయారు. ఇలా ఈ వారం పది రోజుల్లో దాదాపు 10 విద్యుత్ మోటార్లు, ఆక్వా సాగులో ఉపయోగించే ఇతర పరికరాలు చోరీకి గురయ్యాయి. పోలీసులు ఉన్నతాధికారులు స్పందించి దొంగల ఆగడాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'తల్లికి వందనం' అమలుపై హర్షాతిరేకాలు



బస్టాండ్ సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు, నాయకులు



శ్రేణులతో కలిసి కేక్ కట్ చేస్తున్న అంకారావు

సంతనూతలపాడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం తల్లికి వందనం పథకంలో భాగంగా దాదాపు రూ.12కోట్ల అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో పడ్డాయి. దీంతో సంతనూతలపాడు బస్టాండ్‌లో శుక్రవారం రాత్రి 10 గంటలకు టీడీపీ నాయకులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మదినేని హరిబాబు, నాయకులు మన్నె రంగనాయకమ్మ, ముప్పరాజు శ్రీను, బి.శంకర్, పఠాన్, మునీర్, మక్బూల్, ఎస్.శ్రీరామ్మూర్తి, శ్రీను, పోలిశెట్టి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అయిన సందర్భంగా శుక్రవారం రాత్రి సంతనూతలపాడులో బాపట్ల పార్లమెంట్ టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆర్.అంకారావు ఇంటి వద్ద కేక్‌కట్ చేశారు. పింఛన్ పెంపు, మెగా డీఎస్సీ, తల్లికివందనం, దీపం పథకం, అన్నా క్యాంటీన్లు పునఃప్రారంభం వంటివన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట ఇచ్చి తప్పకుండా అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉత్తమ డ్రైవర్లకు అభినందనలు

● బహుమతులను అందజేసిన డీటీసీ



సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేసిన డీటీసీ సుశీల, ఆర్‌ఎం సత్యనారాయణ తదితరులు

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో ఇంధన పొదుపు సాధించి, ఉత్తమ ప్రతిభ కనబరిచన డ్రైవర్లకు రవాణశాఖ ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. శుక్రవారం ఒంగోలులోని ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా రవాణాశాఖ అధికారి సుశీల హాజరై మాట్లాడారు. డ్రైవర్లను అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అరవింద హాస్పిటల్ డాక్టర్ ఎం.హనుమంతరావు డ్రైవర్లకు ఉచితంగా కూలింగ్ వాటర్ బాటిళ్లను బహూకరించారు. కార్యక్రమంలో ఆర్‌ఎం సత్యనారాయణ, ఒంగోలు డిపో మేనేజరు డి.శ్రీనివాసులు, కనిగిరి, పొదిలి, మార్కాపురం, గిద్దలూరు డిపో మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మరో కార్గో బుకింగ్ కౌంటర్ ప్రారంభం

ఒంగోలులోని ఆర్టీసీ డిపో ఆవరణంలో నూతనంగా మరో కార్గో సర్వీస్ కౌంటర్‌ను రీజనల్ మేనేజరు సత్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ప్రజాదరణ, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఒంగోలులో కార్గో విభాగంలో అదనపు బుకింగ్ కౌంటర్లు ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

● ఎస్‌బీఐ ఆర్‌ఎం శ్రీనివాసరావు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌ఎం శ్రీనివాసరావు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని, దీంతో ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ వెల్లంకి శ్రీనివాసరావు కోరారు. ఎస్‌బీఐ స్థాపించి 70 ఏళ్ళు పూర్తవుతున్న సందర్భంగా శుక్రవారం ఒంగోలులోని బ్యాంకు రీజనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వ్యాపారలావాదేవీలతో పాటు సామాజిక కార్యక్రమాల్లో కూడా బ్యాంకు తమవంతు పాత్ర పోషిస్తుందని తెలిపారు. రక్తదాన ఆవశ్యకతను ప్రజలకు తెలియజేయడంతో పాటు తాము కూడా రక్తదానం చేసి ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. అనంతరం రెడ్ క్రాస్ సహకారంతో రక్తదానం చేశారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్లు వేదం రాజేష్‌బాబు, కె.రామారావు, ఆర్‌బీవో హెచ్‌ఆర్ మేనేజర్ నళినికాంత్, ఆఫీసర్స్ అసోసియేషన్ కోశాధికారి ఆదినారాయణ, డిప్యూటీ రీజనల్ సెక్రటరీ ఎ.శ్రీనివాసరావు, జోనల్ సెక్రటరీ సీహెచ్.శ్రీనివాసరావు, అవార్డ్ ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షుడు వీఎస్ఆర్.ఆంజనేయులు, బ్యాంకు అధికారులు పీబీ.చంద్రశేఖర్, కె.జానకిరామయ్య, కె.రాజశేఖర్‌రెడ్డి, బ్యాంకు ఉద్యోగులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్లు డాక్యుమెంట్లు సమర్పించాలి

చీమకుర్తి, జూన్13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూదవాడ పంచాయతీ పరిధిలో భూముల రీసర్వే జరుగుతున్న నేపథ్యంలో గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్లు తమ భూములకు సంబంధించిన డాక్యుమెంట్లను రెవెన్యూ అధికారులకు సమర్పించాలని తహసీల్దార్ బ్రహ్మయ్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. బూదవాడ పంచాయతీ పరిధిలో బూదవాడ, ఎల్లయ్యనగర్, మర్రిచెట్టుపాలెంలో గ్రానైట్ ఫ్యాక్టరీలు పెద్దఎత్తున విస్తరించి ఉన్నాయి. అందుకే ఈప్రాంతంలో భూముల ధరలు భారీగా ఉన్నాయి. భవిష్యత్‌లో ఎటువంటి భూవివాదాలు తలెత్తకుండా, ప్రస్తుతం నెలకొన్న భూసమస్యల పరిష్కారానికి రీసర్వే ఉపకరిస్తుందని ఆయన పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సంతనూతలపాడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేర్నమిట్ట, ఎండ్లూరు, మైనంపాడు, చలప్పాలెం గ్రామాల్లో శనివారం మరమ్మతుల దృష్ట్యా ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఒంగోలు రూరల్ డీఈ శ్రీకాంత్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

చీమకుర్తి మండలంలో

చీమకుర్తి: గోనుగుంట 11కేవీ పరిధిలో పీఎంఐ పనులు చేపట్టనున్నందున శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. జీఎల్‌పురం, రామచంద్రాపురం, పిడతలపూడి, పుట్టచెరువుపాలెంలలో ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3గంటలు వరకు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన వర్క్‌షాపు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఐటీఐలలో పని చేస్తున్న సాంకేతిక సిబ్బందికి ఒంగోలులోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణాసంస్థలో ఈనెల 9న ప్రారంభమైన వర్క్‌షాపు శుక్రవారంతో ముగిసిందని సంస్థ ప్రధానాచార్యులు ప్రసాద్‌బాబు తెలిపారు. ఒంగోలు ప్రభుత్వ ఐటీఐతో పాటు తెనాలి, కడప, వేముల, విజయవాడ ఐటీఐల సాంకేతిక సిబ్బందికి నూతన విద్యావిధానాలపై టాటా సర్వీస్ కో ఆర్డినేటర్ మార్కేండేయులు, ఫ్యాకల్టీ జయేష్‌పవర్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారని ఆయన చెప్పారు. అనంతరం సిబ్బందికి పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి : సీపీఎం

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పట్ల రాష్ట్ర ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి అన్నారు. కూటమి ఏడాది పాలనపై ప్రచురించిన బుక్‌లెట్‌ను శుక్రవారం స్థానిక సుందరయ్యభవన్‌లో జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు, ఇతర నాయకులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలు ఇంటింటికి అమలు చేస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు పూనాటి ఆంజనేయులు, జీవీ.కొండారెడ్డి, సయ్యద్‌హనీఫ్, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కంప్యూటర్ ఆధారిత డీఎస్సీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం సెషన్‌లో ఐదు పరీక్షా కేంద్రాల్లో 550 మంది అభ్యర్థులను కేటాయించగా 520 మంది హాజరుకాగా, 30మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 8 పరీక్షా కేంద్రాల్లో 1110 మంది అభ్యర్థులను కేటాయించగా 1069మంది హాజరుకాగా 41మంది గైర్హాజరయ్యారు.

16 నుంచి సెమిస్టర్ పరీక్షలు

సంతనూతలపాడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మైనంపాడు డైట్ కళాశాలలో ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు 4వ సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ డీఎడ్ కళాశాల్లో 2023-25 బ్యాచ్‌కు చెందిన డీఎడ్ 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, 2022-24లో ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ డీఎడ్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఈ విషయం గమనించాలని ఆయన కోరారు.

బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్‌కు సన్మానం

మద్దిపాడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని కెనరా బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ పంకజ్‌షిండేకి శుక్రవారం ఖాతాదారులు ఘనంగా సన్మానం చేశారు. ఆయన బదిలీ అయిన సందర్భంగా బ్యాంక్ మేనేజర్ శ్రీధర్‌బాబు సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మండవ గోవిందరాజులు, చుండూరి జనార్దన్‌రావు, మండల శ్రీరామ్మూర్తి, మండువ శివానందరావు, వడ్డంపూడి వెంకటేశ్వరరావు, మారెళ్ల చిరంజీవి పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన టీడీపీ నాయకులు

మద్దిపాడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నూతనంగా బాధ్యతలు చేపట్టిన మద్దిపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మిని శుక్రవారం తెలుగుదేశం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. రైతు సంఘ నాయకులు రావి ఉమామహేశ్వరరావు, టీడీపీ ప్రధానకార్యదర్శి ముత్తనపల్లి రామలింగయ్య, రెబ్బవరపు ప్రభాకర్, రావి నరసింహారావు, పారా నరసింహారావు, పోకూరు శ్రీనివాస రావు, దుద్దుకూడి డేవిడ్, ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, అడకా స్వాములు తహసీల్దార్‌కు బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కొండపి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కె.ఉప్పలపాడు జడ్పీ స్కూల్‌లోని ఇంటర్, పదో తరగతి విద్యార్థులకు హెచ్‌ఎం సునన్నకుమార్ శుక్రవారం పాఠ్యపుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామ్మూర్తినాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఒంగోలు ఏవోగా రమేష్‌బాబు

ఒంగోలు(రూరల్), జూన్13(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండల వ్యవసాయశాఖ అధికారిగా రమేష్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మద్దిపాడు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఒంగోలు ఏవోగా పనిచేస్తున్న జి.కిషోర్‌బాబు కొత్తపట్నం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఏవో రమేష్‌బాబును వీవోఏలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, ఆదిమూర్తి పాల్గొన్నారు

వీల్‌చైర్ అందజేత

నాగులుప్పలపాడు, జూన్13 (ఆంధ్రజ్యోతి): చేకూరపాడు గ్రామానికి జక్కుల వెంకటేశ్వర్లు ఫ్లోరోసిస్‌తో బాధపడుతుండగా వైద్యఆరోగ్యశాఖ ద్వారా మంజూరైన వీల్‌చైర్‌ను జిల్లా ఫ్లోరోసిస్ నివారణాధికారి అనిల్‌కుమార్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో నాగులుప్పలపాడు వైద్యాధికారి ఒనారియల్, నబీవలి, హెల్త్ సూపర్‌వైజర్ శౌరయ్య, ప్రసన్న, సీహెచ్‌వో చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మకు పాలపొంగళ్లు



అమ్మవారికి మొక్కులను తీర్చుకుంటున్న భక్తులు

జరుగుమల్లి, జూన్13 (ఆంధ్రజ్యోతి): కామేపల్లి పోలేరమ్మ ఆలయ వార్షికోత్సం సందర్భంగా ముగింపురోజైన శుక్రవారం నాడు కామేపల్లి గ్రామంలోని ప్రజలు అమ్మవారికి పాలపొంగళ్లు పెట్టి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలోని మహిళలు తమ ఇళ్ల వద్ద పొంగళ్లు పెట్టుకుని ఆలయం వద్దకు తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అవీ..ఇవీ



టాపర్లకు మెమెంటోలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

టెన్త్ టాపర్లకు సన్మానం

గిద్దలూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): 10వ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ప్రతిభను కనపరచి అత్యధిక మార్కులు సాధించి వివిధ అవార్డులు, సీట్లు పొందిన విద్యార్థినులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి మెమెంటోలు అందజేశారు. పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఎం.కృషి 10వ తరగతి ఫలితాలలో 593 మార్కులు సాధించి షైనింగ్ స్టార్ అవార్డు పొంది గోల్డ్‌మెడల్, రూ. 20వేల పారితోషికం పొందారు. అలాగే షేక్ షబ్బుంకౌసర్, షేక్ మిత్వా కౌసర్, షేక్ నీరకట్టు రియా అనే ముగ్గురు విద్యార్థినులు సీట్లు పొందారు. ఎన్.రమ్యశ్రీ, వై.షన్ముఖి, వి.జాయితి, ఎం.అనూష, కె.ధరణి, ఉషశ్రీలు ఏటా రూ. 12వేల చొప్పున నాలుగేళ్లపాటు ఎన్ఎంఎంఎఫ్ స్కాలర్‌షిప్‌లు పొందారు. వీరందరినీ పాఠశాల ఆవరణలో ఎంఈవో పి.నాగభూషన్‌రెడ్డి, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ ఎం.బాలూనాయక్, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి మెమెంటోలు అందజేశారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దారు అశోక్ రెడ్డి

ప్రభుత్వ పథకాలపై గిరిజనులు అవగాహన కలిగి ఉండాలి

పెద్ద దోర్నాల, జూన్ 13(ఆంధ్రజ్యోతి):చెంచు గిరిజనులు ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దారు సీహెచ్ అశోక్ రెడ్డి అన్నారు.స్థానిక శివ సదనులో ఆదర్శ సంస్థ ఆధ్వర్యంలో గిరిజనులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరయిన తహసీల్దారు మాట్లాడుతూ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వెంకట శివ ప్రసాద్ సహకారంతో సంస్థ గూడేలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వంచడం అభినందనీయమన్నారు. గిరిజనులు వారి పిల్లలను బడికి పంపించాలని, ఆడపిల్లలకు చిన్నవయస్సులోనే వివాహాలు చేయరాదని, మద్యంవంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ కరుణాకర్, వీఆర్‌వో వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



శేషవాహనంపై తిరుమలనాథుడు

తిరుమలనాథునికి శేష వాహన సేవ

పెద్దారవీడు, జూన్13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజంపల్లిపై వెలసిన శ్రీ గొడ్రాలికొండ తిరుమలనాథస్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దేవేరులతో తిరుమలనాథుడిని శుక్రవారం శేషవాహనంపై ఊరేగించారు.ఆలయ వేద పండితులు భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రధాన క్రతువులు నిర్వహించారు. స్వామివారు, అమ్మవార్ల మూలవిరాట్, ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఈసందర్భంగా కల్యాణ ఉభయదాతలు స్వామి, అమ్మవార్లకు పుష్పాధికాలు, ప్రసాదాలు సమర్పించారు. వివిధ కుల సత్రాలవారు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



రైతులతో మాట్లాడుతున్న ఏవో మహబూబ్‌బాషా

అన్నదాత సుఖీభవకు ఈకేవైసీ చేయించుకోవాలి

రాచర్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత పొందిన రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి షేక్ మహబూబ్‌బాషా అన్నారు. అన్నదాత సుఖీభవపై శుక్రవారం ఆయన మండలంలోని అనుమలపల్లె రైతు సేవా కేంద్రంలో రైతులతో మాట్లాడారు. ఈపథకానికి 5,043 మంది రైతులు అర్హత సాధించారని, వారంతా రైతు సేవా కేంద్రాలలో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. అలా చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, అనుమలపల్లి సర్పంచ్ రమేష్, ఆర్ఐ హర్షగౌడ్, వీఆర్‌వో వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తీరు పరిశీలన

పెద్దదోర్నాల, జూన్ 13(ఆంధ్రజ్యోతి):ఈకేవైసీ చేయించుకుంటేనే అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని మండల వ్యవసాయాధికారి డీ జవహర్ లాల్ నాయక్ అన్నారు. స్థానిక 3వ సచివాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు.ఈకేవైసీ తీరును పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రతి రైతు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయకులు శివనాయక్ ఉన్నారు.

అక్కరకు రాని కంభం మార్కెట్‌యార్డు

రైతుబంధు పథకం అమలుపై అధికారుల నిర్లక్ష్యం

గోదాములున్నా ప్రయోజనం శూన్యం

కూటమి ప్రభుత్వ నిర్ణయంపైనే ఆశలు



కంభం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

కంభం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బంధు పథకం అక్కరకు రావడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం అధికారులకు, ఇటు రైతులకు అవగాహన కలిగించకపోవడం, గోదాములు ఉన్నా వినియోగించుకోక పోవడంతో పథకం మూలకు చేరింది. కంభం వ్యవసాయ మార్కెట్ పరిధిలో గోదాములు ఉన్నా ప్రయోజనం శూన్యం. వీటిలో రైతులు ఎవరూ పంట దిగుబడులను నిలువ చేసుకోవడం లేదు. దీంతో ఈ పథకం ద్వారా పొందే ప్రయోజనాలను కోల్పోతున్నారు. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం మార్కెట్‌యార్డులపై దృష్టి సారించి నిరుపయోగంగా ఉన్న మార్కెట్ యార్డులను గుర్తించి అవి రైతులకు ఉపయోగపడేలా చేస్తున్నామని చెబుతున్నా గిద్దలూరు నియోజకవర్గ పరిధిలోని కంభం వ్యవసాయ మార్కెట్ అభివృద్ధిపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మార్కెట్‌యార్డుల చైర్మన్ల పేరు అధికారికంగా ప్రకటించినందున వారు బాధ్యతలు స్వీకరించిన తరువాత శాసనసభ్యుల సహకారంతో వ్యవసాయ మార్కెట్‌యార్డుల అభివృద్ధికి కృషి చేస్తారని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కంభం వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాలు ఉన్నాయి. మద్దతు ధర లభించని పక్షంలో రైతులు పంటలను నిలువ చేసుకునేందుకు కంభంలో రూ.40 లక్షలతో రెండు గోదాములు నిర్మించారు. ఏటా రైతులు పంటలను వీటిలో నిల్వ చేసుకుని మద్దతు ధర వచ్చాక విక్రయించుకోవచ్చు. కానీ వీటి గురించి అధికారులు గాని, పాల పక్షాలు గాని పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం సివిల్ సప్లై వారు లీజ్‌కు తీసుకోవడంతో రేషన్ సరుకులు నిల్వ చేస్తున్నారు.

ఇవీ ఉపయోగాలు

గోదాములలో నిల్వ ఉంచి పంట విలువలో 75శాతం రైతు బంధు పథకం ద్వారా రుణంగా తీసుకోవచ్చు. అలా గరిష్ఠంగా లక్ష వరకు రుణం పొందే అవకాశం ఉంది. మొదటి 3 నెలల కాలానికి వడ్డీ వర్తించదు. ఆ తరువాత 5వేలకు 5%, 10వేలకు 6%, 15వేలకు 8%, 50వేల లోపు 10% చొప్పున వడ్డీ చెల్లించాలి. కానీ కంభం వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో ఈ పథకం అసలు వర్తించని పరిస్థితి ఉంది.

కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలి

కంభం, గిద్దలూరు మండలాలలో కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేస్తే రైతుల కష్టాలు తీరుతాయి. కంభంలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి వినతిపత్రాలు అందచేశారు. ఈ ప్రాంత తీవ్ర వర్షాభావ పరిస్థితుల వలన శనగ, మిరప, కంది, పెసర పంటలు పండించుకోవలసి వస్తున్నదని, వాటికి గిట్టుబాటు లేని సమయంలో దిగుబడులు నిలువ చేసేందుకు కంభం, గిద్దలూరు మార్కెట్‌యార్డులలో కోల్డ్ స్టోరేజ్‌లు ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



అలంకార ప్రాయంగా ఉన్న గోదాములు



చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న చిన్నారులు

పిల్లల భవిష్యత్తుకు చంద్రబాబు బాసట

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

పెద్ద దోర్నాల, జూన్ 13(ఆంధ్రజ్యోతి):పిల్లల భవిష్యత్తుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాసటగా నిలిచారని టీఎన్‌టీయూసీ ఒంగోలు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి ఈదర మల్లయ్య పేర్కొన్నారు. మండలంలోని హసనాబాద్ గ్రామం మండల పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రత్నప్రసాద్ అధ్యక్షతన విద్యార్థులకు శుక్రవారం విద్యాకిట్లను ఆయన పంపిణీ చేశారు. అనంతరం చంద్రబాబు చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా చదువునే ప్రతి విద్యార్థికి తల్లి అకౌంటులో డబ్బులు జమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది లక్ష్మీప్రసన్న,టీడీపీ నాయకులు రమణయ్య, ఆవులయ్య, చినరోశయ్య బాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం నగదు జమతో తల్లిదండ్రులలో ఆనందం

మార్కాపురం రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మరో ప్రధానమైన హామీని నిలబెట్టుకుంది. తల్లికి వందనం పథకం ద్వారా ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థుల తల్లుల ఖాతాలలో ఎంత మంది పిల్లలు ఉంటే వారందరికీ నగదు జమచేస్తానని చంద్రబాబు నాయుడు ఎన్నికలలో హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఈ నెల 12 వతేదీ నుంచి విద్యార్థుల తల్లుల ఖాతాలో నగదును జమచేసే ప్రక్రియను ప్రారంభించారు.

మార్కాపురం మండలంలో మొత్తం 21,024 మంది విద్యార్థులు తల్లికి వందనం పథకంలో లబ్ధిదారులుగా ఉన్నారు. 10,299 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో, 10,725 మంది విద్యార్థులు ప్రయివేటు పాఠశాలలో చదువుతున్నారు. వీరిలో 499 మంది విద్యార్థుల తల్లులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారి ఖాతాలలో 13 వ తేదీ ఒక్కొక్కరికి 13 వేల రూపాయల చొప్పున మొత్తం 39 వేల రూపాయలు వారిఖాతాలలో జమ అయినట్లు తెలిపారు. మార్కాపురం మండలంలోని బోడపాడు గ్రామంలో ఎంపీపీ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులకు వారి తల్లి ఆరేపల్లి రాజ్యలక్ష్మి ఖాతాలో 39 వేల రూపాయలు నగదు జమ అయ్యాయి. ఆరేపల్లి రాజ్యలక్ష్మికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్ద కూమార్తె ఉప్పల్ల యశస్విని 5 వ తరగతి చదువుతోంది. రెండవ కుమార్తె ఉప్పల్ల లాస్య రెండవ తరగతి, కుమారుడు ఉప్పల్ల రిత్విక్ ఒకటవ తరగతి చదువుతున్నాడు. వీరు ముగ్గురూ బోడపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు.

జగదాంబకు ప్రత్యేక పూజలు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వరుణ్ తేజ శర్మ జగదాంబ మాత మూల విరాట్‌కు కుంకుమార్చన, అభిషేకాలు, విశేష అలంకరణ నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో జగదాంబ

పేదలకు బియ్యం పంపిణీ

మార్కాపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక 9వ వార్డులోని నిరుపేదలకు టీడీపీ నాయకులు పఠాన్ ఇబ్రహీంఖాన్, నాగూర్‌ఖాన్ సోదరులు శుక్రవారం బియ్యం పంపిణీ చేశారు. వార్డు పరిధిలోని 15 మంది మహిళలకు ఒక్కొక్కరికి 25 కిలోల చొప్పున బియ్యం బస్తాలను వారి స్వగృహం వద్ద అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము వార్డు పరిధిలో నిరుపేదలైన వారికి క్రమం తప్పకుండా సాయం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ నాయకులు శేఖర్‌నాయుడు, వెంకటేశ్వర్లు, రసూల్, కేశవ, ఆసిఫ్ పాల్గొన్నారు.



పేదలకు బియ్యం అందజేస్తున్న నాగూర్, ఇబ్రహీంలు

28న రిటైర్డ్ ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఎన్నిక

గిద్దలూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బేస్తవారపేట మండలశాఖ రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఘం ఎన్నిక ఈనెల 28వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రవీంద్రనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 28వ తేదీ ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, ఒంటి గంట వరకు నామినేషన్ల ఉపసంహరణ, అనంతరం తుది జాబితా ప్రకటన, ఎన్నిక అవసరమైతే అదే రోజు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3గంటల వరకు ఎన్నిక నిర్వహించి వెంటనే కౌంటింగ్ చేసి నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయిస్తామని తెలిపారు.

ఇరువురు అధికారుల బదిలీ

రాచర్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇరువురు అధికారులు బదిలీ అయ్యారు. రాచర్ల వ్యవసాయశాఖ అధికారిగా పని చేస్తున్న షేక్ అబ్దుల్‌రఫిక్ బేస్తవారపేట మండలానికి బదిలీ కాగా ఆయన స్థానంలో గిద్దలూరు వ్యవసాయశాఖ కార్యాలయ సాంకేతిక ఏవో మహబూబ్‌బాషా రాచర్ల వ్యవసాయ శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. వెలుగు కార్యాలయం ఏపీఎం పి.రమేష్‌బాబు అర్ధవీడు మండలానికి బదిలీ కాగా ఆయన స్థానంలో గిద్దలూరు వెలుగు కార్యాలయం ఏపీఎం కె.నరేష్ రాచర్లకు బదిలీపై వచ్చారు.

మద్యంషాపు కోసం దరఖాస్తు చేసుకోండి

పొదిలి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని రూరల్ ప్రాంతంలో ఒక మద్యంషాపు ఏర్పాటు లైసెన్స్ మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ అధికారి షేక్ ఆయోషాబేగం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 19వతేదీ సాయంత్రం ఐదుగంటల వరకు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుకు సంబంధించి లాటరీని 21వతేదీన ఉదయం 8గంటలకు జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో తీయనున్నట్లు చెప్పారు. ఈప్రక్రియ ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ రూల్స్ ప్రకారం జిల్లా కలెక్టర్ సమక్షంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు 21వతేదీన జరిగే లాటరీలో పాల్గొనాలని సూచించారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

పొదిలి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో అమృత కంటి వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమం మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ భరత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈశిబిరంలో మొత్తం 121 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. అందులో 48మందికి ఆపరేషన్‌కు సిఫార్సు చేశారు.



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

రేపు సీపీఐ సర్వసభ్య సమావేశం

త్రిపురాంతకం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సీపీఐ త్రిపురాంతకం మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 15న జరుగుతుందని మండల కార్యదర్శి దాసరి మల్లికార్జున తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు బాణాల రామయ్య మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల వైద్యశాలగా మార్చాలని, డిగ్రీ కళాశాల ఏర్పాటు, ఎన్నెస్పీ అతిథి గృహాన్ని వినియోగంలోకి తేవాలని అంశాలపై చర్చిస్తామని అన్నారు. ఈ సమావేశంలో తిరుమలయ్య, ఆదినారాయణ, పవన్‌కుమార్ పాల్గొన్నారు.



సాయి భిక్షాటన కార్యక్రమంలో భక్తులు

భక్తుల ఆధ్వర్యంలో సాయి భిక్ష

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గురు పౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని నెహ్రూ బజార్‌లోని షిరిడీ సాయి బాబా మందిరంలో ఉత్సవాలు, పలు కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సాయి భక్తుల ఆధ్వర్యంలో పట్టణంలోని వీధులలో సాయి భిక్ష కార్యక్రమం నిర్వహించారు. మందిర కార్యదర్శి గోపాలుని హరిహరరావు మాట్లాడుతూ సాయి భిక్ష ఐదు రోజుల పాటు పట్టణంలోని అన్ని వీధులలో నిర్వహిస్తామని భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని అన్నారు. సాయి భిక్ష కార్యక్రమంలో సాయి మందిర అధ్యక్షుడు పేరం సత్యం, కోశాధికారి నాగరాజు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

తర్లుపాడు వ్యవసాయాధికారిగా జోత్స్న దేవిక

తర్లుపాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడు మండల వ్యవసాయాధికారిగా పి.జోత్స్న దేవిక శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈమె ఇప్పటి వరకు కనిగిరి వ్యవసాయధికారిగా పని చేస్తూ బదిలీపై తర్లుపాడు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటేశ్వర్లు దర్శి ఏడీ ఆఫీస్‌కు బదిలీపై వెళ్లారు. జోత్స్న ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో వ్యవసాయానికి సంబంధించిన ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. మండలంలోని పలువురు వ్యవసాయ సహాయకులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.



వ్యవసాయాధికారిగా బాధ్యతలు చేపట్టిన జోత్స్నదేవిక

త్రిపురాంతకం దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా అనిల్ కుమార్

త్రిపురాంతకం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): త్రిపురాంతకం దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా డి.అనిల్ కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. చదలవాడ గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. మొదట ఆయన త్రిపురాంతకేశ్వరస్వామి, బాల త్రిపురసుందరీదేవి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం చైర్మన్ సుబ్బారావు, ఆలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న అనిల్ కుమార్



శిబిరంలో బీపీ చెక్ చేయించుకుంటున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

పెద్ద దోర్నాల, జూన్ 13(ఆంధ్రజ్యోతి):స్థానిక బీఎం డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కర్నూలుకు చెందిన కిమ్స్ హాస్పిటల్, బట్టు విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ప్రారంభించి బీపీ పరీక్ష చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు జీ శ్యాం ప్రసాద్ రెడ్డి, సిబ్బంది ఈసీజీ, 2డీ ఎకో, బీపీ, షుగర్ రోగులను ఉచితంగా పరీక్షించారు.పలువురు రోగులకు గుండెకు సంబంధించిన వ్యాధులపై తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు. ఈ కార్యక్రమంలో బట్టు విద్యా సంస్థల చైర్మన్ రమణారెడ్డి, కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలుకా అధ్యక్షుడు షేక్ జాని బాష

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

పుల్లలచెరువు,జూన్ 26(ఆంధ్రజ్యోతి): పుల్లలచెరువు మండల కేంద్రంలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలుకా అధ్యక్షుడు షేక్ జాని బాష దుస్తులు పంపిణీ చేశారు.శుక్రవారం పుల్లలచెరువులోని తన స్వగృహంలో కార్మికులకు దుస్తులు అందజేసి వారు చేసే సేవను అభినందించారు. ఈకార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

హత్యకేసు కొట్టివేత

మార్కాపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): హత్యకేసులో నేరం రుజువుకాకపోవడంతో కొట్టివేస్తూ మార్కాపురం ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.శుభవాణి శుక్రవారం తీర్పుచెప్పారు. నిందితుడి తరపున న్యాయవాది కథనం మేరకు మార్కాపురం పట్టణానికి చెందిన వంగూరి చెన్నయ్య భార్య సౌజన్యపై అనుమానం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో 2018 ఏప్రిల్ 25న ఇంటిలో నిద్రిస్తున్న సౌజన్యను కర్రతో దాడిచేసి కొట్టడంతో మృతిచెందినట్లు మార్కాపురం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో సాక్షులను విచారించిన న్యాయమూర్తి శుభవాణి నేరం రుజువుకాకపోవడంతో కేసును కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. నిందితుని తరపున న్యాయవాది ఎం.అన్వర్‌బేగ్ వాదించారు.

నేడు రక్తదాన శిబిరం

గిద్దలూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గణేష్ నగర్‌లోని రమేష్ చిన్న పిల్లల ఆసుపత్రి ఆవరణలో తలసీమియా బాధితుల కోసం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం 9గంటలకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు 'మేమున్నాము' సేవాసమితి అధ్యక్షుడు చల్లా అశోక్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదానం చేసిన దాతలను ప్రశంసా పత్రాలతో గౌరవిస్తామని, రక్తదానం చేసి బాధితులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దర్శి ఏవోగా రాధ

దర్శి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దర్శి మండల వ్యవసాయాధికారిగా కె.రాధ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పామురు ఏవోగా పనిచేస్తున్న ఆమె సాధారణ బదిలీల్లో దర్శికి వచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిరంతరం రైతులకు అందుబాటులో ఉండి అవసరమైన సూచనలు ఇస్తూ రైతుల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు.

దొనకొండకు బాలకృష్ణానాయక్

దొనకొండ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): దొనకొండ మండల వ్యవసాయాధికారిగా బాలకృష్ణానాయక్ నియమితులయ్యారు. ఆయన దర్శి నుంచి దొనకొండకు బదిలీ అయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎస్.లక్ష్మీనారాయణ పెద్దారవీడు మండలానికి బదిలీ అయ్యారు. దొనకొండ రైతుసేవా కేంద్రంలో శుక్రవారం బాలకృష్ణానాయక్ పదవీ బాధ్యతలు స్వీకరించారు.

కనిగిరి: కనిగిరి మండలం వ్యవసాయశాఖ ఏవోగా జైనులాబ్దిన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పొదిలి నుంచి కనిగిరికి ఆయన బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా ఏవోను వ్యవసాయశాఖ సిబ్బంది అభినందించి సత్కరించారు. కనిగిరి మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతులకు తన వంతు సేవలందించి శాఖాభివృద్ధికి కృషి చేస్తానని ఈసందర్భంగా ఏవో పేర్కొన్నారు. సిబ్బంది సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఏవోలు, ఎంపీఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ముండ్లమూరు: ముండ్లమూరు మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్ బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలానికి బదిలీ అయ్యారు. బాపట్ల జిల్లా వ్యవసాయ కార్యాలయంలో డీఏవోగా పనిచేస్తున్న తిరుమలరావు ఇక్కడికి బదిలీపై వస్తున్నారు.

పీసీపల్లి: సాధారణ బదిలీల్లో భాగంగా పీసీపల్లి మండల వ్యవసాయాధికారి కె.ప్రకాశరావు బదిలీ అయ్యారు. ఆయనను కొనకమిట్ల మండలానికి బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

నేడు యోగాసనాలు వేయాలి

పీసీపల్లి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో యోగాసనాలు చేయాలని ఎంపీడీవో హనుమంతరావు తెలిపారు. మండలంలోని 18పంచాయతీల్లో 128 యోగా ప్రదేశాలను గుర్తించినట్టు చెప్పారు. ఆయా కేంద్రాలలో శిక్షకులతోపాటు ఉపాధ్యాయులు, ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామప్రజలతో కలిసి యోగాసనాలు వేయాలని ఆయన కోరారు.

పాఠశాలలకు విద్యాకిట్లు పంపిణీ

పామూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పామూరు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విద్యా కిట్లను ఆయా ప్రధానోపాధ్యాయులకు అందజేస్తున్నట్టు ఎంఈవో- 2 కె.కరుణకుమారి తెలిపారు. పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్న విద్యాకిట్లను ఆమె ఆధ్వర్యంలో పలు వాహనాల ద్వారా ఆయ పాఠశాలల హెచ్‌ఎంలు తీసుకెళుతున్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ చేసినట్టు ఎంఈవో తెలిపారు.

నేటి నుంచి కందుల కొనుగోలు

పీసీపల్లి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం నుంచి కందులు కొనుగోలు చేయనున్నట్లు వ్యవసాయశాఖ సిబ్బంది తెలిపారు. సహకార సంఘం ద్వారా చేపడుతున్న కందుల కొనుగోలు కేంద్రం మండలంలోని పెదఅలవలపాడు కొత్త సచివాలయ భవనం వద్ద ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. క్వింటా 7,550 రూపాయలకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హెల్త్ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలి

పామూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకట్టకిందపల్లి గ్రామ బీసీ కాలనీలో గత వైసీపీ ప్రభుత్వం హయాంలో సుమారు రూ.30 లక్షలతో విలేజ్ హెల్త్ క్లీనిక్ నిర్మించారు. దీనిని ఉపయోగంలోకి తీసుకురాకుండా వదిలివేయడంతో నిరుపయోగంగా మారిందని టీడీపీ గ్రామ ఇన్‌చార్జ్ పాలపర్తి వెంకటేశ్వర్లు ఆరోపించారు. నిరుపయోగంగా ఉన్న హెల్త్ క్లినిక్‌ను ఏఈ మస్తాన్‌వలి, పంచాయతీ కార్యదర్శి బొట్లగూడూరు ప్రభుత్వ వైద్యశాల డాక్టర్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ ధనంతో నిర్మించిన భవనం నిరుపయోగం ఉండటం తగదన్నారు. ఇప్పటికైనా పాలకులు, సంబంధిత అధికారులు స్పందించి ఆరోగ్య కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

17న మెగా జాబ్‌మేళా

కనిగిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మెగా జాబ్‌మేళా ద్వారా ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని ఎంఎస్‌ఎం కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17న మెగాజాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 15 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. 18 నుంచి 30 సంవత్సరాలలోపు అర్హులైన నిరుద్యోగులు తమ సర్టిఫికెట్‌లతో హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు ఎంఎస్‌ఎం కళాశాలలో సంప్రదించాలని కోరారు.

శిథిలావస్థలో రక్షిత ట్యాంకులు

- పొంచిఉన్న ప్రమాదం
- పట్టించుకోని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

ముండ్లమూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో తాగునీటి అవసరాల నిమిత్తం నిర్మించిన రక్షిత మంచినీటి ట్యాంకులు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏరూపంలో ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆయా గ్రామాల్లోని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నాలుగు దశాబ్దాల కిందట ఎస్‌పీపీ నీరు అందించాలన్న లక్ష్యంతో మంచినీటి ట్యాంకులను నిర్మించారు. రెండు దశాబ్దాల వరకు వాడుకలో ఉన్నాయి. ఆతరువాత ట్యాంకులు వాడుకలో లేకపోవటంతో నిరుపయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం ఆట్యాంకులు పెచ్చులు ఊడి ఇనుము, కంకర బయటపడ్డాయి. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలోని పసుపుగల్లు, పెదఉల్లగల్లు, శంకరాపురం, పూరిమెట్ల, నూజెండ్లపల్లి గ్రామాల్లో ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి. ఇటీవల ముండ్లమూరు, వేములు, పోలవరం, ఈదర, బొప్పూడివారిపాలెం గ్రామాల్లో ఉన్న ట్యాంకులను తొలగించారు. వేములలో ట్యాంక్ పడగొట్టే సమయంలో సమీప ఇళ్ళ మీద పడి పలువురికి గాయాలయ్యాయి. ప్రస్తుతం పసుపుగల్లులో ట్యాంక్ గ్రామం నడిబొడ్డున ఉండటమే కాక పెచ్చులూడిపోయి ఏ క్షణంలో కూలుతుందోనని సమీపవాసులు ఆందోళన చెందుతున్నారు. పెదఉల్లగల్లులో రహదారికి పక్కనే ట్యాంక్ ఉంది. దర్శి, అద్దంకి ప్రధాన రహదారి కావటంతో ఎప్పుడు ఏ రూపంలో ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు. శిథిలావస్థకు చేరిన రక్షిత మంచినీటి ట్యాంకులను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపానపోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన ట్యాంకులను తొలగించాలని కోరుతున్నారు.


కూలేందుకు సిద్ధంగా ఉన్న పసుపుగల్లులోని రక్షిత మంచినీటి ట్యాంకు


శిథిలావస్థకు చేరిన శంకరాపురంలోని రక్షిత మంచినీటి ట్యాంకు

దర్శి అభివృద్ధికి సీఎం చంద్రబాబు భరోసా

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడిని శుక్రవారం ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తున్నందుకు చంద్రబాబునాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. దర్శి నియోజకవర్గంలో అభివృద్ధి పనులను పూర్తి చేసేందకు నిధులు విడుదల చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అందుకు సీఎం చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందిస్తూ దర్శి అభివృద్ధి బాధ్యత నాది అని స్పష్టం చేసినట్లు ఆమె తెలిపారు. దర్శి ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేయాలని, ప్రజలతో మేకమై ముందుకుసాగాలని కోరారన్నారు. ప్రభుత్వ పథకాల అమలుపై వైసీపీ చేస్తున్న చెడు ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలవుతున్న విషయాన్ని ప్రజలకు వివరిస్తూ విజయవంత చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్న విషయాన్ని సీఎంకు వివరించినట్లు డాక్టర్ లక్ష్మి తెలిపారు.


సీఎం చంద్రబాబునాయుడిని కలిసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్

భక్తిశ్రద్ధలతో స్వామివార్లకు చక్రస్నానం

పామూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పామూరులోని శ్రీమదన వేణుగోపాలస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా చివరిరోజు శుక్రవారం స్వామివార్లకు చక్రస్నానాలు, ముగింపు హోమాలు నిర్వహించారు. అర్చకులు నారాయణం సత్యబాబు, దేవస్థాన ఈవో నరసింహబాబు ఆధ్వర్యంలో విశ్వక్సేణపూజ, పుణ్యావాచనం, నిత్యహోమం, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం స్థానిక సత్యదేవుని దేవస్థానం నుంచి వేణుగోపాల స్వామి దేవస్థానం వరకు నగర సంకీర్తన గ్రామోత్సవం నిర్వహించారు.

అనంతరం దేవస్థానంలో భక్తుల వినోదం కోసం దుర్గామాత కోలాటం, నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ సభ, ప్రముఖ సంగీత వి ద్వాంసులచే నాదస్వర కచేరి నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు, ఏకాంత సేవ, మంగళహారతులు నిర్వహిం చారు. బ్రహ్మోత్సవాల ముగింపు కార్యక్రమాల్లో దేవదాయ అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావు, కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, సీఐ భీమానాయక్, ఎస్‌ఐ కిశోర్ బాబుతో పాటు జిల్లాలో పలు దేవస్థానాల కార్య నిర్వాహక అధికారులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఉభయదాతలు, కార్యనిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.


స్వామివార్లకు చక్రస్నానం చేస్తున్న అర్చకులు



నగర సంకీర్తన నిర్వహిస్తున్న నాయీబ్రాహ్మణులు

నేడు సీతారాముల కల్యాణం

పామూరు, 13 జూన్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రమారెళ్ల గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం స్వామివార్ల శాంతి కల్యాణం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం విఘ్నేశ్వరపూజ, కలశ స్థాపన, సాయంత్రం అఖండ జ్యోతిఆరాధన, సామూహిక కుంకుమార్చనలు, రాత్రికి భరతనాట్య ప్రదర్శన నిర్వహించారు. శనివారం స్వామివార్లకు దాతలచే నూతన వెండి కిరీటం బహూకరణ, గణపతి రుద్రహోమాలు జరుగుతాయి. అనంతరం అర్చకులు మహంకాళి శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివార్ల శాంతి కల్యాణం జరుగుతంది. భక్తులకు అన్నదానం, రాత్రికి ఇంద్రజాల ప్రదర్శన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.


నర్రమారెళ్లలోని రామాలయం

ఉపాధి పనులను పరిశీలించిన కేంద్ర బృందం


ఉపాధి పరిశీలిస్తున్న కేంద్ర బృందం అధికారులు ఉమేష్‌కుమార్ రామ్, జీఎస్ రావత్

దర్శి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ బృందం అధికారులు ఉమేష్ కుమార్, జీఎస్ రావత్ మండంలోని యర్రఓబనపల్లి పంచాయతీలో ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం పరిశీలించారు. అక్కడ నిర్మించిన పంటకుంటలు, బత్తాయి తోటలు, పంటకాలువ పూడికతీతలు, పశువుల షెడ్‌లను పరిశీలించారు. ఉపాధి పనులు జరుగుతున్న తీరును గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి పనులను నిబంధనల ప్రకారం నిర్వహించాలన్నారు. నిధులు పక్కదారి మళ్లించినట్టు దుర్వినియోగం చేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అర్హులైన వారందరికి పనులు కల్పించాలని సూచించారు. జలవనరులను పెంపొందించే పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జోసఫ్ కుమార్, ఎంపీడీవో ఎల్‌క్రిష్ణమూర్తి అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లలితకుమారి, ఏపీవోలు బి.మురళి, దేవయ్య, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

- ఈఈ శ్రీనివాసులు

తాళ్లూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సిబ్బంది క్షేత్రస్థాయిలో బాధ్యతగా విధులు నిర్వహించి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఈఈ పి.శ్రీనివాసులు అన్నారు. తాళ్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం సాయంత్రం సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి వినియోగదారుడు సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకునేలా ప్రోత్సహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మొదటి విడతగా కోటిమంది వినియోగదారులకు మాత్రమే ఈపథకాన్ని ఇస్తుందన్నారు. వినియోగదారులు త్వరగా రిజిస్ట్రేషన్ చేయించుకుని ఈ పథకం ద్వారా విత్యుత్ ఉత్పత్తికి సహకరించేలా చూడాలన్నారు. సూర్యఘర్ పథకంతో వినియోగదారునికి కలిగే ఆదా, ప్రకృతి పర్యావరణానికి జరిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. వ్యవసాయ బకాయిలు వసూళ్ల వేగవంతం చేయాలన్నారు. తాళ్లూరు మండలంలో రూ.65 లక్షల బకాయి ఉన్నట్టు చెప్పారు. విద్యుత్ లైన్లు, జంగిల్ క్లియరెన్సు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అధికభారం ఉన్న ట్రాన్స్‌పార్మర్లపై దృష్టి పెట్టి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఈ రవికుమార్, ఎస్‌ఈ ఇమ్మానియేల్, లైన్‌ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసులు


రాజంపల్లిలో విత్తనం వేసేందుకు ట్రాక్టర్‌తో దుక్కిదున్నుతున్న రైతు

ప్రారంభమైన ఖరీఫ్ పనులు

- సబ్సిడీ విత్తనాల కోసం రైతుల ఎదురుచూపు

దర్శి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): దర్శి ప్రాంతంలో ఖరీఫ్ పంటల సాగు ప్రారంభమైంది. ఇటీవల కురిసిన వర్షాలకు భూములు పదునెక్కటంతో సాగర్ ఆయకట్టు భూముల్లో పెసర, మినుము పంటలను సాగు చేస్తున్నారు. సాగర్ నీరు విడుదలయ్యేలోపు పంట చేతికందే విధంగా స్వల్పకాలిక రకాలను ఎంచుకొని రైతులు పైర్లు సాగు చేస్తున్నారు. సాగర్ జలాలు విడుదలైన తర్వాత పెసర, మినుము పైర్లు తీసుకొని ఆర్వాత వరి సాగు చేస్తారు. మెట్ట ప్రాంతాల్లో సజ్జ, కంది, ఆముదం తదితర పైర్లు సాగు చేస్తున్నారు. రైతులు విత్తనాల కోసం పూర్తిగా ప్రైవేట్ వ్యాపారుల మీద ఆధారపడాల్సి వస్తుంది. అధిక ధరలకు విత్తనాలు కొనుగోలు చేసి పంటలను సాగు చేస్తున్నారు. సన్నచిన్న కారు రైతులు సబ్సిడీ విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం పచ్చిరొట్టె విత్తనాలను సబ్సిడీ పై అందిస్తున్నారు. అలాగే, ఖరీఫ్ సీజన్‌లో సాగుకు అనువైన కంది, సజ్జ, మినుము, పెసర విత్తనాలు సబ్సిడీ అందించాలని రైతులు కోరుతున్నారు. ఈవిషయమై వ్యవసాయాధికారులను వివరణ కోరగా ప్రస్తుతం పచ్చిరొట్టె ఎరువులకు సంబందించిన విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నట్టు చెప్పారు. మిగిలిన విత్తనాలు కూడా త్వరలో విడుదలవుతాయని తెలిపారు.

ముండ్లమూరులో భారీ వర్షం


పోలీసుస్టేషన్ ఎదురు రోడ్డుపై నిలిచిపోయిన వర్షపు నీరు

ముండ్లమూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ముండ్లమూరుతో పాటు వేంపాడు, తమ్మలూరు, పోలవరం, శంకరాపురం గ్రామాల్లో అరగంటకు పైగా వర్షం పడింది. దీంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. ముండ్లమూరు పోలీసు స్టేషన్ ఎదుట అద్దంకి - దర్శి రహదారిలో వర్షం నీరు నిలబడటంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో పోలీసులు ట్రాక్టర్‌తో కాలువ తీయించి వర్షపు నీరు బయటకు పంపే ఏర్పాట్లుచేశారు.

తాళ్లూరులో 5322 మందికి 'తల్లికి వందనం' నిధులు విడుదల

తాళ్లూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 సచివాలయాల పరిధిలో 5322 మంది తల్లులకు తల్లికి వందనం కింద ప్రభుత్వం రూ.7కోట్ల 98లక్షల 30వేలు విడుదల చేసినట్లు ఎంపీడీవో దారా హనుమంతరావు శుక్రవారం తెలిపారు. ఒక్కో తల్లికి 15వేల రూపాయలు విడుదల చేయగా.. తల్లుల అకౌంట్‌లకు రూ.13 వేలు, మిగిలిన రూ.రెండు వేలు పాఠశాల హెచ్‌ఎంల అకౌంట్లకు జమచేయటం జరిగిందన్నారు. మండలంలోని బొద్దికూరపాడులో 476మంది, తురకపాలెంలో 248 మంది, నాగంబొట్లపాలెంలో 620 మంది, తాళ్లూరు-1లో 328 మంది, విఠలాపురంలో 265 మంది, మల్కాపురంలో 232 మంది, తాళ్లూరు-2లో 406 మంది, శివరాంపురంలో 471మంది, తూర్పుగంగవరంలో 566 మంది, వెలుగువారిపాలెంలో 359 మంది, దోసకాయలపాడులో 247మంది, లక్కవరంలో 566 మంది, మన్నేపల్లిలో 246 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారి చదువుల నిమిత్తం తల్లుల ఖాతాల్లో నగదు జమచేసినట్లు తెలిపారు. 544 మందికి చెందిన బ్యాంక్ ఖాతాలు సక్రమంగా లేనందున నిధులు జమకాలేదన్నారు. బ్యాంక్ ఖాతాలు సరికాగానే వారికి తల్లికి వందనం నగదు జమ అవుతుందన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


ఉర్దూ పాఠశాలకు చేరిన విద్యా కిట్లు

కనిగిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఎంఈవో యూవీ నారాయణరెడ్డి అన్నారు. కనిగిరి మండలంలో 8206 మంది విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు పంపిణీ చేసినట్టు చెప్పారు. పట్టణంలోని టకారిపాలెంలోని ఉర్దూ పాఠశాలలకు, 4వ వార్డులోని యూపీ ఉర్దూ పాఠశాలకు విద్యామిత్ర కిట్లు అందజేసినట్టు చెప్పారు. తల్లికి వందనం పథకం కింద నేరుగా విద్యార్థుల తల్లులకు ప్రభుత్వం నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల కంటే మిన్నగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతుందన్నారు.

రాళ్లదాడి కేసులో నిందితులకు పరామర్శ

దర్శి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పొదిలిలో మహిళలు, పోలీసులపై రాళ్ళదాడి కేసులో వైసీపీ కార్యకర్తలకు దర్శి కోర్టు రిమాండ్ విధించడంతో వారిని సబ్‌జైలుకు తరలించారు. పొగాకు రైతులను పరామర్శించేందకు మాజీ సీఎం జగన్ రెండురోజుల క్రితం పొదిలి వచ్చిన సందర్భంగా వైసీపీ కార్యకర్తలు ఉద్దేశపూర్వకంగా శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న మహిళలు, పోలీసులపై రాళ్ళదాడి చేసిన విషయం తెలిసిందే. పోలీసులు ప్రాథమికంగా తొమ్మిది మందిని గుర్తించి కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించింది.

ఈనేపథ్యంలో దర్శి ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, వైసీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ సబ్‌జైల్‌లో ఉన్న నిందితులను శుక్రవారం పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు.

విద్యుత్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

కనిగిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు శుక్రవారం పట్టణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా స్థానిక డీఈఈ కార్యాలయంలో విద్యుత్‌శాఖ సిబ్బంది, అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విస్తృత తనిఖీలు నిర్వహించిన అధికారులు అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఆరుగురిపై కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. విద్యుత్‌శాఖ అనుమతించిన కేటగిరిలో విద్యుత్ వాడకం చేయకపోవటాన్ని గుర్తించిన అధికారులు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి రూ.12 లక్షలు జరిమానా విధించారు. అనుమతించిన లోడ్ పరిధికి మించి విద్యుత్ వాడకంపై మరో 44మందిపై కేసులు నమోదు చేసి రూ.1.42లక్ష జరిమానా విధించారు. ఇంకా వినియోగదారులు అవలంబిస్తున్న చౌర్యానికి మొత్తం రూ.2.54 లక్షలు జరమానా విధించారు.

ఈ తనిఖీల్లో 23 మంది అధికారులతో పాటు 70 మంది సిబ్బంది మూకుమ్మడిగా తనిఖీలు నిర్వహించటంతో పట్టణంలో ఒక్కసారిగా కలకలం రేగింది. ఈ తనిఖీల్లో విజిలెన్స్ డీఈఈడబ్ల్యూ కె.వెంకటేశ్వర్లు, ఏ.శ్రీనివాసరావు, ఏఈ కోటేశ్వరరావు, ఆపరేషన్ విభాగం ఈఈ ఆర్.ఉమాకాంత్, డీఈఈ కృష్ణారెడ్డి, ఏఈలు పవన్‌కుమార్, నవీన్, రసూల్, జిలాని, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.



ఉష్ణోగ్రత (అంచనా)

14-6-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	36	27
తెనాలి	37	27
నరసరావుపేట	35	27
బాపట్ల	36	28
రెంటచింతల	36	26
చీరాల	36	28

జంపనిలో.. పారిశ్రామికవాడ?

- షుగర్ ఫ్యాక్టరీ స్థానంలో ఏర్పాటుకు పరిశీలన
- సీఎంతో చర్చించాక ప్రకటిస్తామన్న ఎమ్మెల్యే ఆనందబాబు



షుగర్ ఫ్యాక్టరీ స్థలాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు తదితరులు

వేమూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గతంలో మూతపడిన జంపని షుగర్ ఫ్యాక్టరీ స్థానంలో పారిశ్రామికవాడ ఏర్పాటు చేసేందుకు యోచిస్తున్నట్లు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాజీ ఎమ్మెల్సీ పరుచూరు అశోక్ బాబుతో కలిసి షుగర్ ఫ్యాక్టరీ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న ఉద్యోగుల ద్వారా కొంత సమాచారాన్ని సేకరించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ రైతుల అభివృద్ధిని కాంక్షించి ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీ మూతపడటం దురదృష్టకరమన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన మేరకు ఫ్యాక్టరీకి సంబంధించిన 77 ఎక రాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఉందన్నారు. నిరుద్యోగ యువత, రైతు కూలీలకు, కార్మికులకు పెద్ద సంఖ్యలో జీవనోపాధి కల్పించేలా ఇండస్ట్రియల్ పా ర్కు ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకు ఇవ్వా ల్సిన షేర్ ధనం రూ.2 కోట్లు, ఉద్యోగుల బకా యిలను పూర్తిగా చెల్లిస్తామన్నారు. గతంలో ఫ్యాక్టరీ తీసుకున్న రుణాలను వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా పరిష్కరిస్తామన్నారు. సహకార రంగంలో ఉన్న ఈ సంస్థను పూర్తిస్థాయిలో ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ముఖ్యమంత్రి అనుమతితో పారిశ్రామికవాడపై నిర్ణయాన్ని ప్రకటిస్తామన్నారు. వారంలోగా దీనిపై ప్రతిపాదనను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తానని చెప్పారు. ఎమ్మెల్యే వెంట ఎంప్లాయీ స్ అసోసియేషన్ నాయకులు బసివిరెడ్డి శివప్రసాద్, వట్టిప్రోలు యోబు, వేములపల్లి రామకోటయ్య ఉన్నారు.

ఆయిల్.. అన్వేషణ

- ఇందన నిక్షేపాల కోసం ఓఎన్జీసీ సర్వే
- పొనుగుపాడు కాల్వ ప్రాంతంలో పనులు
- ఒంగోలు నుంచి విజయవాడ వరకు 24 వేల బోర్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆయిల్ నిక్షేపాల కోసం చమురు, సహజ వాయువుల సంస్థ (ఓఎన్జీసీ) అన్వేషణ చేపట్టింది. ఇందనం, గ్యాస్ నిక్షేపాలను గుర్తించేందుకు విస్తృతంగా సర్వే పనులు జరుగుతున్నాయి. శాటిలైట్ నివేదికల ఆధారంగా ఆయిల్ నిక్షేపాల కోసం ఓఎన్జీసీ



ఫిరంగిపురం : పొనుగుపాడులో భూముల్లో ఆయిల్ సర్వే కోసం వేస్తున్న బోర్లు

అధికారులు అన్వేషిస్తున్నారు. చమురు, గ్యాస్ నిల్వల ఉనికి, పరిమాణాన్ని నిర్ధారించడానికి ముందుగా గుర్తించిన ప్రాంతాల్లో బోరు బావులను తవ్వుతున్నారు. ఒక్కొక్క బోరు 80 అడుగుల లోతున వేస్తున్నారు. ఒంగోలు నుంచి విజయవాడ కృష్ణానది వరకు సర్వే చేస్తున్నారు. ఇందులో భాగంగా కొన్ని రోజులుగా ఫిరంగిపురం మండలం పొనుగుపాడు కాల్వ ప్రాంతంలోని పొలాల్లో పెద్దఎత్తున బోర్లు వేస్తున్నారు. ఈ బోర్ల నుంచి సదరు సంస్థ ఇంజనీర్లు మట్టి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపుతున్నారు. ఇలా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో మొత్తం 24,000 బోర్లు వేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇప్పటికే 14,000 బోర్ల నిర్మాణం జరిగింది. రానున్న రెండు నెలల్లో మిగిలిన 10,000 బోర్లు వేయనున్నారు. ఒక్కొక్కబోరుకు రూ.5,600 చెల్లిస్తున్నారు. కేవలం బోర్ల నిర్మాణానికే ఓ ఎన్జీసీ రూ.13.44 కోట్లు ఖర్చు చేస్తోంది. రైతుల ఆమోదంతోనే బోర్ల నిర్మాణం చేపట్టినట్లు సదరు సంస్థకు చెందిన కాంట్రాక్టర్లు తెలిపారు. పొనుగుపాడులో ఒకే ప్రాంతంలో పెద్దఎత్తున బోర్ల నిర్మాణం జరుగుతుండటంతో ఆ ప్రాంతాల రైతులు, ప్రజలు అక్కడ ఏమి చేస్తున్నారు.. ఎందుకు బోర్లు వేస్తున్నారనే విషయాలను పరిశీలించేందుకు, తెలుసుకునేందుకు ప్రత్యేకంగా ఆసక్తి చూపుతున్నారు.

తల్లికి వందనం ఆనందం

సూపర్ సిక్స్‌లోని.. 'తల్లికి వందనం' విద్యా సంవత్సరం ఆరంభం రోజునే ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. శుక్రవారం ఉదయం నుంచి తల్లుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కావడం ప్రారంభమైంది. ఖాతాల్లో పడిన నగదు చూసు కుని తల్లిదండ్రుల్లో ఆనందం వెల్లివెరిసింది. గత వైసీపీ ప్రభు త్వం అమ్మఒడి పథకాన్ని అమలు చేసినా ఒక్కో కుటుంబంలో ఒక్కరికే అమలు చేసింది. కుటుం బంలో ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం అమలు చేస్తామని చెప్పినట్లుగానే కూటమి ప్రభుత్వం ముగ్గురు, నలుగురు, ఐదుగురు పిల్లలు ఉన్న వారికి కూడా నగదు వేయడంతో ఆ కుటుంబాల్లో సంతోషాన్ని రెట్టింపు చేసింది. వైసీపీ నేతలు తల్లికి వందనం అమలుపై దుష్ప్రచారం చేయగా.. వాటిని పటాపంచలు చేస్తూ గతంలో చెప్పినట్లుగా పథకాన్ని అమలు చేయడంతో కూటమి శ్రేణులతో పాటు లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. పలు ప్రాంతాల్లో తల్లిదండ్రులతో కలిసి కూటమి నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞత తెలిపారు. తల్లికి వందనం పేద కుటుంబాల్లో సంతోషాలను తీసుకొచ్చింది.



తల్లికి వందనం నగదు జమ చేయబడిన ముగ్గురు పిల్లలతో ఈమనికి చెందిన కంచర్ల రజిత

తల్లుల ఖాతాల్లో జమవుతున్న నగదు

- ఈపూరులో ఐదుగురున్న పిల్లల తల్లికి ఏకమొత్తంగా రూ.65 వేలు
- పిల్లలతో కలిసి హర్షం వ్యక్తం చేస్తోన్న తల్లిదండ్రులు
- సచివాలయాల వారీగా లబ్ధిదారుల జాబితాల ప్రదర్శన
- అభ్యంతరాల స్వీకరణకు వచ్చే నెల 5 వరకు గడువు




పెదకూరపాడులో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

(గుంటూరు, గుంటూరు(విద్య), బాపట్ల - ఆంధ్రజ్యోతి)

ఎన్నికల హామీలో ప్రధానమైన తల్లికి వందనం పథకం అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గురువారం జీవో విడు దల చేయగా ఆ తర్వాత నుంచి తల్లుల ఖా తాల్లో నగదు జమ అవడం ప్రారంభమైంది. శుక్రవారం ఉదయానికే గ్రామ/వార్డు సచివా లయాల్లో తల్లికి వందనం పథకానికి సం బంధించి అర్హులు, అనర్హుల జాబితాలను ప్రదర్శించారు. అలానే వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశారు. వాటిని చూసుకుని అర్హుల జాబితాలో ఉన్న తల్లుల ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. కాసేపటికి

(మిగతా 6వ పేజీలో)



8,199 మందికి ట్రిపుల్ ధమాక

తల్లికి వందనం పథకాన్ని కుటుంబంలోని పిల్లలందరికీ వర్తింప చేయడంపై అనుమానాలు వ్యక్తం చేసిన వారు కూడా ఆశ్చర్యపోయేలా తల్లుల ఖాతాల్లో ఏకమొత్తం గా నగదు జమ చేస్తున్నారు. ముగ్గురు పిల్లలు ఉన్న తల్లులకు ట్రిపు ల్ ధమాక లభించింది. గుంటూరు జిల్లాలో 2131, పల్నాడు జిల్లాలో 4635, బాపట్ల జిల్లాలో 1433 మంది తల్లులకు ముగ్గురు/అంతకంటే ఎక్కువమంది పిల్లలు ఉన్న తల్లులు 'తల్లికి వందనం' పథకానికి ఎంపికయ్యారు. వీరిలో పలువురికి నగదు జమ కూడా అయింది. ఒక్కో బిడ్డకు రూ.13 వేల చొప్పున ముగ్గురున్న వారికి రూ.39 వేలు, నలుగురు ఉన్న వారికి రూ.52 వేల నగదు బ్యాంకు ఖాతాల్లో జమైంది. పల్నాడు జిల్లా పరిధిలో ఈ పథకం ద్వారా పెద్దసంఖ్యలో తల్లులు లబ్ధి పొందినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి.

ఐదింతలు..

ఈపూరు ఎస్సీ కాలనీకి చెందిన దారా సాగర్, మేరీ దంపతులకు ఐదుగురు సంతానం కాగా వారికి రూ.65 వేలు బ్యాంకు ఖాతాలో జమ కావడంతో వారి ఆనందం ఐదింతలైంది.



ఆనందంగా స్కూలుకు వెళుతూ

కొనసాగుతున్న కౌన్సెలింగ్

- మాన్యువల్‌గా నిర్వహించాలని మున్సిపల్ టీచర్ల డిమాండ్
- డీఈవో రేణుక హామీతో ఉపాధ్యాయుల ఆందోళన విరమణ
- నేటితో బదిలీ ప్రక్రియ ముగింపు.. 16న విధుల్లోకి ఉపాధ్యాయులు



సమావేశంలో కింద కూర్చుని ఆందోళన చేస్తున్న మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాల ఉపాధ్యాయులు

గుంటూరు(విద్య), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ శుక్రవారం జడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. అర్ధరాత్రి వరకు కూడా కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఉపాధ్యాయులు జడ్పీ వద్ద రాత్రి పూట కూడా పడిగాపులు కాస్తున్నారు. మండల పరిషత్ యాజమాన్యాల ఆధ్వర్యంలోని పాఠశాలల్లో పని చేసే ఎస్జీటీలకు బదిలీల కౌన్సెలింగ్ పూర్తి చేశారు. ఆ తర్వాత మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ చేపట్టారు. పలు అవాంతరాలతో ఆయా ఉపాధ్యాయులు తమకు కూడా మాన్యువల్‌గానే బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. జడ్పీ సమావేశ మందిరంలోని కౌన్సెలింగ్ కేంద్రం వద్ద మున్సిపల్, కార్పొరేషన్ ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నాయకులు పెదబాబు, డీకే సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన ఒత్తిడి కారణంగా ఇప్పటికే 80 శాతం మంది మున్సిపల్, కార్పొరేషన్ ఉపాధ్యాయులు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ఆప్షన్లు పెట్టుకున్నారని దీనివల్ల వారికి నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. ఉపాధ్యాయుల ఆందోళనతో స్పందించిన డీఈవో రేణుక మున్సిపల్ ఉపాధ్యాయులకు కూడా మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. దీంతో ఉపాధ్యాయులు ఆందోళన విరమించారు. శనివారం మున్సిపల్ ఉపాధ్యాయులకు కూడా కౌన్సెలింగ్ పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు ప్రకటించారు. సోమవారానికి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు విధుల్లో చేరతారని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు.

విస్తృత రుణాలకు వార్షిక ప్రణాళిక

- పంపిణీలో నూరు శాతం లక్ష్యాలు చేరుకోవాలి
- సీసీఆర్సీ కార్డుదారులకు రూ.200 కోట్లు ఇవ్వాలి
- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రాధాన్య, అప్రాధాన్య రంగాలకు విస్తృతంగా రుణాల పంపిణీకి సంబంధించి వార్షిక ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బ్యాంకర్ల జిల్లా స్థాయి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుణాల పంపిణీలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నూరుశాతం చేరుకోవాలన్నారు. గత సంవత్సరంలో రైతులకు లక్ష సీసీ ఆర్సీ కార్డులను జారీ చేయగా అందులో కేవలం 23 వేల మందికి మాత్రమే రుణాలు మంజూరు చేశారన్నా రు. సీసీఆర్సీ కార్డుదారులకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.200 కోట్లు రుణాలు ఇవ్వాలని, బ్యాంక్ బ్రాంచ్‌ల ప్రకారం లక్ష్యాలను నిర్దేశించాలని ఎల్‌డీఎంకు సూచించారు.

- పీఎమ్ సూర్యఘర్ పథకంలో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి బ్యాంక్‌లు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల ఇళ్లకు మూడు యూనిట్ల స్థాపనకు నిర్దేశించడమైనదన్నారు. ఇందుకు రూ.78 వేలు సబ్సిడీ కింద వస్తుందన్నారు. దరఖాస్తుదారుడు వెండర్‌ను నిర్దేశించిన తర్వాత వెంటనే రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు తెలిపారు. జిల్లాకు 36 కిసాన్ డ్రోన్ యూనిట్లను లక్ష్యంగా ఇచ్చారని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, నాబార్డు డీడీఎమ్ రవికుమార్, ఆర్‌బీఐ ఎల్‌డీవో నవీన్‌బాబు, యూనియన్ బ్యాంక్ రీజనల్ అధికారి మాధురి, ఎల్‌డీఎం శివకృష్ణ పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుతో భూసారం

విత్తనాల పంపిణీలో వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు

కొల్లూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట సాగుతో భూసారం పెరుగుతుందని తద్వారా రసాయన ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చని వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు తెలిపారు. కొల్లూరులోని రైతు సేవా కేంద్రం-2ను ఆయన శుక్రవారం సందర్శించి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. వరి సాగు ఎప్పుడు ప్రారంభిస్తారు.. ఏయే రకాలను ఎక్కువ సాగు చేస్తున్నారని ఆరా తీశారు. అనంతరం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను రాయితీపై పంపిణీ చేశారు. ఈ నెల 26వ తేదీ అనంతరం కాల్వలకు సాగునీరు విడుదల అవుతుందన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు, టీఎండీఎస్ విత్తనాలను తొలకరి వర్షాలు కురియగానే చల్లుకుని 45 రోజుల తర్వాత రోటావేటర్‌తో భూమిలో కలియదున్నడం ద్వారా భూసారం గణనీయంగా పెరుగుతుందన్నారు. దీని వల్ల రసాయన ఎరువుల ఖర్చు తగ్గుతుందని చెప్పారు. డీ-కృషి యాప్ ద్వారా విత్తనాల పంపిణీ ఎలా జరుగుతుందనే అంశాన్ని పరిశీలించారు. మేక్ పేమెంట్ ఎప్పటికప్పుడు చేయాలని ఆలస్యం చేసే సిబ్బందిని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రేపల్లె ఏడీఏ విజయబాబు, ఏపీసీడ్స్ డీఎం సుమలత, ఏవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న కమిషనర్ ఢిల్లీరావు

సివిల్ సప్లయిస్ డీఎం బదిలీ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సివిల్ సప్లయిస్ విభాగంలో ఇన్‌చార్జి జిల్లా మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న పి.శ్రీనివాసరావును డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఎంగా బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు ఆరు నెలల నుంచి సివిల్ సప్లయిస్ డీఎం పోస్టు ఖా ళీగా ఉండగా డీఎస్‌వోగా విధుల్లో ఉన్న విలియమ్స్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. నెలన్నర క్రితమే ఇన్‌చార్జి డీఎంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావు స్వల్పకాలంలోనే వేరే జిల్లాకు బదిలీపై వెళ్లడం చర్చనీయాంశమైంది. ధాన్యం సేకరణలో భాగంగా ఖరీఫ్, రబీ రెండు సీజన్లు ఇన్‌చార్జి హోదా అధికారులతోనే పూర్తి కావడం గమనార్హం.

నల్లపాడులో ఫ్రైట్ డిపో ప్రారంభం

గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు రైల్వే ప్రాంగ ణంలో నూతనంగా నిర్మించిన ఫ్రైట్ డిపోని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ ప్రారంభించారు. శుక్రవారం గుంటూరు రైల్వే డివిజన్ పర్యటనకు వచ్చిన ఆయన తొలుత నల్లపాడు రైల్వే స్టేషన్‌ని సందర్శించారు. అక్కడ ఫ్రైట్ డిపోకి శిలా ఫలకం ఆవిష్కరించారు. ఇక నుంచి ఈ ఫ్రైట్ డిపోలో గూడ్స్ వ్యాగన్లను పరీక్షించి బీపీసీ సర్టిఫికెట్లను జారీ చేస్తారు.

ట్రాన్స్‌జెండర్‌కు తీవ్రగాయాలు



ప్రమాదస్థలంలో దెబ్బతిన్న స్కూటీ

ఒంగోలు(రూరల్), జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు రోడ్డులో లారీ ఢీకొనడంతో ట్రాన్స్‌జెండర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. శుక్రవారం బియ్యంలారీ స్థానిక ఎఫ్‌సీఐ గూడెంలోకి వెళ్లే సమయంలో ట్రాన్స్‌జెండర్ స్కూటీపై వెళుతూ వేగంగా వెనుక వైపు ఢీకొట్టింది. దీంతో ఆమెకు తీవ్రగాయాలు కాగా స్థానికులు వైద్యశాలకు తరలించారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

(5వ పేజీ తరువాయి)

30లోపు బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలి. కంటిచూపులేని ఉద్యోగులు, మానసిక వైకల్యంతో ఉన్న పిల్లల తల్లిదండ్రులు, గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు పైగా పనిచేసిన ఉద్యోగులు, 40 శాతం పైగా వైకల్యం ఉన్న ఉద్యోగులు, దీర్ఘకాలిక వ్యాధులున్న ఉద్యోగులు, భర్తలేనటువంటి మహిళా ఉద్యోగులకు ప్రాధాన్యత ఇవ్వాలి. దంపతులిద్దరూ ఉద్యోగులైతే సమీప ప్రాంతాల్లోనే నియమించాలి. ఈ బదిలీలు స్వచ్ఛంద బదిలీలుగా పరిగణించి ప్రయాణభత్యం, ఇతర ప్రయోజనాలు కల్పించాలి. ముందుగా ఐటీడీఏ ప్రాంతాల్లో ఖాళీలను పూర్తిచేసిన తర్వాతనే మిగిలిన సచివాలయాల్లో భర్తీ చేయాలి. సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తయిన తర్వాత సచివాలయాల రేషనలైజేషన్‌లో మిగిలిపోయిన ఉద్యోగుల వివరాలను హెచ్‌ఆర్‌ఎంఎస్ పోర్టర్‌లో జూలై 10లోపు నమోదు చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

బ్యాంకు ఖాతాతో ఆధార్ అనుసంధానం తప్పనిసరి

ఒంగోలు నగరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తల్లికి వందనం నిధులు విడుదల చేస్తోందని, ఇవి బ్యాంకు ఖాతాకు జమ కావాలంటే ఆధార్ నంబరుతో ఖాతాను అనుసంధానం చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్ కోరారు. 9, 10 తరగతులు చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు తల్లికి వందనం నిధులు తల్లుల ఖాతాలకు జమ అవుతాయని, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు వారి ఖాతాలకు నిధులు జమ చేస్తారని తెలిపారు. ఆధార్ నంబర్‌ను బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేసి, ఆ ఖాతా వివరాలను సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల్లో వెల్ఫేర్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ ద్వారా ఎన్‌పీసీఐ పోర్టల్‌లో అనుసంధానం చేసుకోవాలని కోరారు. ఈ నెల 16వ తేదీలోగా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు.

గుండెపోటుతో హెల్త్ సూపర్‌వైజర్ మృతి



పిచ్చయ్య(ఫైల్)

వేటపాలెం (చీరాల), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి పీహెచ్‌సీ లో హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న పిచ్చయ్య(60) గుండెపోటుతో మృతి చెందారు. ఎప్పటిలాగే శుక్రవారం కూడా విధులకు హాజరయి పనిచేస్తున్న సమయంలో విధుల్లోనే ఉన్నపాటుగా గుండెపట్టుకుని కుప్పకూలాడు. ఈ క్రమంలో పరీక్షలు వేటపాలెం మెడికల్ అధికారి డా.స్వాతికిరణ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయన మృతిపై పలువురు ఆరోగ్య సిబ్బంది దిగ్భ్రాంతి చెందారు.

ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం

నాగులుప్పలపాడు, జూన్13 (ఆంధ్రజ్యోతి): ఖననం చేసిన మహిళ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన సంఘటన కనపర్తిలో జరిగింది. వీఆర్వో భాగ్యారావు తెలిపిన వివరాల మేరకు.. ఇరవై రోజుల క్రితం కనపర్తి గ్రా మంలోని రెడ్డిపాలెంకు చెందిన కుక్కల కోటేశ్వరమ్మ (70) ప్రయాణిస్తున్న ఆటో దాసరివారిపాలెం వద్ద బోల్తాపడింది. దీంతో ఆమె గాయపడగా ఒంగో లులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. అనంతరం జీజీహెచ్‌కు తరలించగా కోటేశ్వరమ్మ మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధా రించారు. దీంతో ఆమె మృతదేహాన్ని కనపర్తి తరలించి వ్యవసాయ భూముల్లో ఖననం చేశారు. మృతురాలి కుటుంబసభ్యులు వినతి మేరకు శుక్రవారం జీ జీహెచ్ వైద్యులు తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ రజియాసుల్తానా స మక్షంలో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు.

అర్ధరాత్రి పులి పంజా

పాలుట్ల గూడెంలో పశువుల దొడ్డిపై దాడి

ఒక ఎద్దు, ఆవు మృతి

కన్నీటిపర్యంతమైన రైతు సేవ్యానాయక్

ఆందోళన చెందుతున్న గిరిజన కుటుంబాలు



పాలుట్లలో పులిదాడిలో గాయపడి మృతి చెందిన అరక ఎద్దు

ఎర్రగొండపాలెం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం మండలం పాలుట్ల గిరిజనగూడెంలో గురువారం రాత్రి ఆవులదొడ్డిపై పులి దాడి చేసింది. కరంతోటి సేవ్యానాయక్‌కు చెందిన ఒక ఎద్దు, ఆవును చంపేసింది. ఈ ఘటన గురువారం రాత్రి జరిగింది. గ్రామ సచివాలయం పక్కనే ఆవులదొడ్డి ఉండటంతో వాటి యజమాని ఆవులను, అరక ఎద్దులను దొడ్డిలో తోలి ఇంటికి వెళ్లాడు. రాత్రి సమయంలో దొడ్డిలోకి పులి ప్రవేశించడంతో ఆవులు అటుఇటూ బెదురుతూ పరుగెత్తడం టాన్ని చూసిన స్థానికులు పెద్దగా కేకలు వేయడంతో గూడెం గిరిజనులు అక్కడకు చేరుకున్నారు. వారంతా కేకలు వేయడంతో పులి అక్కడ నుంచి వెళ్లిపోయింది. అప్పటికే పులి దాడిలో గాయపడిన అరక ఎద్దు, ఆవు మృతి చెందాయి. వాటిని చూసి యజమాని సేవ్యానాయక్ కన్నీరుమున్నీరయ్యారు. అరక ఎద్దు విలువ రూ.70 వేలు, ఆవు విలువ రూ.40 వేలు ఉంటుందని, మొత్తం రూ.1.10 లక్షలు నష్టం వాటిల్లిందని విలపిస్తూ తెలిపారు. ఈ ఘటనతో పాలుట్ల గిరిజనులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలుట్లలో ఆవుల దొడ్లు 20కిపైగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో పులుల దాడి నుంచి తమను, పశుసంపదను కాపాడాలని ఫారెస్టు అధికారులకు గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మధ్యాహ్న భోజనం మరింత రుచిగా...

అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలలకు సన్నబియ్యం

విద్యాలయాలకే నేరుగా సరఫరా

క్యూఆర్ కోడ్‌ను హెచ్‌ఎం స్కాన్ చేస్తేనే ఆ స్కూలు వాటా దిగుమతి

సంతనూతలపాడు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడంతో పాటు వారికి బలవర్థక ఆహారం అందించేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. మధ్యాహ్న భోజన పథకం అమలులో గత ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న లోటుపాట్లు సరిచేసేందుకు సర్కారు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యమైన సన్నబియ్యాన్ని సరఫరా చేయాలని నిర్ణయించారు. గతంలో సరఫరా చేసిన బియ్యంలో నాణ్యత సరిగా లేకపోవడంతో అన్నం ముద్దగా ఉండేది. దీంతో చాలామంది పిల్లలు ఇంటి నుంచి భోజనం తెచ్చుకునేవారు. ఈ ఏడాది వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం నుంచి అన్ని రకాల ప్రభుత్వ బడుల్లో సన్న బియ్యంతో వండిన అన్నాన్ని విద్యార్థులకు వడ్డిస్తున్నారు.

మండలంలో 46 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజనానికి సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. గతంలో పౌరసరఫరాల శాఖ ద్వారా డీలర్‌కు అక్కడ నుంచి పాఠశాలలకు బియ్యం తరలించేవారు. ప్రస్తుతం నేరుగా పాఠశాలలకు, హాస్టళ్లకు ఇస్తున్నారు. 25 కేజీల బ్యాగ్‌గా తయారు చేసి క్యూర్‌కోడ్ ట్యాగ్‌తో సరఫరా చేస్తున్నారు. ఈ కోడ్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్కాన్ చేస్తే ఓటీపీ ఆధారంగా ఆ పాఠశాల కోటాను



మధ్యాహ్నభోజనం చేస్తున్న విద్యార్థులు

సిబ్బంది దింపి వెళతారు.

వంటసిబ్బందికి శిక్షణ పూర్తి

మధ్యాహ్న భోజనం వండి పెట్టే నిర్వాహకులకు, వంట చేసే వారికి మండలాల వారీగా గత వారం కిందటే శిక్షణ ఇచ్చారు. విజయవాడలో శిక్షణ పొందిన వారు మండల స్థాయిలో వంటచేసేవారికి శిక్షణ ఇచ్చారు. వంటచేసే విషయంలో శుభ్రమైన పద్ధతుల్లో ఏ విధంగా వంట చేయాలో, పోషక విలువలు పాడవకుండా ఏ విధంగా చేయాలో వంట చేసే చోటు పరిశుభ్రత తదితర అంశాలపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చారు.

సముద్రతీరంలో ఆహ్లాదంగా యోగాంధ్ర





పర్చూరులో యోగాపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్, చీరాలలో యోగా చేస్తున్న అధికారులు

చీరాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రామాపురం సముద్రతీరం అధికారులు నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంతో ఆహ్లాదకరంగా మారింది. సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం శుక్రవారం రామాపురం తీరంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చీరాల పరిధిలోని అన్ని ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులు సిబ్బంది యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్, ఆర్‌డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్లు, గోపీకృష్ణ, పార్వతి, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, డీఈ రఘురామ్, తదితరులు పాల్గొన్నారు.

యోగాతోనే ఆరోగ్యవంతమైన జీవితం

పర్చూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) యోగాతోనే ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమౌతుందని పర్చూరు మండల హోమియా వైద్యులు, యోగాంధ్ర మాస్టర్ ట్రైనర్ డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన పర్చూరు బొమ్మల కూడలిలో యోగాంధ్ర కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలు ఆసనాలు వేసి ప్రజను చైతన్య పరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పనిఒత్తిడితో ప్రజలు మానసిక రుగ్మతలకు లోనవుతున్నారన్నారు. తద్వారా వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. దీన్ని అధిగమించేందుకు ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో యార్లగడ్డ శ్రీనివాసరావు, బి.సాంబశివరావు, వై.పోలిరెడ్డి, షేక్.బాజీబాషా.తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలతో జనం బెంబేలు

● పోలీసుల ఉదాశీనత ● జోరుగా మోటార్లు, బైక్‌ల దొంగతనాలు ● చోరీ కోసం వచ్చిన ఆటోను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన ఆక్వా రైతులు

కొత్తపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కొత్తప ట్నం మండలంలో గత నెల రోజులుగా వరుస దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు బెం బేలెత్తుతున్నారు. రొయ్యల చెరువుల వద్ద ఉన్న విద్యుత్ మోటార్లు, నివాసాల వద్ద తాళాలు వేసి ఉన్న మోటార్‌సైకిళ్లను రాత్రి వేళల్లో అపహరిం చుకెళుతున్నారు. ఈ దొంగతనాలపై పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నా వారు స్పందించకపోవ టంతో దొంగలు రెచ్చిపోతున్నారు. పట్టపగలే చో రీలకు తెగబడుతున్నారు. శుక్రవారం కొప్పోలు- అల్లూరు గ్రామాల మధ్య చింతల సమీపంలో అల్లూరు ఎంపీటీసీ శాంతారావు సాగు చేస్తున్న రొయ్యల చెరువుల వద్ద విద్యుత్ మోటార్‌ను పట్టపగలే అపహరించేందుకు ముగ్గురు దొంగలు యత్నించారు. దీంతో వారిని రైతులు పట్టుకునేం దుకు ప్రయత్నించగా పారిపోయారు. ఈక్రమం లో మోటార్‌ను తరలించేందుకు దొంగలు ఉ పయోగించిన ఆటోను రైతులు స్వాధీనం చేసు కుని ఒంగోలు సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌కు అ ప్పగించారు. వారం క్రితం అల్లూరు గ్రామంలోనే ఇంటి ముందు నిలిపిఉంచి మోటార్‌సైకిల్‌ను రాత్రికి రాత్రే తీసుకుపోయారు. విచిత్రమేమంటే తమ వద్ద డొక్కు మోటార్‌సైకిల్‌ను అక్కడే వది లేసి ఇంటి ముందు ఉన్న కొత్త బైక్‌ను చోరీ చేశారు. పది రోజుల క్రితం చింతల సమీపంలోని రొయ్యల చెరువుల వద్ద రాత్రి సమయంలో వి ద్యుత్ మోటార్లను చోరీ చేసిన వ్యక్తులు తమ వద్ద ఉన్నపాత మోటార్‌సైకిల్‌ను అక్కడే వదిలేసి వెళ్ళిపోయారు. ఇలా ఈ వారం పది రోజుల్లో దా దాపు 10 విద్యుత్ మోటార్లు, ఆక్వా సాగులో ఉప యోగించే ఇతర పరికరాలు చోరీకి గురయ్యాయి. పోలీసులు ఉన్నతాధికారులు స్పందించి దొంగల ఆగడాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.





దొంగతనానికి వినియోగించిన ఆటో, తరలించేందుకు సిద్ధంగా ఉన్న మోటార్లు

తల్లికి వందనం.. ఆనందం

(5వ పేజీ తరువాయి)

బ్యాంకుల నుంచి ఎస్ఎంఎస్‌ల ద్వారా నగదు జమైనట్లు సందేశాలు రావడంతో చాలామంది సాయంత్రానికే ఏటీఎంలకు క్యూ కట్టారు. 14న రెండో శనివారం, 15న ఆదివారం వరుస సెలవుదినాలు కావడంతో శుక్రవారమే నగదు తీసుకునేందుకు ఆసక్తి చూపారు. పాఠశాలలు, కళాశాలలు తెరవడంతో పిల్లలకు అవసరమైన ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంలు, బ్యాగులు వంటివి కొనుగోలు చేసుకోవడానికి తల్లికి వందనం నగదు ఎంతో ఉపయోగపడుతుందని వారు తెలిపారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి సచివాలయాల వారీగా సోషల్ ఆడిట్ జరుగుతుందని అభ్యంతరాల స్వీకరణకు జూలై 5 వరకు ప్రభుత్వం గడువు ఇచ్చింది. అర్హులైన ప్రతి ఒక్క విద్యార్థికి పథకం లబ్ధి అందేలా చూస్తామని అధికారులు తెలిపారు. తల్లికి వందనం పథకానికి అర్హులైన వారి జాబితాను సచివాలయాల్లో ప్రదర్శించనున్నారు. ఇప్పటికే నగదు జమైన తల్లులు ఇంకా ఏవైనా అభ్యంతరాలుంటే సచివాలయాలలో తెలపాలని ప్రభుత్వం సూచించింది. అర్హత ఉండి పథకం అందని వారు వివరాలను సచివాలయాల్లో ఇస్తే త్వరలోనే డబ్బులు జమ అవుతాయని అధికారులు తెలిపారు. బ్యాంకు ఖాతాల విషయంలో తలెత్తిన సాంకేతిక చిక్కులను తొలగించుకోవడానికి పిల్లల తల్లులు దృష్టిపెట్టాలని అధికారులు కోరుతున్నారు. కొంతమంది తల్లుల ఖాతాల్లో నగదు జమ అయినా వారి బ్యాంకు ఖాతాలు యాక్టివ్‌గా లేకపోవడంతో రిఫండ్ వెళ్లిపోయాయని అధికారులు చెబుతున్నారు.

నాడు ఒకరికి.. నేడు అందరికీ

వైసీపీ హయాంలో ఎంతమంది పిల్లలున్నా ఒక్కరికే రూ.13 వేల నగదు జమ అయ్యేది. అయితే దీని వల్ల మిగిలిన పిల్లల చదువుల కోసం పేదలు ఇబ్బందులు పడుతుండటాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు గుర్తించారు. సూపర్‌సిక్స్ పేరుతో తీసుకువచ్చిన ఎన్నికల మ్యానిఫెస్టోలో తల్లికి వందనం పథకాన్ని చంద్రబాబు చేర్చారు. పైగా కుటుంబంలో ఒకరికి కాదు.. ఎందరు పిల్లలు ఉన్నా వారి చదువులకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు సహా కూటమి నేతలు ప్రకటించారు. తనకున్న బిడ్డలందరి చదువుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నగదు జమ అనడంతో గంపగుత్తగా మహిళలు కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి భారీ మెజార్టీలతో గెలిపించారు. ఎన్నికల ప్రచారంలో చెప్పినట్లుగానే కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ నగదు జమ చేయడంతో పేద కుటుంబాల్లో సంతోషాలు రెట్టింపయ్యాయి.

బంగారు గొలుసు చోరీ కేసులో నిందితుడి అరెస్టు : సొత్తు స్వాధీనం

అవీఇవీ



స్వాధీనం చేసుకున్న బంగారు గొలుసు, చోరీ చేసిన ముద్దాయితో ఎస్ఐ వినోద్‌బాబు

పంగులూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): దేవుడి ప్రసాదంలో మత్తు మందు కలిపి నమ్మకంగా తినిపించి స్పృహ కోల్పోయిన మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసు చోరీ చేసిన అంతర్ జిల్లా దొంగను రేణంగివరం పోలీసులు అదుపులోకి తీసుకుని సొత్తు రికవరీ చేశారు. ఎస్ఐ వినోద్‌బాబు అందించిన సమాచారం మేరకు... గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం బొగ్గిల్లువడ్డేశ్వరం గ్రామానికి చెందిన పబ్బరాజు వెంకటయుగంధర్ గత నెలలో బూదవాడ గ్రామంలో వజ్రాల కృష్ణారెడ్డి వద్దకు వచ్చి పరిచయం చేసుకుని ఇల్లు అద్దెకు కావాలని అడిగాడు. వెంకటయుగంధర్ మాటలు నమ్మిన కృష్ణారెడ్డి తన ఇంటి సమీపంలో ఖాళీగా ఉన్న వజ్రాల హనుమారెడ్డి ఇంటిని అద్దెకు ఇప్పించాడు. గత నెల 18వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో యుగంధర్ ముందుగా మత్తు మందు కలిపిన పదార్థాన్ని అన్నవరం ప్రసాదం పేరుతో కృష్ణారెడ్డి దంపతులకు అందజేశాడు. అదితిన్న దంపతులిద్దరూ స్పృహ కోల్పోయి నిద్రకు ఉపక్రమించారు. అనంతరం కృష్ణారెడ్డి భార్య మెడలో గొలుసును అపహరించాడు. గొలుసు చోరీ జరిగిన విషయాన్ని ఈ నెల 12న రేణంగివరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పలు చోరీల కేసులలో పట్టుబడిన చరిత్ర ఉన్న యుగంధర్ ఫొటోను చూపించగా ఇంటిలో అద్దెకు దిగిన వ్యక్తిని అతనేని కృష్ణారెడ్డి గుర్తించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో వెంకటయుగంధర్ ఉన్న ప్రాంతానికి చేరుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. చోరీ చేసిన గొలుసును స్వాధీనం చేసుకున్నట్లు వినోద్‌బాబు తెలిపారు. నిందితుడిని శుక్రవారం అద్దంకి మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

బాబు, పవన్‌లను దూషించిన వ్యక్తిపై కేసు



ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకులు

ఒంగోలు క్రైం, జూన్13(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మీద అసభ్య పదజాలంతో మాట్లాడిన వ్యక్తిపై ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. అల్లూరికి చెందిన మంచికంటి గరిటారెడ్డి అసభ్యపదజాలంతో మాట్లాడటంతో జనసేన పార్టీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చిట్టెం ప్రసాద్, కార్యదర్శి ముత్యాల కళ్యాణ, కృష్ణ, పెన్నా ప్రాంతీయ కమిటీసభ్యురాలు బొందిల శ్రీదేవి, నగరకార్యదర్శి పల్ల ప్రమీల పాల్గొన్నారు.

సంతమాగులూరు మద్యం షాపు లైసెన్స్ రద్దు

జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు

బాపట్ల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సంతమాగులూరు మండలంలోని జీఎస్.ఎల్ నెంబరు బిపిఎల్ /98 షాపు లైసెన్స్ రద్దు చేసినట్లు జిల్లాప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు తెలిపారు. లైసెన్స్‌దారులు ప్రభుత్వానికి ఫీజు చెల్లించకపోవటంతో రద్దు చేసినట్లు చెప్పారు. దీనికి సంబంధించి నూతన లైసెన్స్ ఇవ్వటానికి దరఖాస్తులు స్వీకరణకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాల మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. దరఖాస్తు చేయదల్చిన వారు జిల్లాలోని అద్దంకి, బాపట్ల, రేపల్లె, వేమూరు, నగరం, చీరాల, పర్చూరు ఎక్సైజ్ స్టేషన్‌లలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 12వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించబడుతాయన్నారు. 21వ తేది ఉదయం 8గంటలకు కలెక్టరేట్ ఆవరణంలో డ్రా తీస్తామన్నారు.

'పొదిలి'లో మద్యం షాపునకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు క్రైం, జూన్13(ఆంధ్రజ్యోతి): పొదిలి రూరల్ మండలంలో ఒక మద్యం షాపు ఏర్పాటుకు ఔత్సాహికులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఎక్సైజ్ అధికారి షేక్ ఆయేషాబేగం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు తుది గడువు ఈనెల19 సాయంత్రం 5 గంటల వరకు అని, దరఖాస్తుదారులు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. పొదిలి జీఎస్ నంబరు 71 షాపునకు దరఖాస్తులు కోరుతున్నామని తెలిపారు. ఈనెల 21న ఉదయం 8 గంటలకు కలెక్టర్ సమక్షంలో డ్రా తీస్తామని, దరఖాస్తుదారులు అందరు డ్రాలో పాల్గొనాలని ఆమె కోరారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

చినగంజాం, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : చినగంజాంలోని సోపిరాల రైల్వేగేటు సమీపంలో ఎగువ రైల్వేలైన్‌లో రైలు నుంచి జారిపడి యువకుడు మృతిచెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. చీరాల జీఆర్‌పీ ఎస్ఐ కొండయ్య తెలిపిన వివరాలు ప్రకారం, సోపిరాల రైల్వేగేటు సమీపంలోని ఎగువ రైల్వేలైన్‌లో రైలుబండి నుంచి ప్రమాదవశాత్తు జారిపడడంతో గుర్తు తెలియని యువకుడికి బలమైన గాయాలై మృతి చెందినట్లు తెలిపారు. మృతుని కుడి చేతి షోల్డర్ మీద విజయలక్ష్మి అనే పచ్చబొట్టు ఉన్నట్లు తెలిపారు. వయస్సు 30 సంవత్సరాలు ఉంటాయన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వాళ్లు 9440627646 నంబరును సంప్రదించాలన్నారు.

గ్రామాలలో సమస్యలపై దృష్టి సారించండి

ఇంకొల్లు, జూన్ 13,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాలలో తాగునీటి సరఫరాపై పంచాయితీ కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీడీవో జి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొణికి పంచాయతీలో రికార్డులను ఆయన శుక్రవారం పరిశీలించారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలపై దృష్టిసారించి అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రధానంగా తాగునీటి చెరువు పరిశీలన, నీటి సరఫరా పలు అంశాలపై వివరాలు కార్యదర్శి అడ్డగడ్డ వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు.

16 నుంచి సెమిస్టర్ పరీక్షలు

సంతనూతలపాడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మైనంపాడు డైట్ కళాశాలలో ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు 4వ సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ డీఎడ్ కళాశాల్లో 2023-25 బ్యాచ్‌కు చెందిన డీఎడ్ 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, 2022-24లో ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ డీఎడ్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఈ విషయం గమనించాలని ఆయన కోరారు.

అవీ..ఇవీ..

వేటపాలెం ఎస్సైగా జనార్దన్ బాధ్యతలు

● వెంకటేశ్వర్లు టూటౌన్‌కు బదిలీ



బాధ్యతలు స్వీకరించిన ఎస్సై జనార్ధన్

వేటపాలెం(చీరాల), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం నూతన ఎస్సైగా పెనుమాల జనార్దన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆయన వీఆర్‌లో ఉన్నారు. జనార్దన్ గతంలో వెదుళ్లపల్లిలో రెండేళ్ల, ఈపూరుపాలెంలో కూడా దాదాపుగా రెండేళ్ల బాధ్యతలు నిర్వర్తించారు. ఈక్రమంలో స్టేషన్ సిబ్బంది ఎస్సైకు ఘనస్వాగతం పలికారు. అయితే ఇప్పటి వరకు విధుల్లో ఉన్న మీసాల వెంకటేశ్వర్లు టూటౌన్‌కు బదిలీపై వెళ్లారు.

ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరణ


అర్జీలు స్వీకరిస్తున్న కూటమి నేతలు

చీరాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాసన సభ్యులు ఎంఎం కొండయ్య ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాదర్బార్‌కు వినతులు వెల్లువెత్తుతున్నాయి. ఈక్రమంలో శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆయన ఆదేశాల మేరకు కూటమి నేతలు నిర్వహించిన ప్రజాదర్బార్‌లో 153 అర్జీలు అందాయి. అందులో 35 పెన్షన్, 105 నివేశన స్థలాలు, 13 ఇతర సమస్యలకు సంబంధించిన అర్జీలు అందాయి. అర్జీలు శాసనసభ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించనున్నట్లు నేతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కతవరపు జనార్ధనరావు, గంజి పురుషోత్తం, పద్మిని, ప్రసన్న తదితర కూటమి నేతలు పాల్గొన్నారు.

ఏవోగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ


శుభాకాంక్షలు తెలియజేస్తున్న సిబ్బంది

బల్లికురవ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండల వ్యవసాయాధికారిగా పి. శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఏవో కుమారి యద్దనపూడి మండలానికి బదిలీ కాగా కొరిశపాడులో పనిచేస్తున్న శ్రీనివాసరావును బల్లికురవ మండలానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా నూతన ఏవోను మండలంలోని పలు గ్రామాల రైతుసేవా కేంద్రాల సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి వ్యవసాయ సమస్యలపై సలహాలు అందజేస్తామన్నారు.

ఉపఖజానా అధికారిగా సుబ్బారావు

మార్టూరు,జూన్13(ఆంధ్రజ్యోతి): మార్టూరు ఉపఖజానా అధికారిగా ఎంవీ.సుబ్బారావు శుక్రవారం ఎస్‌టీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన బాపట్ల నుంచి బదిలీపై మార్టూరు వచ్చారు. ఆయనను మర్యాదపూర్వకంగా విశ్రాంత ఉద్యోగులు రావుల బాపయ్య, ఎం పిచ్చయ్య శర్మ, పి శ్రీరామచంద్రమూర్తి, పి.శివరామకోటేశ్వరరావు, చిట్టిబాబు తదితరులు కలిశారు.

కమిషనరేట్‌కు తహసీల్దార్ పార్వతి సరెండర్

వేటపాలెం (చీరాల), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల తహసీల్దార్ పాలపర్తి పార్వతిని కలెక్టర్ వెంకట మురళీ కమిషనరేట్‌కు సరెండర్ చేశారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులు శుక్రవారం జారీ చేశారు. కొంతకాలంగా వేటపాలెంలో విధులు నిర్వహిస్తున్న పార్వతిపై అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టారు. పార్వతి సుదీర్ఘ కాలంగా చీరాల పరిధిలో పనిచేశారు. ప్రస్తుతం ఈ విషయం హాట్‌టాపిక్‌గా మారింది. చీరాల తహసీల్దార్ గోపీకృష్ణను ప్రస్తుతం ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

నూతన వ్యవసాయాధికారిగా మీరమ్మ

ఇంకొల్లు, జూన్ 13,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మండల నూతన వ్యవసాయాధికారిగా ఎన్.మీరమ్మ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో యద్దనపూడి మండల ఏవోగా పనిచేస్తూ బదిలీపై ఇంకొల్లు వచ్చారు. గతంలో ఇక్కడ ఏవోగా విధులు నిర్వర్తించిన వేణుగోపాల్ ఒంగోలు ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు.

నూతన సీడీపీవోగా సులోచనారాణి

ఇంకొల్లు, జూన్ 13,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు నూతన సీడీపీవోగా సులోచనరాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఝాన్సీ బదిలీపై వేటపాలెం వెళ్లారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన సులోచనరాణి అంగన్‌వాడీ కేంద్రాలపై నిత్యపర్యవేక్షణతో లోపాలను సరిచేసేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు.

అపరాధ రుసుము విధింపు

అద్దంకి, జూన్13(ఆంధ్రజ్యోతి): మద్యంసేవించి వాహనాలు నడుపుతున్న 9 మందిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ2 వేల చొప్పున రూ.18 వేలను న్యాయాధికారి అఖిల అపరాధ రుసుము విధించినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

దామావారిపాలెం ఫ్లెక్సీ ఏర్పాటు

అద్దంకి, జూన్13(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో దామావారిపాలెం వద్ద నామ్ రోడ్డు వెంబడి ఎన్‌టీఆర్‌నగర్ గా బోర్డు ఏర్పాటు చేయడంతో దామావారిపాలెం వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆ బోర్డు కనిపించకుండా పైన దామావారిపాలెం గా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

జాబ్‌మేళాలో 64 మంది ఉద్యోగాలకు ఎంపిక

మార్టూరు, జూన్13(ఆంధ్రజ్యోతి): మార్టూరులోని వీఎస్‌ఆర్‌అండ్ ఏఎం డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధిసంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో వివిధ కంపెనీలలో ఉద్యోగాల కోసం 64 మంది ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ రావి అంకమ్మ చౌదరి తెలిపారు. ఈ జాబ్‌మేళాకు 159 మంది హాజరుకాగా వారిలో 64 మంది ఎంపికయ్యారు. అదేవిధంగా జాబ్ మేళాకు ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టెక్ మహీంద్ర, మాస్టర్ మైండ్స్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాస్, యంగ్ ప్రొఫెషనల్ స్టాఫ్ సౌగంధి, సమన్వయకర్త శ్రీకాంత్, రమేష్, వినోద్, గోపి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి అనుమానస్పద మృతి

అద్దంకి, జూన్13(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణానికి సమీపంలో రేణింగవరం రోడ్డులో నల్లవాగు వద్ద వేపచెట్టుకు గుర్తు తెలియని వృద్ధుడు (60) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుమారు 10 రోజుల క్రితం మృతి చెందినట్లు భావిస్తున్నారు. పూర్తి బట్టతల ఉందని, ఖద్దర్ చొక్కా, లుంగి కట్టుకొని ఉన్నాడు. వీఆర్‌వో సురేంద్రబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే అద్దంకి పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చినగంజాం, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చినగంజాం, కొత్తపాలెం, పెదగంజాం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో వార్షిక మరమ్మత్తుల కారణంగా శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈఈ పి.గణనారామణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బడిలోనే బంగారు భవిష్యత్తు

● స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న అధికారులు



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న అధికారులు

చీరాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఆట పాటలతో, చక్కని చదువుతో అందరి మధ్య సంతోషంగా నడవాల్సిన కొందరు చిన్నారుల భవిష్యత్తు నేడు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ కార్మికులుగా మారి ఊగిసలాటలో ఉంది. కొంతమందికి ఆర్థిక లేమితో మరి కొందరికి సాకే సంతన లేకపోవడంతో బడిలో ఉండాల్సిన వారు బడిబయటే ఆగిపోతున్నారు. దీంతో ఎంతో చక్కగా సాగాల్సిన భవితవ్యం వివిధ సమస్యల కారణంగా ప్రశ్నార్థకంగా మారుతోంది.

బడి ఈడు పిల్లలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

రేపటి భావిభారత పౌరులుగా నిలవాల్సిన వారు బాల్యంలోనే కార్మికులుగా మారుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇటీవల ఉన్నత న్యాయస్థానాలు బాలలకోసం కొత్త చట్టాలు రూపొందించింది. సెక్షన్-3 ప్రకారం 14 సంవత్సరాలలోపు చిన్నారులను కచ్చితంగా పనిలో చేర్చుకోరాదు. అలాగే 18 సంవత్సరమల లోపు వయసు వారిని ప్రమాదకరమైన పనుల్లో అసలు చేర్చరాదు. కొంతవరకు ప్రమాదం లేని పనుల్లో 16 నుండి 18 సంవత్సరాల లోపు వారిని కార్మికులుగా నియమించుకొనే వెసులు బటు ఉంది. అందుకు భిన్నంగా వ్యవహరించిన దుకాణ దారులకు రూ.10 వేలు నుండి రూ.50 వేలు వరకు చలానా విధించే విధంగా చట్టం ఉంది. ఈ విధంగా పొందిన చలానాను జిల్లా అధికారుల ప్రత్యేక బాలకార్మిక ఖాతాకు మళ్లించి సంబంధిత బాలలకు 18 సంవత్సరాలు నిండిన అనంతరం వడ్డీతో సహా పొందే అవకాశం రూపొంచింది. ఈక్రమంలో కొంత మేరకు కార్మికుల సంఖ్య తగ్గుముఖం పట్టిందనే చెప్పాలి. అయితే అందుకు సంబధించిన అధికారుల సేవలు పారదర్శకంగా నిర్వహిస్తే ప్రతి ఒక్కరికి బంగారు బాటలే.

బాలలను బడి పిల్లలుగానే మార్చాలి

నేటి బాల కార్మికులను బడిలో చేర్చి చక్కని చదువును అందిస్తే దేశానికి వెన్నెముకలా నిలుస్తారు. ఈక్రమంలోనే తల్లిదండ్రులుతో పాటు దుకాణ దారులు కూడా చిన్నారుల భవితవ్యంపై బాధ్యతగా మెలగాలి. ఉన్నతధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే బాలకార్మికుల నియంత్రణకు జూన్ 1 నుండి 30వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. కొందరిని గుర్తించి కౌన్సిలింగ్ నిర్వహించాము.

- వి సాయిజ్యోతి, అసిస్టెంట్ లేబర్ అధికారి చీరాల

సాగర్ కాలువలో జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభం

రూ.1.56 కోట్లు నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే ఏలూరి


పనులు ప్రారంభిస్తున్న చక్రపాణి, డీఈ స్వామి

మార్టూరు, జూన్13 (ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కోనంకి సబ్‌డివిజన్ పరిధిలో పర్చూరు నియోజకవర్గపరిధిలో 48 పనులు నిమిత్తం రూ.1.56 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో సాగర్ కాలువలో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడతారు. పర్చూరు నియోజకవర్గ పరిధిలో సాగర్ కాలువలలో జంగిల్ క్లియరెన్స్‌తోపాటు మెయిన్‌టెయిన్స్ పనులు నిమిత్తం నిధులు మంజూరుకు ఎమ్మెల్యే ఏలూరి జలవనరుల శాఖకు ప్రత్యేకంగా ప్రతిపాదనలను పంపించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిధులను మంజూరు చేసింది. గత ప్రభుత్వంలో సాగర్ కాలువలలో చిన్న చిన్న పనులు నిమిత్తం ఒక్క పైసా కూడా నిధులను మంజూరు చేయలేదు. దీంతో సాగర్ కాలువలలో పిచ్చిచెట్లు, తుమ్మచెట్లు విపరీతంగా పెరిగాయి. తద్వారా సాగర్ జలాలు వచ్చినపుడు దిగువకు నీరు సక్రమంగా ప్రవహించకపోవడంతో దిగువ పొలాలును కలిగిన రైతులు నీరు అందక చాలా ఇబ్బందులకు గురయ్యేవారు. చాలా చోట్ల కాలువలు చిట్టడవిగా మారాయి. దీంతో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పర్చూరు నియోజకవర్గంలో రైతులకు ప్రాణప్రదమైన సాగర్ కాలువలో జంగిల్ క్లియరెన్స్ పనులు, కొన్నిచోట్ల పూడికతీత పనులు చేపట్టాలని ఎమ్మెల్యే ఏలూరి భావించారు. అందుకోసం నిధులు మంజూరుకు ఏలూరి చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఎట్టకేలకు నిధులను మంజూరుచేయడంతో నియోజకవర్గ పరిధిలో మొదటగా శుక్రవారం యద్దనపూడి బ్రాంచ్ కెనాల్‌లో రామకూరు 37వ మైలు వద్ద నుంచి దిగువకు 1.8 కిమీ వరకు సాగర్ కాలువలో రెండు వైపులా 1.84 కోట్ల నిధులతో జంగిల్ క్లియరెన్స్ పనులను ప్రారంభించారు. ఈ పనులను సాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కమిటి వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి ప్రారంభించారు. ఇంకా మిగిలిన నిధులతో నియోజకవర్గ పరిధిలో సాగర్ కాలువలలోని పనులను త్వరలోనే ప్రారంభిస్తారని ఎన్ఎస్‌పీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాటి నాగేశ్వరరావు, కొర్రపాటి కాజారావు, నీటి సంఘం అధ్యక్షులు తేలప్రోలు సుబ్బారావు, తాటి నాగార్జున, ముద్దన హనుమంతరావు, కరణం మారుతి తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో హెచ్‌కేఎం ట్రస్ట్‌కు సాయం


దాతలను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటిన్లకు ఆహారం అందజేస్తున్న ట్రస్ట్‌కు రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆర్థిక సాయాన్ని అందజేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాంటిన్లకు ఆహార పదార్థాలు సరఫరా చేస్తున్న మంగళగిరిలోని హరే కృష్ణ మూమెంట్(హెచ్‌కెఎం) చారిటబుల్ ట్రస్ట్‌కు వంటశాలకు అత్యాధునిక వంట మిషన్ల ఏర్పాటుకు రోటరీ 3150 డిస్టిక్ తరఫున రూ.2 కోట్ల నిధి సేకరించాలని జిల్లాటని అన్ని క్లబ్‌లకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో అద్దంకిలోని రోటరీ క్లబ్ తరఫున రూ.55 వేలను జిల్లా క్లబ్‌కు అందజేశారు. దీనికి సంబంధించి రోటరీ మిత్రులను శుక్రవారం రోటరీ కార్యాలయంలో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళి సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, నరసింహరావు, లేవి ప్రసాద్, రామకోటేశ్వరరావు, హరిప్రసాద్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం


స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చినగంజాం, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలో వేంచేసిన మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారి బి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామివార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం వేదపండితుల వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా దంపతులతో కల్యాణ క్రతువు నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని భక్తులు కనులురా తిలకించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మహిళా భక్తులు భజనా కార్యక్రమాన్ని నిర్వహించారు. కడవకుదురు గ్రామంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. సూమారు మూడు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటి సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పొగాకు రైతులను ఆదుకునేందుకే కొనుగోలు

మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పర్చూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నల్ల బర్లీ రైతులను ఆదుకునేందుకే ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు శ్రీకారం చుట్టిందని మార్క్‌ఫెడ్ బాపట్ల జిల్లా డీఎం కరుణశ్రీ అన్నారు. కొనుగోలుకు సంబంధించిన విధి విధానాలు, పాటించాల్సిన నియమాలు తదితర అంశాలపై శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో వ్యవసాయాధికారులు, పీఏసీఎస్ సిబ్బంది, రైతుసేవా కేంద్రాల సిబ్బంది, రైతులు, ఐటీసీ ప్రతినిధి కల్యాణ రామిరెడ్డి సారధ్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొగాకు గ్రేడులు తదితర అంశాలపై చర్చించారు. ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనల ప్రకారం రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేస్తామన్నారు. ఐటీసీ ప్రతినిధి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా బర్లీ పొగాకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ముందుకు రావడం హర్షించతగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఎస్.మోహనరావు, ఏవో రామమోహన్‌రెడ్డి, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి బర్లీ పొగాకు కొనుగోలులో సమస్యలు

వివరించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


రైతులతో కలిసి మంత్రి అచ్చెన్నాయుడుకు సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే సాంబశివరావు

పర్చూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నల్ల బర్లీ పొగాకు కొనుగోలకు సంబంధించిన పలు విషయాలపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్థానిక రైతులతో కలసి వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడితో శుక్రవారం భేటీ అయ్యారు. పొగాకు రైతులకు సంబంధించిన పలు సమస్యలను మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకుపోయారు. రైతుల వద్ద ఉన్న బర్లీ పొగాకు మొత్తాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలని ఈ సందర్భంగా ఏలూరి కోరారు. కార్యక్రమంలో పర్చూరు నియోజక వర్గంలోని ఆయా మండలాల నాయకులు నాయుడు హనుమంతురావు, పొద వీరయ్య చౌదరి, కొల్లా శ్రీనివాసరావు(ఫ్యాక్టరీ), పోట్రు శోభన్, అడ్డగడ వెంకటేశ్వర్లు, కారుమంచి కృష్ణ, పోపూరి శ్రీనివాసరావు, హుస్సేన్, దాసి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ స్తూప నిర్మాణానికి సిమెంట్ వితరణ

అద్దంకిటౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): శ్రీరామ్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శింగరకొండలో నిర్మిస్తున్న శ్రీరామ నామస్తూప నిర్మాణానికి రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో సిమెంట్ అందజేశారు. పువ్వాడ రామకోటేశ్వరరావు సౌజన్యంతో స్తూపానికి రూ.50 బస్తాల సిమెంట్‌కు అవసరమైన చెక్కును అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. కార్యక్రమలో రోటరీ క్లబ్ సభ్యులు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, అంజద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

చీరాల అగ్నిమాపక కేంద్రానికి మహర్దశ

● రూ. 2 కోట్లు నిధులతో నూతన భవనం ఏర్పాటుకు శ్రీకారం
● ప్రస్తుత సాల్మన్ సెంటర్‌లోని బేర్ కాంపౌండ్ నుండి సేవలు
● వివరాలు వెల్లడించిన జిల్లా సహాయక అధికారి రామకృష్ణ


చీరాల అగ్నిమాపక కేంద్రం

చీరాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : చీరాల అగ్నిమాపక కేంద్రానికి మహర్దశ వచ్చింది. ప్రస్తుతం శిథిలావస్థకు చేరి, తక్కువ స్థలంలో సేవలు అందిస్తున్న కేంద్రం ప్రదేశంలోనే నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. అందుకు సంబంధించి జిల్లా అగ్నిమాపక సహాయక అధికారి వీవీ.రామకృష్ణ వివరాలు వెల్లడించారు. నూతన భవనం ఏర్పాటుకు రూ.2కోట్లు నిధులు మంజూరైనట్లు చెప్పారు. అందుకు సంబంధించి త్వరలోనే భూమి పూజ చేయనున్నట్లు వివరించారు. భవన ఏర్పడే వరకు సాల్మన్ సెంటర్‌లోని బేర్ కాంపౌండ్ తాత్కాలిక భవనం నుండి సేవలు అందించనున్నట్లు రామకృష్ణ తెలిపారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, టీడీపీ నేతలు

అద్దంకి, జూన్13(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల తల్లుల ఖాతాలో కూటమి ప్రభుత్వం డబ్బులు జమచేయడంతో ఆనందంతో శుక్రవారం సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి రవికుమార్ చిత్రపటాలకు మండలంలోని మణికేశ్వరంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా కూటమి నేతలు పాలాభిషేకం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఫోటోలు ఉన్న ఫ్లెక్సీలకు పాలాభిషేకము చేశారు. అద్దంకి పట్టణంలోని 1వ వార్డులో కూడా విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమాలలో అద్దంకి నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, మోషే, మాధ్యూస్, రవి, బడావలి, ఆదినారాయణ, ప్రసాద్, తిమోతి, అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

మాట నిలుపుకున్న కూటమి ప్రభుత్వం

● ఒకే ఇంట్లో ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం నగదు జమ


నగదు అందుకున్న కుటుంబం

పర్చూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనంతో నిరుపేద కుటుంబాల్లో ఆనందం వెల్లువిరిసింది. ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన తల్లికి వందనం ద్వారా తల్లిదండ్రుల ఖాతాల్లోకి నగరు జమకావటంతో వారి ఆనందానికి అద్దేలేకుండా పోయింది. పర్చూరుకు చెందిన పఠాన్ అబ్దుల్ సీలీం, సబీహ కుటుంబలో ఉన్న ఇద్దరు పిల్లలు సాహిల్, తస్నియాలకు తల్లికి వందనం వారి ఖాతాల్లో జమఅయ్యింది.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం : పఠాన్ సబీహ

ఇచ్చిన మాటను నిలుపుకొని కూటమి ప్రభుత్వం తల్లివందనం ద్వారా నగదును జమచేసిన కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. ప్రభుత్వం విద్యకోసం మాలాంటి నిరుపేదలకు సాయం అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ఎంతో సంతోషంగా ఉంది. మా ఇంట్లో ఉన్న ఇద్దరు పిల్లలకు ఒక్కొరికి రూ.13000వేల చొప్పున మొత్తం రూ.26000వేల నగదు జమకావటం గర్వంగా ఉంది. ప్రభుత్వ సహాయాన్ని ఎన్నటికీ మరువలేం.

ప్రభుత్వ పాఠశాలలో అరకొర వసతులు


వసతుల లేమితో ఉన్న పాఠశాల


ఉప్పుటూరులో నిర్మాణంలో ఉన్న తరగతి గదులు


పర్చూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : విద్యా సంవత్సరం ప్రారంభానికి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. భవనాల అసంపూర్తి నిర్మాణాలు, గదులు, మౌలిక వసతుల కొరత విద్యార్థుల తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేస్తోంది. రెక్కల కష్టంతో జీవించే నిరుపేదలు సైతం తమ పిల్లలను కార్పొరేట్ పాఠశాలలకు పంపేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు విధాలుగా కృషి చేస్తోంది. అయితే గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పలుచోట్ల పాఠశాల భవనాల నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన నిలిచాయి.

చినుకుపడితే తరగతి గదిలోనికి నీరు

పర్చూరు మండలంలోని ఉప్పుటూరు గ్రామంలో మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల(ఎంపీపీయస్), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. ఈ రెండు పాఠశాలలకు సంబంధించి దాదాపు 200లకు పైగా విద్యార్థులు ఉన్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కింద గ్రామంలోని మరో ప్రాంగణంలో ఎంపీపీ ఎస్ పాఠశాలను నిర్మాణం చేసుకునే విధంగా చర్యలు చేపట్టినా రూపులెవల్‌కే పరిమితం అయ్యింది. ప్రస్తుతం పాఠశాల ప్రాంగణం ముళ్ళ చెట్లతో అసంపూర్తిగా దర్శనమిస్తుంది.

జిల్లా పరిషత్ పాఠశాల పరిస్థితి ఇదే

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంబంధించి అదనపు తరగతులకు చర్యలు చేపట్టిన నాటి వైసీపీ ప్రభుత్వం చర్యలతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో అరాకొరా వసతుల నడుమ విద్యార్థులు బోధన కొన సాగాల్సిన దుస్థితి ఏర్పడింది. మండలంలో అనేక పాఠశాలలో ఇదే పరిస్థితి ఉంది.



ప్యాకేజీ-1పై విజి'లెన్స్'

- విచారణకు ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం
- రికార్డులన్నీ ఇవ్వాలంటూ విజిలెన్స్ అధికారుల లేఖ
- కదిలించిన 'ఆంధ్రజ్యోతి' కథనాలు
- అవినీతి అధికారుల్లో మొదలైన వణుకు



పెన్నా డెల్టా ప్యాకేజీ-1 ఆధునికీకరణ పనులపై వస్తున్న ఆరోపణలపై ఇరిగేషన్ అధికారులు స్పందించకపోయినా ప్రభుత్వం మాత్రం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. పూర్తి విచారణ జరిపి నివేదిక అందజేయాలని విజిలెన్స్ విభాగాన్ని ప్రభుత్వం ఆదేశించడంతో సంబంధిత అధికారులు రంగంలోకి దిగారు. ప్యాకేజీ-1 పూర్తి వివరాలు అందజేయాలని విజిలెన్స్ ఎస్పీ కే శ్రీనివాసరావు ఈ నెల 10వ తేదీన ఇరిగేషన్ ఎస్ఈ దేశానాయక్‌కు లేఖ రాశారు. 17వ తేదీలోపు రికార్డులన్నీ అందజేయాలని ఆ లేఖలో సూచించారు. ఆ తర్వాతే విజిలెన్స్ అధికారులు విచారణ మొదలుకానుంది. ఈ వ్యవహారం ఇరిగేషన్ శాఖలో కలకలం రేపుతుండగా, సంబంధిత అధికారుల్లో మాత్రం వణుకు మొదలైంది. అటు క్వాలిటీ కంట్రోల్ డివిజన్ కార్యాలయంలో ప్రీక్లోజర్‌కు సంబంధించిన రికార్డులు కనిపించడం లేదు. ఇటు సెంట్రల్ డివిజన్‌లో కూడా కొన్ని డాక్యుమెంట్లు మాయమైనట్లు ఆరోపణలున్నాయి. మరి విజిలెన్స్ అధికారులకు అన్నీ రికార్డులు అందుతాయో.. లేదో.. చూడాలి.

- వివరాలు 8లో..

ఎఫ్‌బీవోపై సస్పెన్షన్ వేటు

ఉదయగిరి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని శకునాలపల్లి ఫారెస్టు బీట్ అధికారి (ఎఫ్‌బీవో) భానుతేజను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయినట్లు రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజా ఒక ప్రకటనలో తెలిపారు. శకునాలపల్లి వీఎస్ఎస్‌లో ఉన్న జామాయిల్ కర్రను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారంటూ ఎఫ్‌బీవోపై ఇటీవల వీఎస్ఎస్ వైస్ ఛైర్మన్, సభ్యులు రేంజ్ అధికారికి ఫిర్యాదు చేశారు. విచారించి నివేదికను జిల్లా అటవీ శాఖాధికారికి పంపడంతో ఆయన భానుతేజను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

మరో కరోనా కేసు నమోదు

- 12కు చేరిన కేసుల సంఖ్య
- జిల్లాకు చేరుకున్న 400 ర్యాపిడ్ కిట్లు

నెల్లూరు (వైద్యం) (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మరో కరోనా కేసు నమోదయ్యింది. నెల్లూరుకు చెందిన 30 ఏళ్ల యువకుడు కొవిడ్ బారిన పడినట్లు శుక్రవారం పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. దీంతో జిల్లాలో కరోనా కేసుల సంఖ్య 12కు చేరింది. మరోవైపు కరోనాను నిర్ధారించే ర్యాపిడ్ కిట్లు 400 వరకు శుక్రవారం జిల్లాకు చేరుకోగా, వీటిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించనున్నారు. వీటి ద్వారా అనుమానిత ప్రాంతాలలో నిర్ధారణ పరీక్షలు చేస్తారు. పాజిటివ్ వస్తే ఆర్టీపీసీఆర్ కచ్చితత్వ పరీక్ష ద్వారా వ్యాధి ని గుర్తించి చికిత్స అందచేస్తారు. ఈ ఆర్టీపీసీఆర్ కిట్లు కూడా 250 వరకు జిల్లాకు రాగా వీటిని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలకు అందించారు.

కాకాణి బెయిల్ తదుపరి విచారణ 16న

నెల్లూరు (లీగల్), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి విచారణ 16వ తేదీకి వాయిదా పడింది. ఎస్సీ, ఎస్టీ, అక్రమ మైనింగ్, పేలుడు పదార్థాల నిషేధ చట్టం కేసులో కాకాణి రిమాండ్‌లో ఉన్నారు. బెయిల్ పిటిషన్ విచారణను 16వ తేదీకి వాయిదా వేస్తూ ఎస్సీ, ఎస్టీ కోర్టు స్పెషల్ జడ్జి సరస్వతి శుక్రవారం ఉత్తర్వు చేశారు

సచివాలయాల ఉద్యోగులకు బదిలీలు

నెల్లూరు (జడ్పీ), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే ఇతర శాఖల బదిలీలు పూర్తవగా, సచివాలయాల ఉద్యోగుల బదిలీలు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే, ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో 30వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకునే వెసులుబాటు కల్పించారు. జిల్లావ్యాప్తంగా 900 మంది ఉద్యోగులు ఉండగా ఐదేళ్ల ఒకే ప్రాంతంలో విధులు నిర్వహించిన వారందరినీ తప్పనిసరిగా బదిలీ చేయాల్సి ఉంటుంది. అలాగే రిక్వెస్ట్ బదిలీలకూ అవకాశం కల్పించడంతో అలాంటి వారూ దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే సొంత మండలాలు మినహా మిగత ప్రాంతాలకు బదిలీ చేసుకునే అవకాశం ఉద్యోగులకు ఉంటుంది.

ఇక పంచాయతీలకు గ్రేడ్‌లు!

- స్పెషల్ గ్రేడ్‌లో 15, గ్రేడ్-1లో 73
- ప్రభుత్వానికి జాబితా పంపిన అధికారులు


నెల్లూరు (జడ్పీ), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పాలన మరింత సులువు చేసేందుకు, సుపరిపాలన అందించేందుకు పంచాయతీ వ్యవస్థలో మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. క్లస్టరు వ్యవస్థలో పాలనకు ఆటంకాలు ఏర్పడుతుండటం, ఒకే క్లస్టరు కింద ఆరేడు పంచాయతీలు ఉండటంతో పాలనకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర కసరత్తు చేసి పంచాయతీలకు గ్రేడ్‌లుగా విభజించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉన్నతాధికారులు పంచాయతీలను గ్రేడ్-1, 2, 3లుగా విభజించి, క్లస్టరు

(మిగతా 7వ పేజీలో)



చదువు ఖర్చులకు భయం లేదు!

నాపేరు అచ్చి చెంచురాధ. కలువాయి మండలం తెలుగురాయపురం ఎస్సీ కాలనీ. నాకు ముగ్గురు ఆడపిల్లలు. అచ్చి శాలిని 6వ తరగతి, లక్ష్మి 4వ తరగతి, ప్రణతి 2వ తరగతి చదువుతున్నారు. నా ముగ్గురు పిల్లలకు రూ.13వేలు వంతున రూ.39వేలు నా అకౌంట్లో పడ్డాయి. చాలా సంతోషంగా ఉంది. పిల్లల చదువుకు అవసరమైన ఖర్చులకు ఇబ్బంది లేదు. ప్రతి రోజూ వారిని బడి పంపిస్తాను.



తల్లికి వందనం..

బిడ్డలకు వరం!

అందరిదీ రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబం. పస్తుల్లేకపోయినా ఉన్నంతలో బిడ్డలతో సంతోషంగా ఉంటున్నారు. కలిగిన బిడ్డలను తమ స్తోమతకు తగ్గట్టు స్కూళ్లలో చదివిస్తున్నారు. ఇప్పుడు విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో ఏదో ఒక ఖర్చు వెంటాడుతోంది. ఈ పరిస్థితుల్లో 'తల్లికి వందనం' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయడంతో పేదింట ఆనందం వెల్లివిరిసింది. వైసీపీ హయాంలో ఒకరికి మాత్రమే నగదు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ రూ.13వేలు చొప్పున అందజేసింది.

ఏఎస్ పేటకు చెందిన నిరుపేద దంపతులు పఠాన్ సలీమ్, సాజిదాలకు నలుగురు పిల్లలు. పెద్ద కుమార్తె సుమేరా 8వ తరగతి, కుమారులు అజ్గర్ 6వ తరగతి, కవలలు నీహల్, సోహెల్ 1వ తరగతి చదువుతున్నారు. వీరందరికి రూ.52వేలు తల్లి పఠాన్ సాజిదా బ్యాంకు ఖాతాలో జమ అయ్యింది. ఆ మేరకు మొబైల్‌కు మెసేజ్ రావడంతో వారు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. తమ పిల్లల భవిష్యత్తు కోసం తల్లికి వందనం పేరుతో డబ్బు అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.



తన నలుగురు పిల్లలతో తండ్రి పఠాన్ సలీమ్

కష్టజీవికి పెద్ద ఊరట



రాపూరు మండలం బండేపల్లి హరిజనవాడకు చెందిన మారెమ్మ భర్త పుల్లయ్య నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఉపాధి హామీ పథకం పనులు చేస్తూ తన ముగ్గురు బిడ్డల్ని చదివిస్తోంది. పెద్ద కుమార్తె కీర్తి 7వ తరగతి, చిన్న కుమార్తె నాగలక్ష్మి 5వ తరగతి, కొడుకు శివశంకర్ 2వ తరగతి చదువుతున్నారు. రెక్కల కష్టంమీదే ఆధారపడ్డ మారెమ్మకు 'తల్లికి వందనం' పెద్ద ఊరటనిచ్చింది. ముగ్గురు బిడ్డలకు రూ.39వేలు తన ఖాతాల్లో జమ కావడంతో మరెమ్మ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. వైసీపీ హయాంలో ఒక బిడ్డకు మాత్రమే నగదు ఇచ్చారని, ఇప్పుడు చంద్రబాబు పుణ్యమా అని ముగ్గురికి డబ్బు అందడంతో పిల్లల చదువుకు ఇబ్బందులు ఉండవంటూ మారెమ్మ ఆనందంతో చెప్పుకొచ్చింది.

ఎంతో ఆనందంగా ఉంది



ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తల్లికి వందనం నిధులు విడుదల చేయడంపై ఆనందంగా ఉంది. నా ముగ్గురు పిల్లల కోసం రూ.39వేలు వచ్చాయి. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి కింద ఒక్కరికే నగదు ఇచ్చారు. ఇంట్లో ఉన్న పిల్లలందరికీ చంద్రబాబు డబ్బు ఇవ్వడం వారికి భవిష్యత్ కల్పించినట్లే.

- అనూష, భీమవరప్పాడు, కొండాపురం మండలం

పేదింట విరబూసిన ఆనందం • ఒక్కో విద్యార్థికి రూ.13వేలు చొప్పున 2,48,176 మంది మందికి నగదు • 1,62,975 మంది తల్లుల ఖాతాల్లో జమ



మనుబోలు మండలం యాచవరం గ్రామానికి చెందిన చల్లా కల్యాణ్, గౌరి దంపతులకు ముగ్గురు పిల్లలు. వేణు, పూర్విక వీరిద్దరు 5వ తరగతి, గీతిక 3వ తరగతి చదువుతున్నారు. తల్లికి వందనం పథకం ద్వారా గౌరి బ్యాంకు ఖాతాలో రూ.39వేలు జమ అయ్యాయి. అలాగే మండల కేంద్రమైన మనుబోలులో అందెల శివకుమార్‌రెడ్డి, కల్పన దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. ఒకరు పది, ఇద్దరు 2వ తరగతి చదువుతున్నారు. ఈ ముగ్గురికి కూడా 39 వేలు తల్లి కల్పన బ్యాంక్ ఖాతాలో జమ అయ్యాయి. ఇంత డబ్బు ఒకేసారి బ్యాంకులో జమ కావడంతో ఈ రెండు కుటుంబాల్లో ఆనందానికి అవధులు లేవు.

నెల్లూరు (విద్య), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పేదరికం కారణంగా ఏ పిల్లవాడూ విద్యకు దూరం కాకూడదన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద శుక్రవారం విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ కావడంతో లబ్ధిదారుల్లో ఆనందం పెల్లుబికింది. రాష్ట్రంలో ఈ పథకం కింద అర్హులైన ప్రతి ఒక్క విద్యార్థికి (ప్రభుత్వ, ప్రైవేట్) ఏటా రూ.15వేలు ఆర్థిక సాయం చేసి వారి చదువులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. అయితే విద్యార్థికి రూ.13వేలు, విద్యాసంస్థ అభివృద్ధికి రూ.2వేలుగా నిర్ణయించి నిధులు విడుదల చేస్తున్నారు. జిల్లాలో విద్యాశాఖ యూడైస్ లెక్కల ప్రకారం 2,48,176 మంది విద్యార్థులు తల్లికి వందనం పథకానికి అర్హులుగా గుర్తించారు. ఈ మేరకు 1,62,975 మంది తల్లుల ఖాతాల్లో ఒక్కో విద్యార్థికి రూ.13వేలు చొప్పున శుక్రవారం నుంచి నగదు జమ చేస్తున్నారు. 2023-24 విద్యాసంవత్సరాల్లో నమోదైన విద్యాశాఖ యూడైస్ ఆధారంగా విద్యార్థులు, తల్లుల జాబితాల ప్రకారం అర్హులకు నగదు పంపిణీ చేశారు. కాగా పెండింగ్ దరఖాస్తుదారులకు అధికారులు గడువు ఇచ్చారు. అన్ని పత్రాలను సమర్పించి బ్యాంకు ఖాతాలను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. కాగా, ఒకటోతరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పూర్తయిన తరువాత ఆర్థిక సహాయం చేస్తారు.

• ఆర్టీఈ ప్రవేశాలకు నేరుగా బడికే..

అర్హత ధ్రువీకరణ పూర్తయిన తర్వాత సచివాలయాల విభాగం, సంక్షేమ, ఆర్థిక శాఖల సమన్వయంతో నిధుల బదిలీ ప్రక్రియను అమలు చేస్తాయని అధికారులు అన్నారు. విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు మేరకు సమగ్రశిక్షా అభియాన్ నోడల్ ఖాతా ద్వారా ఆయా పాఠశాలలకు నేరుగా చెల్లిస్తారు. ఫీజు చెల్లింపు మొత్తాన్ని మినహాయించి మిగతా మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాలో జమచేస్తారు. సామాజిక ఆడిట్‌కోసం లబ్ధిదారుల జాబితాను సచివాలయాల్లో ప్రదర్శనకు ఉంచారు. అర్హత ఉండి ఎవరైనా అనర్హులుగా తిరస్కరిస్తే గ్రామ, వార్డు సచివాలయాల్లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

చంద్రబాబుకు రుణపడి ఉంటాం



నా భర్త కరీముల్లా బేల్దారి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మాకు ముగ్గురు పిల్లలు. ముజిమిల్ 7వ, సుకూర్ 4వ, వహబ్ 2వ తరగతి చదువుతున్నారు. పిల్లల చదువుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తల్లికివందనం పథకం కింద ఒక్కొక్కరికి రూ.13 వేలు వంతున రూ.39 వేలు నా బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. నిజంగా ఇది ఎంతో వరంతో కూడుకున్నది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటాం.

షేక్ రహిమున్నీసా,
దిలావర్‌భాయ్‌వీధి, ఉదయగిరి

భక్తులపాలిట కల్పవల్లి

వెంగమాంబ

- రేపటి నుంచి 19 వరకు బ్రహ్మోత్సవాలు
- నర్రవాడలో విస్తృత ఏర్పాట్లు
- సొంతూళ్లకు చేరుకుంటున్న వలసవాసులు



ప్రత్యేక అలంకరణలో వెంగమాంబ దంపతులు



శ్రీ వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయం

దుత్తలూరు (ఉదయగిరి), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): భక్తుల పాలిట కల్పవల్లిగా పేరొందిన నర్రవాడలోని శ్రీ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు జరగనున్నాయి. కరువు కోరల్లో చిక్కి జీవనం భృతి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లిన వారంతా ఈ ఉత్సవాలకు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీ. సుమారు 6 లక్షల మందికిపైగా భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు.

• వలసవాసుల ఆరాధ్యదైవం

వలసవాసుల ఆరాధ్యదైవంగా వెంగమాంబ పేరంటాలు విరాజిల్లుతోంది. అమ్మవారి సన్నిధిలో నిద్రిస్తే సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం. అలాగే, అమ్మవారి సొమ్మును పెట్టుబడిగా వినియోగించడం ఈ ప్రాంతీయులకు వస్తున్న ఆచారం. దేవస్థాన కమిటీ నుంచి కొంత సొమ్మును రుణంగా పొంది ఆ నగదును లావాదేవీల్లో వినియోగిస్తే ఆ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వృద్ధి చెంది సిరిసంపదలు సిద్ధిస్తాయనేది ప్రగాఢ విశ్వాసం. ఉత్సవాలతో నిమిత్తం లేకుండా ప్రతి ఆది, గురువారాల్లో భక్తులు అమ్మవారిని దర్శిస్తారు.

• నిలుపుతో ఉత్సవాలు ప్రారంభం

ఈ నెల 15న ఆదివారం నిలుపు, సంతానం లేని వారు వరపడుట, పసుపు దంచే కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 16న గ్రామోత్సవం, సంతానం లేని వరపడుట, 17న గ్రామోత్సవం, 18నఅమ్మవారి కల్యాణం, పసుపు కుంకుమ ఉత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు, 19న బండ్లు పొంగళ్లు, రాష్ట్రస్థాయిలో ఎడ్ల బండలాగుడు పందేలా నిర్వహణతో ఉత్సవాలు ముగుస్తాయి.

భక్తులకు ఏలోటూ రానీయం

వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉన్నతాధికారులు, ఆలయ ధర్మకర్తల సూచనలు, సలహాలతో సర్వం సిద్ధం చేస్తున్నాం. మంచినీరు, వైద్య సదుపాయం, పారిశుధ్యంవంటి కార్యక్రమాలతోపాటు పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. భక్తుల రాక కోసం వివిధ మార్గాల్లో ప్రత్యేక బస్సులు నడపనున్నాం. అమ్మవారి దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశాం.

- వెట్టిగుంట ఉషశ్రీ, ఆలయ ఈవో

రామతీర్థానికి ఉత్సవ శోభ

- 16 నుంచి శివపార్వతులు బ్రహ్మోత్సవాలు
- 24న కల్యాణం, 25న తీర్థవాది
- విస్తృత ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



విడవలూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : భక్తులకు కొంగు బంగారంగా వీరాజిల్లుతున్న శ్రీ కామాక్షిదేవి సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 16 నుంచి 26వ తేదీ వరకు రామతీర్థంలో జరగనున్నాయి. ఎంతో వైభవంగా జరిగే ఈ ఉత్సవాలకు మన రాష్ట్రం నుంచేగాక తెలంగాణ, తమిళ నాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారు. ఈ మేరకు ఆలయ అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.

• శ్రీరాముడు ప్రతిష్ఠాపనతో..

త్రేతాయుగంలో శ్రీరాముడు సీతా లక్ష్మణులతో అరణ్యవాసం చేస్తున్నప్పుడు లంకాధీపతి రావణుడు సీతమ్మను అపహరించి లంకకు తీసుకెళతాడు. సీతాన్వేషణకు బయలు దేరిన రామలక్ష్మణులు రామతీర్థం గ్రామానికి చేరుకుని, సూర్యస్తమయం కావటంతో సముద్రతీరాన శయనిస్తారు. సూర్యోదయం కాగానే శ్రీరాముడు సముద్రంలో స్నానాలు ఆచరించి సైకత శివలింగాన్ని ప్రతిష్ఠించి, పూజలు చేస్తారు. ఆనాటి నుంచి ఈ ప్రాంతాన్ని రామతీర్థంగాను, శ్రీరాముడిచే ప్రతిష్ఠించిన శివలింగం కావడంతో రామలింగేశ్వరుడిగా భక్తులు కొలుస్తు న్నారు. 14వ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని పాలించిన పల్లవరాజులు స్వామివారికి దేవాలయం నిర్మించి, పూజించారు. 18వ శతాబ్దంలో కోటంరెడ్డి శేషాద్రిరెడ్డి ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేశారు. 2009లో ఆదినారాయణరెడ్డి-సులోచనమ్మలు ఆల యాన్ని పునఃనిర్మిం చారు.

ఉత్సవాలు ఇలా...

శ్రీ కామాక్షీదేవి సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో తొలిఘట్టమైన అంకురార్పణ 16వ తేదీన జరగనుంది. 17న ధ్వజారోహణం, 18న చిలక వాహనం, 19న హంస వాహనం, 20న పులి వాహనం, 21న రావణసేవ, 22న నంది సేవ, 23న స్వామి వారి రథోత్సవం, 24న ఆదిదంప తుల కల్యాణం, గజ వాహనంపై స్వామివారు విహరిస్తారు. 25న తీర్థవాది (సముద్ర స్నానం), తెప్పోత్సవం, పారువేట, గుర్రపు వాహనం, 26న ధ్వజావరోహణం, స్వామి, అమ్మవార్ల ఏకాంత సేవతో ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాలు ప్రారంభ, ముగింపు నాడు పల్లవుల కాలం నాటి 200 కిలోల కంచు గంటను మోగిస్తారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	119
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	238

కోడిగుడ్ల ధర (100): 535

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై తహసీల్దారు విచారణ

కొండాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కదామెర్ల పంచాయతీ పొట్టిపల్లి గ్రామంలో ప్రభుత్వ స్థలం ఆక్రమణపై తహసీల్దారు కోటేశ్వరరావు శుక్రవారం విచారణ చేపట్టారు. వివరాల మేరకు.. 1996లో గ్రామంలో అప్పటి అధికారులు లే అవుట్ వేసి ప్లాట్లు ఏర్పాటు చేశారు. గ్రామస్థులందరూ సమష్టిగా కేటాయించిన ప్లాట్లలో నాలుగింటిని గ్రామ అభివృద్ధి పనుల కొరకు వదలివేశారు. ఆ ప్లాట్లలో ఒక దానిలో అంగన్‌వాడీ భవనం నిర్మించా రు. గ్రామానికి చెందిన ప్లాట్లలో అంగన్‌వా డీ భవనం ఎలా నిర్మిస్తారని ఓ వ్యక్తి ఆప్లాట్ల చుట్టూ కంచే వేసి అంగన్‌వాడీ భవనాన్ని మూసివేయించాడు. దీంతో చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రంలోకి వెళ్లేం దుకు వీలులేక చెట్ల కిందనే కూర్చున్నారు. గ్రామస్థులు ఈ విషయాన్ని తహసీల్దారుకు తెలియచేయడంతో గ్రామానికి వెళ్లి అంగన్‌వాడీ భవనం తలుపు తీయించారు. ప్రభుత్వ భూములు ఎవరైనా ఇష్టానుసారంగా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సీడీపీవో పద్మజాకుమారి ఉన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



కావలి పట్టణం బాహూజీనగర్‌లోని జర్నలిస్ట్‌కాలనీ రోడ్డులో నడిరోడ్డులో ఉన్న విద్యుత్ స్తంభంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఆ రోడ్డులో స్తంభం పక్కనే బీసీ బాలికల హాస్టల్, అనేక గృహాలతో పాటు ఒక ప్రైవేట్ పాఠశాల కూడా ఉంది. దీంతో ఈ రోడ్డు నిత్యం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, చిన్నచిన్న వాహనాలతో రద్దీగా ఉంటుంది. బీసీ హాస్టల్‌కు వెళ్లే మలుపు వద్ద ఉన్న ఈ విద్యుత్ స్తంభం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతోన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి నడి రోడ్డుపై ఉన్న ఆ స్తంభాన్ని పక్కకు మార్చి ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- కావలి,(ఆంధ్రజ్యోతి)

ఈ కాలువల్లో నీరు పారేదెలా?



లింగసముద్రం పాత చెరువుకు సంబంధించిన పంట కాలువ చిల్లచెట్లతో మూసుకుపోయి అధ్వానంగా మారింది. వర్షాభావ పరిస్థితుల కారణంగా గత ఐదారేళ్ల నుంచి పాత చెరువుకు అరకొరగా మాత్రమే నీరు చేరుతుండడంతో రైతులు ఈ చెరువు కింద పంటలు సాగు చేయలేదు. ఈ చెరువు కింద సుమారు 600 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. పంటలు సాగు చేయక పోవడంతో కాలువలతో పాటు భూముల్లోనూ చిల్లచెట్లు పెరిగిపోయాయి. దీంతో కాలువలు పూడిపోయి, చిల్లచెట్లతో నిండి పోయాయి. కనీసం ఈ ఏడాదైనా వర్షాలు కురిసి చెరువులోకి పూర్తి సామర్థ్యంతో నీరు చేరితే ఆ నీరు పంట కాలువలకు వచ్చే పరిస్థితి లేదు. అధికారులు వెంటనే కాఉలవల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

- లింగసముద్రం,(ఆంధ్రజ్యోతి)

అడుగడుగున చెత్త కంపు



వలేటివారిపాలెం మండల కేంద్రంలో ప్రధాన రహదారులు అపరిశుభ్రంగా మారాయి. రహదారుల పక్కనే చెత్త వేస్తుండడంతో ఆ మార్గంలో ప్రయాణించాలంటే ముక్కుపుటాలు అదిరేలా దుర్వాసన వెదజల్లుతోంది. ప్రతి రోజూ వీధులను శుభ్రం చేయాల్సిన క్లాప్ మిత్రలు 15 రోజులకొకసారి శుభ్రం చేస్తున్నారు. దీంతో వీధుల్లో చెత్త కుప్పలు కుప్పలుగా పేరుక పోతోంది. అంతేగాకుండా సేకరించిన చెత్తను చెత్తసంపద కేంద్రానికి తరలించకుండా రహదారుల పక్కనే పడేస్తున్నారు. దీంతో అది అక్కడే కుళ్లి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారి దుర్వాసన వస్తోంది. పర్యవేక్షించాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి ప్రతిరోజు చెత్తను చెత్త సంపద కేంద్రానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- వలేటివారిపాలెం,(ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్

ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని నియంత్రించాలి

కావలి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేసి ఫీజుల దోపిడీని నియంత్రించాలని పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరువది భాస్కర్ కోరారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో విద్యార్థుల తల్లితండ్రులతో కలిసి శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థలన్నీ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందినవైనప్పటికీ ప్రభుత్వ నిబంధనలను అమలు పరచటంలో కావలి డివిజన్‌లో విద్యాశాఖ అధికారులు ఎందుకు విఫలం చెందుతున్నారని ప్రశ్నించారు. దీని వెనుక ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి అధికారులకు ముడుపులు ఏమైనా ముట్టాయా అనే అనుమానాలు వ్యక్త మవుతోన్నాయని చెప్పారు. తల్లిదండ్రులు, విద్యాశాఖ అధికారులతో గవర్నింగ్ బాడీ నియమించి ఫీజులను నిర్ణయించి వాటిని నోటీస్ బోర్డులో డిస్‌ప్లే చేయాల్సి ఉన్నా ఎక్కడా అలా జరగటంలేదన్నారు. విద్యాసంస్థలు రీ ఓపెనింగ్ సమయంలో విద్యాసంస్థలను పర్యవేక్షిస్తున్న దాఖలాలు లేవన్నారు. ఒక్క ఫీజుల దోపిడీనే కాకుండా బుక్స్, యూనిఫామ్ పేరుతో అదనపు వసూలు చేస్తున్నారని చెప్పారు. ప్రతి విద్యాసంస్థ 25 శాతం ఉచిత సీట్లు ఇవ్వాలనే నిబంధన ఉన్నా అదికూడా అమలు కావడంలేదన్నారు. వీటిపై విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోక పోతే విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి పోరాటాలు చేపట్టాల్సి వస్తోందన్నారు. ఈ సమావేశంలో విద్యార్థుల తండ్రులు ఆమంచి సుబ్బు, కే. మహేంద్ర పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

కందుకూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కందుకూరు డివిజన్ పోలీసుశాఖ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9.30 గంటలకు పట్టణ పోలీసుస్టేషన్ ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ సీహెచ్ వీ బాలసుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. రోగుల ప్రాణాలను నిలబెట్టడంలో ఎంతో ప్రాధాన్యత కలిగిన రక్తదానం చేయటంలో పోలీసు సిబ్బంది ఎల్లవేళలా ముందుండటమే గాక అనేక సందర్భాలలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ తమవంతు సామాజిక బాధ్యతలో ముందుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు యువత ముందుకొచ్చి రక్తదానం చేయటం ద్వారా విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి పేర్కొన్నారు.

200 పొగాకు బేళ్లు తిరస్కరణ

కలిగిరి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు మొత్తం 548 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 348 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-180, ఆర్‌ఆర్-8, సీఆర్-8, జంపింగ్‌లాట్స్-4 కారణాలతో 200బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.180, సగటు ధర రూ.249.58గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

శ్రీనివాస హేచరీలో బాలుడికి ప్రమాదం

● ఆలస్యంగా వెలుగులోకి... ● బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు



శ్రీనివాస హేచరీ ప్రతినిధిని ప్రశ్నిస్తున్న ఎస్ఐ అంకమ్మ

ఉలవపాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కరేడు పంచాయతీ అలగాయపాలెం తీర ప్రాంతంలోని శ్రీనివాస హేచరీలో పని చేస్తున్న 16 ఏళ్ల బాలుడు ప్రమాదానికి గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత బాలుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు. పోలీసు ల కథనం మేరకు.. అనకా పల్లి జిల్లా, పాయకరంపల్లి మండలం ఈదటం గ్రామానికి చెందిన నెమల తేజ తాతారావు 10వ తరగతి చదువుతున్నాడు. కాగా అదే ప్రాంతానికి చెందిన బాలుడి స్నేహితుడు నగేష్ కొంతకాలంగా అలగాయపాలెంలోని శ్రీనివాస హేచరీలో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. వేసవి సెలవులు కావడంతో తాతారావు తన స్నేహితుడి నగేష్ దగ్గరకు వచ్చి మే 3వ తేదీన శ్రీనివాస హేచరీలో పనికి చేరాడు. అదే నెల 27వ తేదీన రొయ్య పిల్లల ట్యాంక్ శుభ్రం చేస్తున్న క్రమంలో కాలుజారి నిచ్చెన పై నుంచి కిందపడి తలకు బలమైన గాయాలయ్యాయి. అదేసమయంలో బక్కెట్‌లోని యాసిడ్ కళ్లల్లో పడింది. హేచరీ యాజమాన్యం క్షతగాత్రుడిని ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రిలో చికిత్స చేయించి బాలుడి స్వగ్రామానికి పంపించారు. బాలుడి తల్లిదండ్రులు తుని ఆసుపత్రిలో వైద్యులకు చూపించగా తలకు శస్త్రచికిత్స చేయాలని సూచించారు. ఆసుపత్రిలో బాలుడు ఫిర్యాదుని నమోదు చేసుకున్న వైద్యులు ఉలవపాడు పోలీసులకు సమాచరం అందించారు. దీనిపై శుక్రవారం ఎస్ఐ అంకమ్మ, లేబర్ ఇన్‌స్పెక్టర్ సుజాతతో కలిసి శ్రీనివాస హేచరీకి వెళ్లి బాల కార్మికులు ఉన్నారేమోనని తనిఖీలు చేసి, అందిన ఫిర్యాదుపై హేచరీ యాజమాన్యంను విచారించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులమనే గుర్తింపు తొలగించండి



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ ఆయాలు

ఉలవపాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు కావడంతో తమకు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలకు అనర్హులుగా ప్రకటిస్తున్నారని మండలంలోని అంగన్‌వాడీ ఆయాలు సీఐటీయూ జిల్లా నాయకత్వంతో కలిసి శుక్రవారం తహసీల్దారు టీ శ్రీనివాసులకు వినతిపత్రం అందచేశారు. ఆయాలకు ప్రభుత్వం నుంచి గౌరవ వేతనంగా నెలకు రూ.7000 అందుతుందని, గత ప్రభుత్వంలో వలంటీర్లు, సచివాలయం సిబ్బంది చేపట్టిన హౌస్ మ్యాపింగ్‌లో అంగన్‌వాడీ ఆ యాలు రూ.12000 జీతం తీసుకుంటున్నారని నమోదు కావడంతో గ్యాస్, ఎస్సీ, ఎస్టీ ఉచిత కరెంటు బిల్లు, తల్లికి వందనం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనర్హులంగా మిగిలిపోయా మన్నారు. తమకు తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ ఆయా లు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకుంటేనే 'అన్నదాత సుఖీభవ'

● బాధ్యతలు స్వీకరించిన వ్యవసాయాధికారి శేషారెడ్డి



వ్యవసాయాధికారి శేషారెడ్డి

వలేటివారిపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఈకేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే అన్నదాత సుఖీభవ నగదు జమ అవుతుందని ఏవో శేషారెడ్డి తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో నూతన ఏవోగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన శేషారెడ్డి ముందుగా ఈకేవైసీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెలలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ నగదు జమ చేయనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన అర్హుల జాబితా గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద ఉందని చెప్పారు. రైతులు తమ ఆధార్‌కార్డుతో రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. మండలంలో అన్నదాత సుఖీభవకు 6008 మంది రైతులు అర్హత కలిగి ఉన్నట్లు చెప్పారు.

● **గుడ్లూరు** : అన్నదాత సుఖీభవ పథకం పొందే ప్రతి రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల ఏవో రవికుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల జాతతా, ఈకేవైసీ కోసం, ఆయా గ్రామల వ్యవసాయ, ఉద్యానవన సహాయకుల లాగిన్‌కు వచ్చి ఉన్నాయని, ఈ విషయన్ని ప్రతిరైతు గమనించాలన్నారు. ఈకేవైసీ చేయించుకోని రైతులకు పథకం వర్తించదని ఆయన పేర్కొన్నారు.


సామాజిక కార్యకర్త వరప్రసాద్‌కు సత్కారం



వరప్రసాద్‌ను సత్కరిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత, వైద్యులు

కావలిటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అనేక పర్యాయాలు రక్తదానం చేయడమే కాక రక్తదాతలను ప్రేరేపకుడుగా సేవలందిస్తున్న సామాజిక కార్యకర్త, బీసీ ఐక్యత భవన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్ని వరప్రసాద్‌ను శుక్రవారం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో వైద్యులు ఘనంగా సత్కరించారు. ప్రపంచ రక్తదాతల దినోత్స వంలో భాగంగా జరుగుతున్న వారోత్సవాల్లో ఏరియా వైద్యశాలలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత, సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి, డాక్టర్ ప్రమీల తదితర వైద్యులు వరప్రసాద్‌ను శాలువా సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

పశుసంవర్ధక శాఖ ఏడీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన ఏడీ చెన్నకేశవులు

వలేటివారిపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం ఏరియా పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్‌గా డాక్టర్ చెన్నకేశవులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం వైద్యశాల నుంచి బదిలీపై వలేటివారిపాలెం వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏడీ బ్రహ్మయ్య బదిలీపై అద్దంకి వెళ్లారు. ఈయన గతంలో వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాల్లో పశువైద్యాధికారిగా పనిచేశారు.



సాగునీటిని వృథా చేయొద్దు

● బీ.నాగార్జునరెడ్డి, జేఈ, సోమశిల ప్రాజెక్ట్

జలదంకి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రెండో పంటకు విడుదల చేసిన సోమశిల జలాలను రైతులు పొదుపుగా వాడుకోవాలి. ఉన్న నీటిని వృథా చేస్తే చివరి తడులకు తగ్గే ప్రమాదం ఉంది. చేసిన కేటాయింపులను సద్వినియోగం చేసుకుని పంటలు పండించుకోవాలని సోమశిల ప్రాజెక్ట్ జేఈ బీ.నాగార్జునరెడ్డి తెలిపారు.

ఈ ఇంటర్వ్యూ

? చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయరుకు కావలి కాలువ ద్వారా సోమశిల జలాలు ఎంత నీరు చేరుతోంది. ఏఏ బ్రాంచ్ కాలువలకు సరఫరా చేస్తున్నారు.

! సీబీఆర్‌కు సరాసరి 300 క్యూసెక్కులు చేరుతోంది. సంగం ఆనకట్ట వద్ద 650 క్యూసెక్కులు కావలి కాలువకు విడుదలవుతుండగా బ్రాహ్మణక్రాక, హనుమకొండపాలెంతో సహా అన్ని మేజర్, మైనర్ కాలువలకు పోను సీబీఆర్‌కు 300 క్యూసెక్కులు చేరుతున్నాయి.

? కావలికాలువ పూడికతీత అనంతరం నీటిసరఫరా ఎలా ఉంది.

! కావలికాలువ పూడికతీత అనంతరం నీటి సరఫరా బాగుంది. సంగంలో విడుదల చేసిన నీరు 24గంటల వ్యవధిలో సీబీఆర్‌కు చేరాయి. కాలువలో 1000 క్యూసెక్కుల నీరు సరఫరాకు అవకాశం ఏర్పడింది. కాలువ పూడికతీతతో ఆయకట్టు రైతులకు సమృద్ధిగా సాగునీరు సరఫరా చేసుకునే వీలు కలిగింది.

? నీటి వాడకంపై రైతులకు ఎలాంటి సూచనలు ఇస్తున్నారు.

! సాగునీరు అవసరం మేరకు వాడుకునే విదంగా వ్యవసాయశాఖ అధికారులతో రైతులకు, సాగునీటి సంఘాల ప్రతినిధులకు సమావేశం ఏర్పాటు చేసి నీటి వాడకంపై తగిన సూచనలు ఇచ్చాం. రైతులు సాగునీరు వృథా చేయకుండా అవసరం మేరకు వాడుకోవాలి.

? సాగునీటి సరఫరాలో నీటి సంఘాల బాధ్యతలేంటి.

! సాగునీటిని విడుదల చేయడంతో పాటు రైతులకు అందేవిధంగా పూర్తిస్థాయిలో సాగునీటి సంఘాల ప్రాధాన్యత అధికం. వారు చెప్పిన విధంగా కాలువలకు సాగునీరు విడుదల చేయడం జరుగుతోంది. నీటిసంఘాల ప్రతినిధులతో ఎప్పటికప్పుడు తాము చర్చిస్తూ సమన్వయంతో పనిచేస్తున్నాం.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కావలి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కావలి పట్ట ణం వెంగళరావు, పుల్లారెడ్డినగర్, రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ప్రాంతాలకు శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వర కు విద్యుత్ సరఫరా ఉండదని కావలి టౌన్-1, టౌన్-2 అసిస్టెంట్ ఇంజనీర్‌లు నాగార్జున, వ సంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యు త్‌లైన్లపై ఉన్న చెట్ల కొమ్మలు, చెట్లు తొలగించ టం, విద్యుత్ ట్రాన్స్‌పార్మర్స్, సబ్‌స్టేషన్ మర మ్మతుల కారణంగా విద్యుత్ సరపరాను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

● కావలిటౌన్-1లో పుల్లారెడ్డినగర్, రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని మాగుంట పార్వతమ్మ ట్రంకు రోడ్డుకు తూర్పున ఉన్న అన్ని ప్రాంతాల్లో, ట్రంకు రోడ్డుకు పడమర ఉన్న వడ్డిపాలెం, కలుగోళ్లమ్మపేట, సంకరవారి తోట, వాయునందన ప్రెస్ రోడ్డు తదితర ప్రాం తాల్లో విద్యుత్ సరపరా ఉండదని తెలిపారు.

● కావలిటౌన్-2 పరిధిలో రైల్వేట్రాక్‌కు పడమర వైపున వెంగళరావునగర్, ఇందిరానగర్, తుఫాన్‌నగర్, బాలకృష్ణారెడ్డి నగర్, జనతాపేట, మున్సిపల్ ప్లాట్స్, వైకుంఠపురం, పెంకుల ఫ్యాక్టరీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. మాగుంట పార్వతమ్మ ట్రంకురోడ్డుకు పడమర వైపున కచ్చేరిమిట్ట, క్రిష్టియన్‌పేట, కోఆపరేటివ్‌కాలనీ, రైల్వేరోడ్డు, కోర్టు పరిసర ప్రాంతాలు, రాజావారి వీధి, అప్ప ల అగ్రహారం, ఏరియా ఆసుపత్రి పరిసరాలలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ప్రజ లు గమనించి సహకరించాలని కోరారు.

● **అల్లూరు** : మండలంలోని అల్లూరు, నార్తుమోపూరు సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మ ధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా కు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ మస్తాన్‌షరీఫ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో అల్లూరు, నార్తుమోపూరు, బీరం గుంట, నార్తుఆములూరు, బట్రకాగొల్లు, గ్రద్ద గుంట గ్రామాల్లో విద్యుత్ సరఫరాను ఉండదని పేర్కొన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని తెలిపారు.

● **బిట్రగుంట** : విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వి ద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ జడరాయ్ శుక్రవారం ఓ ప్రకట నలో తెలిపారు. దీంతో చెంచులక్ష్మీపురం, జక్కే పల్లిగూడూరు, ముంగమూరు, వడ్డిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

పునీత అంథోని జన్మదిన వేడుకలు



పురవీధుల్లో ఊరేగుతున్న పునీత అంథోని

బిట్రగుంట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బోగోలు అరవపాలెంలోని అంథోని మందిరంలో శుక్రవారం పునీత అంథోని జన్మదిన వేడుకలు నిర్వహించారు. సాయంత్రం ఊరేగింపు జరిగింది. జూన్ ఒకటవ తేదీ నుంచి 13 రోజుల ప్రార్థనల అనంతరం అంథోని ప్రతిమకు పూల అలంకరణతో ఆర్సీఎం చర్చి నుంచి ఊరేగింపు నిర్వహించారు. పునీత అందోనితో పాటు వేళాంగినీమాత, బాలయేసు ప్రతిమలు ప్రత్యేక పూల అలంకరణతో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో బోగోలు, విశ్వనాథరావుపేట తదితర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్‌బీఐ సిబ్బంది రక్తదానం

కందుకూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా 70వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక రీజనల్ ఆఫీసులో రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో బ్యాంకు సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని ముగ్గురు విద్యార్థినులకు సైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు రీజనల్ మేనేజరు అప్పలరాజు, మేనేజరు ఆర్. శ్రీనివాసనాయక్, రీజనల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ ఆర్ఎం అప్పలరాజు

ఉపాధి హామీ పనుల పరిశీలన

వలేటివారిపాలెం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోకూరు, నలదలపూరు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఏపీవో దయాసాగర్ పరిశీలించారు. పనుల్లో సమయపాలనతో పాటు కొలతల ప్రకారం పనిచేయాలన్నారు. అప్పుడే గిట్టుబాటు కూలి వస్తుంది పేర్కొన్నారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్‌లు సుబ్బారాయుడు, రామకృష్ణ ఉన్నారు.

ఇక పంచాయతీలకు గ్రేడ్‌లు!

(5వ పేజీ తరువాయి)

వ్యవస్థను తొలగించాలని నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా ప్రతి జిల్లా నుంచి ప్రతిపాదనలు పంపాలని కోరారు.

● **ప్రభుత్వానికి చేరిన ప్రతిపాదనలు**

ప్రభుత్వ సూచనలతో పంచాయతీ అధికారులు నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. జిల్లాలో 722 పంచాయతీలు ఉండగా వాటిలో కోటి ఆదాయం కలిగి 10వేల జనాబా ఉన్న పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పరిధిలోకి వస్తాయి. అలాంటి పంచాయతీలు జిల్లాలో 15 ఉన్నట్లు లెక్క తేల్చారు. 50లక్షలు ఆదాయం కలిగి 5వేల నుంచి 10వేలలోపు జనాబా ఉన్న పంచాయతీలను గ్రేడ్-1గా తేలుస్తూ 73 పంచాయతీలు ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. 2వేల నుంచి 5వేలలోపు జనాబా ఉన్న పంచాయతీలు గ్రేడ్-2 కిందకి రానున్నాయి. ఇవి 183 పంచాయతీలు ఉన్నాయి. ఇక 2వేలలోపు జనాబా కలిగిన పంచాయతీలు 451 ఉన్నాయి. వాటి వివరాలను ప్రభుత్వానికి పంపారు. క్యాబినేట్‌లో ఆమోద ముద్ర పడగానే పంచాయతీలకు గ్రేడ్‌ల వ్యవస్థ ఏర్పాటు కానుంది. అలాగే ప్రతి పంచాయతీకి ప్రత్యేకంగా ఓ కార్యదర్శి ఉండనున్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత మాలేపాటి

బిట్రగుంట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండ లం విశ్వనాథరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వి ద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను శుక్ర వారం టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్‌రావు ఆధ్వర్యంలో జరి గిన ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఎల్.సుధీర్‌బాబు, సహోపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారి బాధ్యతల స్వీకరణ

కలిగిరి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మనుబోలు మండలం నుంచి బదిలీపై కలిగిరికి వచ్చిన వ్యవ సాయాధికారి షేక్ జహీర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సురేష్‌బాబు ఏఎస్‌పేట మండలానికి బదిలీ అయ్యారు. ఆయనకు ఏఈవోలు చి రంజీవి, సునీల్, వీఏఏ, వీహెచ్ఏ అభినందనలు తెలిపారు.



తెప్పపై చాముండేశ్వరి వైభోగం

ఇందుకూరుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగపట్నంలో చాముండేశ్వరిదేవి అమ్మవారు శుక్రవారం రాత్రి తెప్పపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఇక్కడ జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో చివరిరోజు శుక్రవారం తెప్పోత్సవానికి తిలకించేందుకు భక్తజనం పోటెత్తింది. ఆలయ ఈవో తాతా శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ సభ్యులు గుండాల కృష్ణారెడ్డి, కొండూరు వెంకటరమణారెడ్డి, కేతిరెడ్డి అవినాష్‌రెడ్డి, బొద్దుకూరు సుధీర్, భక్తులు పాల్గొన్నారు.


నమ్మకంగా ఉంటూనే టోకరా!

- హైవేపై గుర్తుతెలియని కారు ఢిల్లీ వ్యాపారిది
- అందులో రూ.కోట్ల కరెన్సీ రవాణా
- ముమ్మరంగా విచారిస్తున్న పోలీస్ యంత్రాంగం
- అదుపులో నలుగురు.. కరెన్సీ స్వాధీనం?

మర్రిపాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడూ నిర్మానుష్యంగా ఉండే మర్రిపాడు పోలీస్‌స్టేషన్‌లోకి పదుల సంఖ్యలో కార్లు వచ్చి ఆగాయి. ఎస్‌ఐ నుంచి డీఎస్పీ స్థాయి అధికారులు హడావుడిగా కనిపించారు. అలాగే మరికొందరు వ్యాపారులు కూడా అక్కడకు చేరుకున్నారు. ఈ హడావుడి ఏమిటని లోతుగా పరిశీలిస్తే అసలు విషయం వెలుగు చూసింది. మండల పరిధిలోని బాట, సింగనపల్లి సమీపంలో ముంబయి జాతీయరహదారిపై గురువారం పోలీసులు ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. అది మధ్యప్రదేశ్ రాష్ట్రంలో రిజిస్టర్ అయి ఉండటంతో దర్యాప్తును మరింత ముమ్మరం చేశారు. గుజరాత్‌కు చెందిన ఓ బడా వ్యాపారి తన వ్యాపారం నిమిత్తం అవసరమైన నగదును చెన్నైకి చేర్చాలని తనకు నమ్మకస్తులైన గుమాస్తాలకు తెలిపారు. నగదును ఢిల్లీ నుంచి బుధవారం హైదరాబాద్‌కు పంపి అక్కడ నుంచి చెన్నైకి చేర్చాలని సూచించాడు. కరెన్సీ రవాణా చేసేందుకు ఓ కారును సమకూర్చాడు. ఇందులో నగదు ఉంచేందుకు వీలుగా సీటు కింద ప్రత్యేకంగా ఇనుప ట్రేలతో లాకర్లు అమర్చి, అందులో కరెన్సీ కట్టలు ఉంచి రవాణా చేశారు. కర్నూలు, నెల్లూరు మీదుగా చెన్నై వెళ్లేందుకు బుధవారం రాత్రి హైదరాబాదులో వారు బయలుదేరారు. గురువారం ఉదయం నెల్లూరు-కడప సరిహద్దు ప్రాంతానికి చేరుకున్నారు. ఆ తర్వాతకు కారుకు అమర్చిన జీపీఎస్‌ను తొలగించారు. బాట, సింగణపల్లి సమీపంలో కారులో ఉన్న ఆ నగదును మరో కారులోకి మార్చి ఉడాయించి వెళ్లారు. డోర్లు తెరచి, సీటులు తొలగించి ఉన్న కారును గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మధ్యప్రదేశ్ చెందిన కారుగా (ఎంపీ07జడ్‌జె1078) పోలీసులు గుర్తించి, వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, ముమ్మరంగా వివరాలను ఆరాతీశారు. ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, ఆరుగురు ఎస్‌ఐలు ఈ కేసును విచారిస్తున్నారు. మరోవైపు ఢిల్లీకి చెందిన వ్యాపారి గురువారం మర్రిపాడు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. భారీగా కార్లు చేరుకోవడంతో స్టేషన్ పరిసర ప్రాంతమంతా హడావుడిగా కనిపించింది. దొంగతనానికి పాల్పడిన నలుగురినికి పోలీసులు పట్టుకొని విచారిస్తున్నట్లు సమాచారం. అలాగే, ఓ వాహనంతోపాటు రూ.కోట్లు విలువైన నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.



మర్రిపాడు పోలీస్ స్టేషన్ వద్ద భారీగా ఆగి ఉన్న కార్లు



కు.ని.కి

మగవారు దూరం !

కుటుంబ నియంత్రణ అనేది భార్యాభర్తల ఇద్దరి బాధ్యత. అయితే జిల్లాలో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు స్త్రీలకే జరుగుతున్నాయి. ఈ విషయంలో పురుషులు ముందుకు రావడం లేదు. గడిచిన ఐదేళ్ల గణాంకాలను పరిశీలిస్తే కు.ని. శస్త్రచికిత్స (వేసక్టమి) చేయించుకున్న మగ మహారాజుల సంఖ్య నామమాత్రం!. ఒకవైపు అధిక శాతం కాన్పులు సిజేరియన్ ఆపరేషన్లతోనే జరుగుతుండగా మరోవైపు కు.ని. శస్త్రచికిత్సలు కూడా ఆడవారే చేయించుకోవాల్సి వస్తుండటంతో వారిపై ఒత్తిడి పెరుగుతోంది.

- వేసక్టమి చేయించుకోని పురుషులు
- మగతనం తగ్గుతుందనే అనుమానం
- లక్ష్యం వెయ్యి... జరిగేది 10!
- ప్రచారంలో వైద్య శాఖ వైఫల్యం
- అపోహ వీడాలంటున్న వైద్యులు

నెల్లూరు (వైద్యం), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో వేసక్టమి శస్త్రచికిత్సలు చేయించుకునే వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. పురుషులు ఈ శస్త్రచికిత్సలకు ససేమిరా అంటున్నారు. కుటుంబ నియంత్రణ చేయించుకుంటే మగతనం తగ్గుతుందన్న అపోహ చాలా మంది మగవారిలో ఉండటమే దీనికి ప్రధాన కారణం. ప్రస్తుతం ఎన్నో నూతన పద్ధతులు అందుబాటులో ఉన్నప్పటికీ మగవారు మాత్రం ఆసక్తి చూపడం లేదు. మరోవైపు కుటుంబ నియంత్రణ అంటే అది కేవలం మహిళలకు మాత్రమే అన్న భావన అన్ని వర్గాల్లో పాతుకుపోయింది. దీనివల్ల వేసక్టమి శస్త్రచికిత్సలు బాగా తగ్గిపోయాయి. వైద్య ఆరోగ్యశాఖ ప్రతీ ఏడాది వెయ్యి వేసక్టమి ఆపరేషన్లు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశిస్తుండగా కేవలం 10 నుంచి 12లోపు జరుగుతున్నాయి. కొన్ని సంవత్సరాలైతే అవి కూడా జరగలేదని గణాంకాలు చెబుతున్నాయి.

గత ఐదేళ్లలో జిల్లాలో వేసక్టమి శస్త్ర చికిత్సలు

సంవత్సరం	వేసక్టమి
2020 - 21	0
2021 - 22	0
2022 - 23	10
2023 - 24	11
2024 - 25	4
2025 - 26	0

1952 నుంచే...

దేశంలో జనాభా నియంత్రణ లేకపోవటం వల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఆ ప్రభావం ప్రభుత్వాలపై కూడా పడుతోందని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 1952వ సంవత్సరంలోనే జనాభా నియంత్రణకు శ్రీకారం చుట్టింది. ఏటా లక్ష్యాలు నిర్దేశించి కుటుంబ నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోంది. అయితే గత ఐదేళ్లగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కు.ని లక్ష్యాలపై పెద్దగా దృష్టి సారించకపోవటంతో అనుకున్న ఫలితాలు రావడం లేదు. ఏటా జిల్లాలో 15వేల కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయాలని కేంద్ర కుటుంబ సంక్షేమశాఖ లక్ష్యాన్ని నిర్ణయించగా ఇందులో 50 శాతం కూడా పూర్తికావడం లేదు. ఈ నేపథ్యంలో మగవారు అపోహలు వీడి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

జనాభాకు అనుగుణంగా లక్ష్యాలేవి?

జిల్లాలో ప్రస్తుతం 26.50 లక్షల మంది జనాభా ఉన్నారు. ఏటా ఈ సంఖ్య పెరుగుతూనే ఉంది. మరోవైపు ప్రతీ సంవత్సరం జిల్లాలో సుమారు 43వేల ప్రసవాలు జరుగుతున్నాయి. అయితే ఇద్దరు పిల్లలు పుట్టగానే కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించుకోవాలని ప్రజల్లో తగిన అవగాహన ఉన్నప్పటికీ ఎక్కువగా ఆడవారే ట్యూబెక్టమి ఆపరేషన్లు చేయించుకుంటున్నారుగానీ మగవారు మాత్రం వేసక్టమి ఆపరేషన్లు చేయించుకోవటం లేదు. ఈ పరిస్థితికి యంత్రాంగం వైఫల్యం కూడా కారణం. వేసక్టమిపై అపోహలు, అనుమానాలు నివృత్తి చేయటానికి తగిన ప్రచారం చేయడంలో వెనుకబడటంతో వేసక్టమి లక్ష్యాలు నెరవేరడం లేదు.



ముందుకు రావడం లేదు



వేసక్టమికి మగవారు ముందుకు రావడం లేదు. మగతనం తగ్గుతుం దని, కొన్ని రోజులు ఇంట్లోనే ఉండాల్సి వస్తుందన్న అపోహలు ఉన్నాయి. ఈ శస్త్రచికిత్సపై తగిన ప్రచారం అవసరం. గ్రామస్థాయిలో ఈ చికిత్సలు జరిగేలా చర్యలు తీసుకోవాలి. అపోహలు తొలగించేందుకు కృషి చేస్తున్నాం.

- డాక్టర్ వెంకటేశ్వర్లు, వేసక్టమి శస్త్రచికిత్స నిపుణులు, జీజీహెచ్

మాలకొండ హుండీల ఆదాయం రూ.1,14,73,106



మాలకొండలో హుండీల్లో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

వలేటివారిపాలెం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి 37 హుండీల్లో 11 శనివారాల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.1,14,73,106 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ తెలిపారు. మాలకొండలోని కల్యాణ మండపంలో శుక్రవారం కందుకూరు గ్రూపు దేవాలయాల ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పర్యవేక్షణలో హుండీల లెక్కింపు జరిగింది. నగదుతో పాటు 308 గ్రాముల బంగారం, 2415 గ్రాముల వెండి, 251 అమెరికన్ డాలర్లు, 20 సింగపూర్ డాలర్లు, 2 మలేషియా రింగిట్స్, 20 ఇంగ్లండ్ పౌండ్స్, 10,000 వియత్నాం డాంగ్, 100 సౌత్‌ఆఫ్రికన్ డాంగ్ లభించినట్లు డీసీ చంద్రశేఖర్ తెలిపారు.

రాష్ట్ర ప్రతిభా అవార్డులకు 'కేపీసీ' విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

నెల్లూరు(విద్య), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని కేపీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర ప్రతిభా పురస్కారాలకు ఎంపిక య్యారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. కళాశాలలో శుక్రవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కంప్యూటర్ సైన్స్ విద్యార్థి షేక్ అక్బర్ ఇంటర్లో 1000కి 978 మార్కులు, హెచ్‌ఈసీ విద్యార్థిని యోషిక 946 మార్కులు సాధించి రాష్ట్ర ప్రతిభా అవార్డుకు ఎంపికైనట్లు చెప్పారు. మిగిలిన విద్యార్థులకు కూడా రానున్న రోజుల్లో ఉత్తమ విద్యనందించి వారి ఉన్నతికి తోడ్పడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమశిల నీటిమట్టం

అనంతసాగరం జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం 95 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా 38.655 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెన్నా డెల్టాకు 3,850, ఉత్తర కాలువకు 375, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఆటో బోల్తాపడి మహిళ మృతి

- ఆరుగురికి గాయాలు

వెంకటాచలం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వేపల్లి సమీపంలో మల్లుగుంట సంఘం వద్ద శుక్రవారం ఉదయం ఆటో అదుపుతప్పి బోల్తాపడడంతో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందగా ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇడిమేపల్లి పంచాయతీ పలుకూరివారి పాళెంకు చెందిన ఆటోడ్రైవర్ చల్లా హరి బాబు తన ఆటోలో నారేత వేసేం దుకు ఆప్రాంతం నుంచి మహిళా కూలీలతో పొట్టెంపాడు గ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో మల్లుగుంట సంఘం వద్దకు వచ్చేసరికి అక్కడ ఉన్న మలుపులో మోటార్‌బైక్ రావడంతో తప్పించ బోయి ఆటో బోల్తాపడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న పలుకూరి వారిపాళెనికి చెందిన మల్లి లక్ష్మీదేవి (59) అక్కడికక్కడే మృతి చెందగా, చల్లా రమణమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు క్షతగాత్రులను సమీపంలోని సర్వేపల్లికి తీసుకెళ్లగా అక్కడినుంచి 108 వాహనంలో నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు సోమిరెడ్డి పరామర్శ

కాగా, రోడ్డు ప్రమాద బాధితులను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరామర్శించారు. నెల్లూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వద్దకు వెళ్లి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

మట్టి అక్రమ రవాణాపై మైనింగ్ అధికారుల విచారణ



మట్టి అక్రమ రవాణా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు


తోటపల్లిగూడూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు పంచాయతీ మహాలక్ష్మీపురం గ్రామంలో మట్టి అక్రమ రవాణాపై శుక్రవారం మైనింగ్ శాఖకు చెందిన టెక్నికల్ అసిస్టెంట్ ఆర్ వెంకటేశ్వర్లు, సర్వే సూపర్‌వైజర్ ఎం సుధాకర్ విచారణ చేపట్టారు. మట్టి తోలకాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి అక్రమంగా మట్టి తోలిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు, మండల సర్వేయర్ ఎస్‌కె మహబూబ్‌బాషా, ఆర్‌ఐ సి యశ్వంత్, వీఆర్‌వో రవిదర్శిని, కోడూరు సచివాలయ సర్వేయర్ బి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌డీవో వ్యవస్థ బలోపేతం

- కీలక అధికారాలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

నెల్లూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణాభివృద్ధిలో కీలకమైన పంచాయతీ రాజ్ విభాగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకూ అభివృద్ధి పర్యవేక్షణలో మండల స్థాయి తర్వాత జిల్లా స్థాయిలోనే ఉండేది. రెవెన్యూ వ్యవస్థ మాదిరిగా డివిజనల్ వ్యవస్థ పంచాయతీ రాజ్‌లో ఉండేది కాదు. ఇకపై డివిజనల్ స్థాయిలో కూడా అభివృద్ధి పనుల పర్యవేక్షణకు ఒక ప్రత్యేక వ్యవస్థకు రూపొందిస్తూ, ఇప్పటికే ఉన్న డీఎల్‌డీవోలకు మరిన్ని అధికారాలు కట్టబెట్టింది. గత ప్రభుత్వంలో డీఎల్‌డీవో (డివిజనల్ స్థాయి అభివృద్ధి అధికారి) పోస్టులను ఏర్పాటు చేశారు. నాడు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఎంపీడీవోల ప్రొమోషన్స్ కోసం ఈ పోస్టులను సృష్టించారు తప్ప ఆ అధికారుల చేత పని చేయించుకుందామన్న ఉద్దేశం కనిపించలేదు. ఈ డీఎల్‌డీవోలకు కనీసం ఒక కార్యాలయం కూడా లేదు. ఎంపీడీవో కార్యాలయాల్లోనే ఏదో ఒక మూల ఒక గదిని కేటాయించారు. విధులు కూడా కేటాయించకపోవడంతో ఆ పోస్టులు అన్నవి నామమాత్రంగా మారిపోయాయి. అయితే వీరంతా సీనియర్ ఎంపీడీవోలుగా ఉండి ఉద్యోగోన్నతి పొందిన వారు కావడంతో, వారి అనుభవాన్ని ఉపయోగించుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రెవెన్యూలో ఆర్డీవో మాదిరిగా రూరల్ డెవలప్‌మెంట్‌లో డీఎల్‌డీవో ఉండే విధంగా జాబ్‌చార్ట్‌ను సవరించింది. జిల్లాలో నెల్లూరు, కావలి, ఆత్మకూరు, కందుకూరు డీఎల్‌డీవోలు ఉన్నారు. ఈ నాలుగు ప్రాంతాల్లోనూ డీఎల్‌డీవో కార్యాలయాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం నెల్లూరు డీఎల్‌డీవో ఆఫీసు ఎంపీడీవో కార్యాలయం మిద్దెపై ఒక రూములో కొనసాగుతోంది. ఇకపై దానిని ఆర్టీసీ బస్టాండ్ పక్కనున్న మీసేవా భవనంలోకి మార్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటి వరకూ ఇద్దరు మాత్రమే డీఎల్‌డీవోలకు సహాయకులుగా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. ఇకపై వీరి కార్యాలయంలో రెగ్యులర్ ప్రాతిపదికన 15 మంది వరకూ పనిచేసేలా జాబ్‌చార్ట్ తయారు చేశారు. వీరి కిందకు ఎంపీడీవోలు, డివిజనల్ పంచాయతీ అధికారులు, డ్వామా ఏపీడీలను తీసుకురానున్నారు. మండల పరిషత్‌లలో జరిగే అభివృద్ధి పనులను పర్యవేక్షించడంతో పాటు ఉపాధి హామీ పథకం కింద జరిగే పనులను కూడా పర్యవేక్షించే బాధ్యతలను డీఎల్‌డీవోలకు అప్పగించారు. మొత్తంగా డివిజన్ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించే శాఖలన్నింటినీ ఒక గొడుగు కిందకు తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీని ద్వారా అభివృద్ధిని వేగవంతం చేయవచ్చునన్నది ప్రభుత్వ లక్ష్యం. అలానే ఇప్పటి వరకూ స్థానిక సంస్థల ఎన్నికలకు డిప్యూటీ డిస్ట్రిక్ట్ ఎలక్షన్ అథారిటీలుగా ఆర్డీవోలు వ్యవహరిస్తుండగా, ఇకపై ఆ విధులను డీఎల్‌డీవోలకు అప్పగించనున్నారు. రెవెన్యూలో మాదిరిగా పంచాయతీరాజ్‌లో కూడా డివిజన్ స్థాయిలో ఒక సమాంతర వ్యవస్థ ఏర్పాటవుతుండడం శుభపరిణామమని పంచాయతీరాజ్ వర్గాలు చెబుతున్నాయి.

కోటేశ్వరస్వామికి పురుషామృగ వాహన సేవ



సంగం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో ఉన్న గంగా పార్వతీ సమేత కోటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అర్ధరాత్రి పార్వతీ, కోటేశ్వరస్వామి పురుషామృగ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పార్వతీదేవి, కోటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను పురుషామృగ వాహనంపై ఉంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ పూజారి చదలవాడ శివకుమార్ చార్యులు తీర్థప్రసాదాలు అందచేశారు.

ప్యాకేజీ-1పై విజిలెన్స్

- విచారణకు ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం
- రికార్డులన్నీ ఇవ్వాలంటూ విజిలెన్స్ అధికారుల లేఖ
- కదిలించిన 'ఆంధ్రజ్యోతి' కథనాలు
- అవినీతి అధికారుల్లో మొదలైన వణుకు

నెల్లూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పెన్నా డెల్టా సిస్టమ్‌ను ఆధునికీకరించేందుకు 2008-09లో రూ.308 కోట్ల అంచనాలతో ప్యాకేజీ-1 పేరుతో టెండర్లు పిలిచారు. మోడరనైజేషన్ చేయడమే కాకుండా 124 డిస్ట్రిబ్యూటరీ కాలువలకు సీసీ లైనింగ్ ఏర్పాటు చేయాలన్నది ఉద్దేశం. ఈ వర్కును అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత ఓ వైసీపీ కీలక నేత 4.95 శాతం ఎక్సెస్‌కు దక్కించుకున్నారు. అయితే ఈ వర్కు నిబంధనల ప్రకారం పనులు జరగలేదని,, కాలువల లైనింగ్ వెడల్పులను తగ్గించి పనులు చేశారని గతంలోనే అధికారులకు ఫిర్యాదులు అందాయి. అయినా ఎవరూ పట్టించుకోలేదు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్యాకేజీ-1 వర్కును ప్రీక్లోజ్ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. 2020, జూలైలో ప్రీక్లోజ్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ప్రీక్లోజ్‌లో భాగంగా అప్పటి వరకూ కాంట్రాక్టర్ చేసిన పనులన్నింటికీ ఎంబుక్ రికార్డింగ్ చేసి, వాటికి చెక్ మెజర్మెంట్ చేశారు. ఫైనల్ బిల్లు మొత్తం రూ.67 కోట్లు చెల్లించాలని తేల్చారు. ఈ మేరకు చేసిన పనులను పరిశీలించి క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్ జారీ చేయాలని నెల్లూరు సెంట్రల్ డివిజన్ ఈఈ నుంచి 2021 ఫిబ్రవరిలో క్వాలిటీ కంట్రోల్ ఈఈకు లేఖ వెళ్లింది. ఈ రిక్విజిషన్ ప్రకారం మొదట క్యూసీ అధికారులు సర్టిఫికెట్లు జారీ చేశారు. ఇందులో ఒక సర్టిఫికెట్లో దిద్దుబాటు చేసి రూ.4.12 కోట్లను అదనంగా చేర్చారు. ఇదే పేరుతో మరో రూ.4.40 కోట్లతో మరో సర్టిఫికెట్‌ను జారీ చేశారు. ఇక ప్రభుత్వం ప్రీక్లోజ్ చేశాక సీఈ అంచనాలు రివైజ్ చేయడం కూడా మరో వివాదంగా ఉంది. ఇక ఇందులో బ్యాంక్ కమీషన్ చార్జీలకు రూ.50 లక్షలకు అనుమతి ఇవ్వగా బిల్లులో మాత్రం దాదాపు రూ.2 కోట్లకుపైగా పెట్టినట్లు ఫిర్యాదులున్నాయి. ఇలా ఒక లెక్కా పక్కా లేకుండా ఇష్టమొచ్చినట్లు ప్యాకేజీ-1 ప్రీక్లోజ్ ప్రక్రియ జరిగింది.



మార్చి 29న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

కదిలించిన 'ఆంధ్రజ్యోతి'

ప్యాకేజీ-1లో జరిగిన అవకతవకలను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. మార్చి, ఏప్రిల్ నెలల్లో వరుస కథనాలు ప్రచురించింది. 'దోచిపెట్టడానికే దిద్దారా..?', 'ప్యాకేజీ-1లో ఎన్నెన్నో సిత్రాలు..!', 'అంతా గప్‌చుప్', 'ప్యాకేజీ-1 ఫైళ్లు మాయం!' శీర్షికలతో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఇరిగేషన్ అధికారులు చేసిన జిమ్మిక్కులను, అనుమానాలను ఈ కథనాలు బట్టబయలు చేశాయి. ఈ కథనాలపై స్పందించిన కలెక్టర్ ఓ ఆనంద్.. ప్యాకేజీ-1 వర్కుపై నివేదిక ఇవ్వాలని ఇరిగేషన్ ఎస్‌ఈ దేశానాయక్‌ను ఆదేశించారు. ఈ క్రమంలో ఆరోపణలపై వివరణ ఇవ్వాలంటూ సెంట్రల్ డివిజన్ ఈఈకు ఎస్‌ఈ మెమో జారీ చేశారు. అయినా సమాధానం రాకపోవడంతో మరోసారి మెమో ఇచ్చారు. ఆ తర్వాత పూర్తిస్థాయి విచారణకు డిప్యూటీ ఎస్‌ఈను నియమించారు. అయినా విచారణ పూర్తికాలేదు. కలెక్టర్‌కు నివేదిక అందలేదు. దీనిని బట్టి ఇరిగేషన్ శాఖలో పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ప్రభుత్వం ప్యాకేజీ-1 వ్యవహారాన్ని విజిలెన్స్‌కు అప్పగించింది. 17వ తేదీ లోపు అడ్మినిస్ట్రేటివ్ అనుమతులు, టెక్నికల్ అనుమతులు, అగ్రిమెంటు కాపీలు, టెండర్ డాక్యుమెంట్లు, ఎంబుక్‌లు, క్యూసీ రిపోర్టులు, బిల్లుల వారీగా పేమెంట్ వివరాలు, ప్రీక్లోజర్ ప్రతిపాదనలు, ప్రీక్లోజర్ అగ్రిమెంట్లతో పాటు ఇందుకు సంబంధించిన పర్యవేక్షించిన అధికారుల జాబితాను కూడా ఇవ్వాలంటూ విజిలెన్స్ అధికారులు కోరారు. ఈ వివరాలు అందగానే విజిలెన్స్ అధికారులు విచారణ మొదలుకానుంది. ఈ వ్యవహారం ఇప్పుడు ఇరిగేషన్ శాఖలో కలకలాన్ని రేపుతుండగా, సంబంధిత అధికారుల్లో మాత్రం వణుకు మొదలైంది.

వైద్య ఆరోగ్య శాఖలో ఉగ్యోగుల బదిలీలు

- 19న ముగియనున్న ప్రక్రియ

నెల్లూరు (వైద్యం) జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖలో బదిలీలు పర్వం కొనసాగుతోంది. డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత ఆధ్వర్యంలో ఈ ఉద్యోగుల బదిలీలు జరుగుతున్నాయి. అయితే ఐదేళ్లు ఒకేచోట ఉన్నవారు తప్పనిసరిగా బదిలీ కావాలసి ఉండటంతో ఉద్యోగులు తాము పనిచేస్తున్న ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలకు దగ్గరలోని పీహెచ్‌సీలకు మారేందుకు వైద్యాధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నేతల సిఫారసు లేఖలు కూడా తమ దరఖాస్తులో పొందుపరుస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే శుక్రవారం జరిగిన బదిలీల కౌన్సెలింగ్‌లో ఉదోగ్యుల పెద్ద ఎత్తున జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు తరలివచ్చారు. దీంతో డీఎంహెచ్‌వో కార్యాలయం సందడిగా మారింది. రెండు రోజుల వరకు 19 మంది అటెండర్లు, 9 మంది జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లకు కౌన్సెలింగ్ జరిగింది. ఆది, సోమవారాలలో 101 మంది ఏఎన్ఎంలకు కౌన్సెలింగ్ ప్రారంభమవుతుంది. 19న ఈ ప్రక్రియ ముగుస్తుంది.



ఉద్యోగుల కౌన్సెలింగ్ జరుపుతున్న డీఎంహెచ్‌వో సుజాత